తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 29.08.2026 | సంపుటి :13 సంచిక : 40 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







వరదలో చిక్కుకున్న వృద్ధురాలిని సురక్షితంగా కాపాడి తీసుకొస్తున్న సహాయక సిబ్బంది

# శవాల గుట్టగా నేపాల్

## 579కి చేరుకున్న మృతుల సంఖ్య

## 1924 మంది గల్లంతు

## నదిలో కిలోమీటర్ల మేర కొట్టుకొచ్చిన మృతదేహాలు

*నేపాల్‌లో మెరుపు వరద విలయంలో మృతుల సంఖ్య 579కి చేరగా, ఏకంగా 1,924 మంది గల్లంతు అయ్యారని ఆ దేశ విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. మృతదేహాలు నదిలో కిలోమీటర్ల మేర కొట్టుకొచ్చాయి. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేపాల్‌లో రసువా జిల్లాలో కొన్ని అడుగుల ఎత్తున మొదలైన వరద, బురద ప్రవాహం పోటెత్తి దిగువకు ప్రవహించి పలు జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోయాయి. పరుగెత్తుతున్న ప్రజలను వరద కమ్మేసింది. జంతువులు, చెట్లు వరదలో కలిసిపోయాయి. భూకంపంతో మంచు, రాళ్లు, శిథిలాలు కొట్టుకొచ్చి లిండే నదిలో ప్రవాహానికి తాత్కాలికంగా అడ్డుపడ్డాయి. అడ్డంకి తొలగిపోగానే అది ఉప్పెనై భారీగా వరద, బురద దిగువకు పోటెత్తింది. అది భోటే కోశీ, త్రిశూలి నదుల ప్రవాహాన్ని బీభత్సం చేసింది. టిబెట్‌లోనూ వరద భారీ విధ్వంసం సృష్టించింది. భవనాలకు భవనాలే నేలమట్టమయ్యాయి.*

- కొనసాగుతున్న సహాయక చర్యలు
- 320 మంది భారతీయులు గల్లంతు త్రిశూలి హైడ్రోపవర్ ప్రాజెక్టు
- సొరంగంలో చిక్కుకున్న 350 మందిని కాపాడిన నేపాల్ సైన్యం
- వీరిలో భారతీయులు 63 మంది..



ఖాట్మండు(జనంసాక్షి): నేపాల్ వరదల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను రెస్క్యూ బృందాలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 547 మృతదేహాలు వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఈ విపత్తులో ఇప్పటివరకు 1473 మంది గాయాలపాలైనట్లు పేర్కొన్నారు. మరోవైపు, నేపాల్‌లో 320 మంది భారతీయల ఆచూకీ ఇంకా తెలియలేదని భారత విదేశాంగశాఖ వెల్లడించింది. చైనా వైపు 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని, వారిలో 96 మంది రోడ్డు మార్గంలో సురక్షితంగా నేపాల్‌లోకి ప్రవేశించారని పేర్కొంది. మరో 21 మంది కాఠ్‌మాండూ

మిగతా 2లో..





## పొంచిఉన్న మరో పెనుముప్పు

- ఏ క్షణాన ఏం జరుగుతుందో.. పొంగిపొర్లుతోన్న సరస్సు
- నేపాల్‌లో హైటెన్షన్

ఖాట్మండు(జనంసాక్షి):హిమాలయదేశం నేపాల్‌కు వరదముప్పు పూర్తిగా తొలగిపోలేదు. ఆకస్మిక వరదలు వచ్చిన రెండు రోజుల తర్వాత టిబెట్ వైపున ఉన్న ఒక సరస్సు కట్టలు తెంచుకొని ప్రవహిస్తోందని నేపాల్ వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతోన్న బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని హెచ్చరించింది.“టిబెట్ వైపున ఒక సరస్సు నుంచి నీరు పొంగిపొర్లుతోందనే సమాచారం ఉంది. సహా యక చర్యల్లో పాల్గొంటున్న బృందాలు, భద్రతా సిబ్బంది, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అంతా సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలి” అని నేపాల్

మిగతా 2లో..

---

## మంత్రి పొన్నంకు ‘సర్’ నోటీసు

**మంత్రి తండ్రి పేరు తప్పుగా పడడంతో బీఎల్‌వో నోటీసులు**

కరీంనగర్(జనంసాక్షి): ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నోటీసు వచ్చింది. మంత్రి తండ్రి పేరు తప్పుగా పడడంతో బీఎల్‌వో నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించిన మంత్రి.. తండ్రి పేరు సవరణకు తగిన పత్రాలను బీఎల్‌వోకు అందజేశారు.



## రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించండి

- అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- సుప్రీంకోర్టు, సీడబ్ల్యూసీ, కేఆర్‌ఎంబీలో వాదించాల్సిన అంశాలపై చర్చ
- మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు రాష్ట్ర వైఖరిని స్పష్టం చేయాలని ఆదేశం



హైదరాబాద్(జనంసాక్షి): అంతర్రాష్ట్ర జల వివాదాలపై వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై చర్చించినట్లు తెలుస్తోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు, కేంద్ర జల వనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు.

**కీలకంగా కేఆర్ఎంబీ సమావేశం**

ఈనెల 26న జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డులో ప్రభుత్వం తమ అభ్యంతరాలను వివరించింది. ఈఎన్సీ జనరల్ రమేశ్‌బాబు 2027 ఆగస్టు వరకు తాగునీటి అవసరాల కోసం 112 టీఎంసీల నీటిని కేటాయించాలని బోర్డును కోరారు. ఈ మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో అవసరమైన నీటి

మిగతా 2లో..

## పోరుబాటలో తెలంగాణ

**రైతు నుంచి ఉద్యోగి వరకు.. విద్యార్థి నుంచి ఆటో కార్మికుడి దాకా..**




**తెలంగాణలో గత రెండు నెలలుగా వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనల బాట పట్టడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఆర్టీసీ కార్మికులు, ఆటో క్యాబ్ డ్రైవర్లు, ఆశా కార్యకర్తలు, ఆదివాసీలు.. ఇలా అనేక వర్గాలు తమ డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కాయి. ఒక వర్గం సమస్యను పరిష్కరించేలోపే మరో వర్గం నిరసనకు దిగుతున్న పరిస్థితి ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతోంది.**

- సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కుతున్న ఆయా వర్గాలు
- భూభారతి బాధితుల గళం
- హామీల అమలుపై పెరుగుతున్న ఒత్తిడి
- ప్రభుత్వం చొరవ చూపాలి.. చర్చలు జరపాలి

హైదరాబాద్ (జనంసాక్షి) : గత రెండు నెలల్లో తెలంగాణలో ఆందోళనలు ఒకే వర్గానికి పరిమితం కాలేదు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఆర్టీసీ కార్మికులు, ఆటో క్యాబ్ డ్రైవర్లు, ఆశా కార్యకర్తలు, ఆదివాసీలు, బీసీ వర్గాలు నిరసనల బాటపట్టాయి. వ్యవసాయమే ఆధారంగా ఉన్న తెలంగాణలో రైతుకు సకాలంలో యూరియా అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పంట కాలంలో అవసరమైన ఎరువుల కోసం రైతు పొలం వదిలి రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది ప్రభుత్వ యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన ప్రశ్న. రైతు సమస్యను ముందుగానే గుర్తించి పరిష్కరించాల్సిన వ్యవస్థ.. సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం ఎంతవరకు సమర్థనీయం అన్న చర్చ మొదలైంది. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు దిగుతున్నారు. మరోవైపు అలోపతి విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ ఇవ్వాలని ఆయుష్ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. సమాన విద్య, సమాన అవకాశాల గురించి మాట్లాడుతున్నప్పుడు.. ఒకే విద్యా వ్యవస్థలోని విద్యార్థుల

మిగతా 2లో..

## లోతైన విశ్లేషణతోనే నేరాలపై కట్టడి

- పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి
- నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానంపై ఆరా తీయాలి
- నేర నియంత్రణలో సాంకేతికతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి
- హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు..
- తెలంగాణలో పెరిగిన క్రైమ్ : డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్,ఆగస్ట్28(జనంసాక్షి): నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, ఆయా కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు పలు కీలక అంశాలపై డీజీపీ దిశా నిర్దేశం చేశారు. సాంకేతికతను నేర నియంత్రణకు సాధనంగా వినియోగించాలని

మిగతా 2లో..

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లక్కీడ్రా ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

హైదరాబాద్(జనంసాక్షి): క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో ఫ్లాట్లను లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయిస్తున్నారు. మొదటి దఫాలో 7,350 ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించనున్న ప్రభుత్వం కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లక్కీడ్రా నిర్వహించింది. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని లక్కీడ్రాలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అర్హులైన పేదలందరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రూ. వందల కోట్లు ధర పలికే భూముల్లోనూ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మొదటివిడతలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామని, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామన్నారు. 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తిచేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు



మిగతా 2లో..

## హర్మూజ్‌లో సీమైన్స్‌ను తొలగించేశాం

అమెరికా ప్రకటన

2లో..

## భారత్‌కు అమెరికా ‘జావెలిన్’..

మన అమ్ముల పొదిలో మరో అస్త్రం

2లో..

## కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

- జంతు సంరక్షణలో పక్షులు కూడా భాగమే
- కోడి పందాలను సాంస్కృతిక వారసత్వంగా గుర్తించలేం
- సినిమాలు, ఆచారాలు చూపి..పందాలను నడపడం సాధ్యం కాదు
- మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టీకరణ

## చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద..

**తొలి భారత గ్రాండ్ మాస్టర్‌గా ఘనత**

**చెస్ మాస్టర్‌కు సీఎం రేవంత్ అభినందనలు**



హైదరాబాద్(జనంసాక్షి): భారత యువ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. గ్రాండ్ చెస్ టూర్ విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ఘనత సాధించాడు. డిఫెండింగ్ ఛాంపియన్ ఫాబియానో కరువానాపై ప్రజ్ఞానంద 15-13 తేడాతో విజయం సాధించాడు. ఆఖరి రోజు ఆట ప్రారంభంలో 6 పాయింట్ల వెనుకంజలో ఉన్న ప్రజ్ఞానంద.. వరుసగా రెండు ర్యాపిడ్ గేమ్‌లను గెలిచి ఆధిక్యంలోకి వచ్చాడు. దీంతో గ్రాండ్ చెస్ టూర్‌లో తొలి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు రూ.2 కోట్ల ప్రైజ్‌మనీని ప్రజ్ఞానంద గెలుచుకున్నాడు. దీంతో వచ్చే ఏడాది జరిగే గ్రాండ్ చెస్ టూర్‌కు నేరుగా అర్హత సాధించాడు. “ఇవాళ నేను గెలిచే అవకాశాలు వస్తాయని అనుకోలేదు. ఆరు పాయింట్లు వెనుకబడి ఉన్నా.

మిగతా 2లో..

# కోడిపందాలను చట్టబద్ధం చేయలేం

చెన్నై,ఆగస్ట్28(జనంసాక్షి):కోడిపందేలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ పందేలు నిర్వహించడం చట్టపరిధిలో పూర్తిగా నిషేధమని మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టం చేసింది. గతంలో అనుమతులిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టపరంగా చెల్లవని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. కోడిపందేల నిర్వహణ పౌరుల ప్రాథమిక హక్కు కాదని తేల్చిచెప్పారు. జంతు హింస నిరోధక చట్టం-1960 ప్రకారం కోడిపందేలు తీవ్ర నేరమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. 'రిట్ ఆఫ్ మాండమస్' కింద అనుమతులు జారీ చేయలేమని తేల్చిచెప్పారు. కోడిపందేలకు 'సంస్కృతి' హోదా ఇవ్వలేమని పేర్కొన్నారు. సినిమాలు, ఆచారాల్లో ప్రసిద్ధి చెందినంత మాత్రాన ఈ పందేలను సాంస్కృతిక క్రీడగా గుర్తించలేమని తెలిపారు. జల్లికట్టు తరహాలో ప్రత్యేక చట్టసవరణ లేనంతవరకు మినహాయింపులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. కత్తులు కట్టకపోయినా పందేలు నేరమేనని చెప్పుకొచ్చారు. కత్తులు లేవనే సాకుతో ఈ పందేలకు అనుమతి కోరిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. జంతు సంక్షేమ చట్టంలో 'పక్షులు' కూడా భాగమేనని స్పష్టం చేశారు. జల్లికట్టు లాగా ప్రత్యేక చట్టసవరణ తీసుకువస్తేనే మినహాయింపు దక్కుతుందని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ స్పష్టం చేశారు. గతంలో కోడిపందేలకు అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. గత తీర్పులను భవిష్యత్తు కేసుల్లో నిదర్శనంగా పరిగణించరాదని తెలిపారు. ఆయా షరతులతో కోడిపందేలకు అనుమతి ఇచ్చిన పాత ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్‌లో కీలక తీర్పు వెల్లడించారు. కత్తులు కట్టకుండా నిర్వహించినా కోడిపందేలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. పక్షులకు గాయాలు కాకుండా చూడాలనే షరతులతో ఇచ్చిన పాత అనుమతులు కూడా చట్టానికి విరుద్ధమేనని తెలిపారు. జంతు హింస నిరోధక చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించి ఈ పందేలకు అనుమతి ఇవ్వలేమని అన్నారు. కోడిపందేలకు అనుమతి ఇచ్చిన గత డివిజన్ బెంచ్ ఉత్తర్వులు 'పూర్తిగా అనవసరం' అని వ్యాఖ్యానించారు. తంజావూరు జిల్లా కలెక్టర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌కు మద్రాస్ హైకోర్టు అనుకూల తీర్పు ఇచ్చింది.

# బీసీ, ఈబీసీ విద్యార్థులకు చేయూత

### విదేశీ విద్యకోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం

### సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులను స్వీకరణ

**హైదరాబాద్,ఆగస్ట్28(జనంసాక్షి):** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తులను తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థులకు అవకాశం లభిస్తుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలి.విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. జిఆర్ఇ, జిమాట్ స్కోర్‌తో పాటు టోఫెల్ తదితర పరీక్షల్లో అవసరమైన స్కోర్ సాధించి ఉండాలి. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యం ఉన్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి మంచి అవకాశాన్ని అందిస్తోంది.

# భారత్‌కు అమెరికా 'జావెలిన్'..

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన జావెలిన్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు అమెరికాతో భారత్‌కు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని మన దేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ శుక్రవారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య సమర్థవంతమైన ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాన్ని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.యూఎస్ ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రక్రియలో భాగంగా ఈ క్షిపణుల కొనుగోలుకు సంబంధించిన అంగీకార పత్రాలపై భారత సైన్యం తాజాగా సంతకం చేసింది. అయితే, ఒప్పందంలో భాగంగా ఎన్ని క్షిపణులను మన దేశం కొనుగోలు చేస్తోంది..? మొత్తం ఖర్చెంత..? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు.

ఏంటీ 'జావెలిన్' ప్రత్యేకత..?

జావెలిన్ ట్యాంక్ విధ్వంసకర క్షిపణిదీనిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్‌పైకి విధ్వంసకర ఆయుధాలను ప్రయోగించినప్పుడు.. ఆ ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు.

# శవాల గుట్టగా నేపాల్

నుంచి ఢిల్లీకి చేరు కున్నారని తెలిపింది.నదీ పరివాహక ప్రాంతంలో మృతదేహాలను వెలికితీసే ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగు తున్నాయి. ఈ క్రమంలో యూపీలోని మహారాజ్‌గంజ్ జిల్లాలో నాలుగు, కుషీ నగర్ జిల్లాలో మూడు మృతదేహాలు లభ్యమయ్యాయని అధికారులు వెల్లడిం చారు. ఇవి నేపాల్ నుంచి కొట్టుకువచ్చి నట్లు భావిస్తున్నామని మహారాజ్‌గంజ్ జిల్లా మెజిస్ట్రేట్ గౌరవ్ సింగ్ సోగార్వాల్ తెలిపారు. ఈ మృతదేహాలు ఎవరివనే విషయం ఇంకా నిర్ధరణ కాలేదని, ఇదే విషయంపై నేపాల్ అధికారులతో సంప్ర దింపులు జరుపుతున్నట్లు చెప్పారు. టిబెట్‌లోని చైనా-నేపాల్ సరిహద్దులో ఉన్న గిరోంగ్ కౌంటీలో సంభవించిన ఆక స్మిక వరదల్లో 558 మంది గల్లంతైనట్లు చైనా వెల్లడించింది. ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. గల్లంతైన వారిలో 260 మంది విదేశీయులే ఉన్నారని పేర్కొన్నప్పటికీ వారి వివరాలు మాత్రం వెల్లడించలేదు.ఇదిలా ఉంటే, టిబెట్ వైపున ఉన్న ఒక సరస్సు కట్టలు తెంచుకొని ప్రవహిస్తోందని నేపాల్ వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాం తంలో సహాయక చర్యలు చేపడుతోన్న బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించింది.

**బురదతో నిండిన సొరంగం..**

నేపాల్‌లో సంభవించిన విపత్తులో ఆచూకీ గల్లంతైన వారికోసం సెర్చ్ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో త్రిశూలి 3ఏ హైడ్రోపవర్ ప్రాజెక్టు వద్ద సొరంగంలో చిక్కుకున్న వారిలో 350 మందిని నేపాల్ సైన్యం కాపాడింది. వీరిలో 63 మంది భారతీయులు ఉన్నట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. ప్రతికూల వాతావరణం, వేగంగా ప్రవహిస్తోన్న వరద, ప్రమాదకరమైన, సవాళ్లతో కూడిన భౌగోళిక పరిస్థితులు ఉన్నప్పటికీ.. సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించే పనిలో నిమగ్నమైనట్లు తెలిపింది. అందులో చిక్కుకుపోయిన మరో 100 మందిని బయటకు తీసుకువచ్చేందుకు రెస్క్యూ బృందాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొంది.వరదల్లో గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు, మృత దేహాల వెలికితీత విషయంలో జాప్యం జరుగుతోందని ఫిర్యాదులు వస్తోన్న నేపథ్యంలో నేపాల్ సైన్యం రెస్క్యూ ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసింది. మరిన్ని ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి మృతదేహాలను వేగంగా వెలికితీసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం రసువా నుంచి చిత్వాన్ వరకు నదీ మార్గంలోనే 1200 మంది సైనికులను మోహరించినట్లు తెలిపింది. మొత్తంగా రెస్క్యూ ఆపరేషన్ కోసం 2800 మంది సైనికులు క్షేత్రస్థాయిలో ఉన్నట్లు వెల్లడించింది.

భారత్‌కు సురక్షితంగా చేరుకున్న 21మంది

నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 21 మంది భారతీయులు సురక్షితంగా దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్నారని కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. వీరంతా వారి స్వస్థలం తమిళనాడు చేరుకున్నారని వివరించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. నేపాల్‌లోని త్రిశూలి హైడ్రో పవర్ ప్రాజెక్టులో పని చేస్తున్న 63 మంది భారతీయులను కూడా రక్షించారని తెలిపారు. అయితే నేపాల్ వరదలకు 320 మంది భారతీయులు, 100 మంది ఎన్నారైలు గల్లంతయ్యారని చెప్పారు. కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి వీరంతా గల్లంతయ్యారని పేర్కొన్నారు. అయితే చైనా వైపు టిబెట్‌లో 400 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని అన్నారు. వారందరితో భారత రాయబార కార్యాలయం సంబంధాలు కలిగి ఉందని తెలిపారు. త్వరలో వారందరూ భారత్‌కు తిరిగి వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు.

## పొంచిఉన్న మరో పెనుముప్పు

పోలీసులు హెచ్చరించారు. సరస్సులో నీటి ప్రవాహం పెరుగుతోందని రసువా జిల్లా ఉన్నతాధికారి నరేంద్ర పరియార్ వెల్లడించారు. దీంతో స్థానికులు కొండ ప్రాంతాలవైపు తరలివెళ్తున్నారని తెలుస్తోంది.హిమానీనదం (గ్లేసియర్) విరిగిపడటం నేపాల్‌లో బుధవారం నాటి జల ప్రళయానికి కారణమైంది. ఆ విపత్తు వల్ల పేరుకుపోయిన పెద్ద రాళ్లు, బురద, మంచు, ఇతర శిథిలాలతో టిబెట్ వైపున ఒక సరస్సు ఏర్పడింది. అక్కడ నీటి పరిమాణం పెరగడంతో ప్రస్తుతం అది పొంగిపొర్లుతోంది. దీంతో చైనా కూడా సహాయక చర్యలు నిలిపివేసింది. టిబెట్‌లో మళ్లీ వరదముప్పు పొంచి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పరిస్థితులను సమీక్షించారు. టిబెట్ సరిహద్దులోని భోటే కోషి నదీ ప్రవాహం మొదలయ్యే దగ్గర కొత్తగా ఓ సరస్సు ఏర్పడిందని నేపాల్‌కు చైనా ఇప్పటికే అలర్ట్ ఇచ్చింది. గురువారం ఉదయం నాటికి 20లక్షల క్యూబిక్ మీటర్ల నీటితో ఉన్న ఈ సరస్సులోకి.. మూడు రోజుల్లో మరో 30లక్షల క్యూ.మీ నీరు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. దీంతో అది తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించండి

నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ కోరింది. అలాగే తాగునీటి అవసరాల కోసం తమకు 47 టీఎంసీలు కేటాయించలన్న ఏపీ ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. తదుపరి సెప్టెంబర్ నాలుగున జరిగే తదుపరి సమావేశంలోనూ తెలంగాణ ప్రభుత్వ ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాపాతం లోటును దృష్టిలో ఉంచుకొని తాగునీటి విషయంలో రాజీ పడకుండా ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

# చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద..

ఇలాంటప్పుడే ఎలా ఆడాలో చూపించా. ఫాబి వంటి ప్లేయర్‌పై ఒక్క మ్యాచ్ గెలవడమే కష్టం. ర్యాపిడ్‌లో రెండు గేమ్‌ల్లో విజయం సాధించా. గతేడాది నుంచి నా ర్యాపిడ్, బ్లిట్జ్ గేమ్‌లో మార్పులు చేసుకున్నా. ఇప్పుడు ఆ ఫలితం కనిపించింది. ఈ ఫార్మాట్‌లో మెరుగయ్యాననే అనుకుంటున్నా" అని తెలిపాడు.

**చెస్ మాస్టర్ ప్రజ్ఞానందకు సిఎం రేవంత్ అభినందనలు**

అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని, చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీయువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# హర్మూజ్‌లో సీమైన్స్‌ను తొలగించేశాం

**వాషింగ్టన్(జనంసాక్షి):**

హర్మూజ్ జలసంధి తమ ఆధీనంలో ఉందని నిరూపించుకొనేందుకు అమెరికా కీలక అడుగు వేసింది. ఇప్పుడు ఆ జలసంధి సురక్షితం అనే భావన ప్రపంచానికి కల్పించేందుకు అత్యంతక కీలక ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభంకాగానే హర్మూజ్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్న ఇరాన్ దానిలోని అంతర్జాతీయ నౌకా మార్గాల్లో సీమైన్స్‌ను పరిచింది. దాంతో ఇరాన్ చెప్పిన మార్గంలో ఇతర మార్గాల్లో వెళ్లిన పలు నౌకలు వాటిని ఢీకొని పేలిపోయిన సంగతి తెలిసిందే. నౌకాయానానికి ఆటంకం కలిగిస్తోన్న ఆ సీమైన్స్‌ను పూర్తిగా తొలగించినట్లు తాజాగా యూఎస్ సెంట్రల్ కమాండ్ సంచలన ప్రకటన చేసింది. వీటి తొలగింపు ఆపరేషన్ రహస్యంగా చేపట్టినట్లు పేర్కొంది. వాస్తవానికి ఈ సీమైన్స్ తొలగింపు ఆపరేషన్ అత్యంత సంక్లిష్టమైంది. విశాల సముద్రంలో ఆవగింజ కోసం వెతికినట్లు ఉంటుంది. చాలా కాలంగా ట్రంప్ వీటిని తొలగిస్తామని బలంగా చెబుతున్నారు. కొన్ని నెలల క్రితం వీటిని తొలగించేందుకు అమెరికా రెండు గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్లను రంగంలోకి దింపింది.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎలాంటి ఛార్జీలు వసూలు చేయట్లేదన్నారు. పదేళ్ల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు లబ్ధిదారులకు ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని తాకట్టు పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

**లాటరీలో ఆసక్తికర సన్నివేశం**

హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు లక్కీడ్రా ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి లక్ష్మీగూడలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. లక్కీ డ్రా టోకెన్‌ను ఓ బాలుడితో తీపించగా.. ఆ చిన్నోడి కుటుంబానికే ఇల్లు వరించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ వీడియోను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల తీర్చాలనే ఈ ప్రభుత్వ సంకల్పానికి, దేవుడి ఆశీస్సులు తోడైనట్టు చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే (జరపుల లక్ష్మి) టోకెన్ రావడం తమ అందరినీ ఆనందానికి, ఆశ్చర్యానికి గురిచేసిందని మంత్రి పేర్కొన్నారు. "ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానం. చిన్నారులు స్వచ్ఛమైన మనసు కలిగినవారు. ఆ దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి కల నేరవేరుతున్నందున ఆ కుటుంబం సొంతింటిలో జీవితాంతం చల్లగా బతకాలని, ఆ ఆడబిడ్డను ఆశీర్వదించాను" అని పేర్కొంటూ వీడియోను షేర్ చేశారు. మరోవైపు, నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని, అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన చేస్తారన్నారు. వీరిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.

# ప్రపంచ క్రీడా గమ్యస్థానంగా భారత్

### అదే మోదీ ప్రభుత్వ లక్ష్యం..

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్ వేదికగా 2030 కామన్వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. ఇక 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం బిడ్డింగ్‌ను వేసేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర క్రీడల మంత్రి మాన్‌సుఖ్ మాండవీయ, గుజరాత్ డిప్యూటీ సీఎం హర్ష్ సంఘావి సమీక్ష నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ భేటీ వివరాలను అమిత్ షా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. కామన్వెల్త్ గేమ్స్ సన్నద్ధతపై చర్చించామని.. ఒలింపిక్స్ కోసం బిడ్‌పైనా సమీక్షించినట్లు వెల్లడించారు. "మోదీ ప్రభుత్వం పెద్ద లక్ష్యంతో పనిచేస్తోంది. అంతర్జాతీయ క్రీడా గమ్యస్థానంగా భారత్‌ను నిలపడమే మా ముందున్న టార్గెట్. భారీ ఈవెంట్లను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. అందుకోసం సమీక్ష సమావేశం నిర్వహించాం. 2036 ఒలింపిక్స్ కోసం బిడ్డింగ్ దాఖలుపై చర్చించాం. అహ్మదాబాద్ వేదికగా 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్, 2030 కామన్వెల్త్ గేమ్స్ సన్నాహాలపైనా సమీక్షించాం" అని అమిత్ షా పోస్టు చేశారు.చివరిసారిగా 2010 కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చింది. రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ సీడబ్ల్యూజీ గేమ్స్‌కు హోస్ట్‌గా భారత్ నిలవనుంది. అహ్మదాబాద్ అందుకు వేదిక కానుంది. ఇక 2036 ఒలింపిక్స్‌నూ అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# పోరుబాటలో తెలంగాణ

మధ్య ఆర్థిక ప్రయోజనాల్లో అసమానతలు ఎందుకు ఉండాలన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. విద్యార్థులు తరగతి గదుల్లో ఉండాల్సిన సమయంలో రోడ్డుపైకి రావాల్సి రావడం పాలకులకు ఆలోచించాల్సిన అంశం. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులే తమ సమస్యల కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం జర్నలిస్టులు పోరాడుతున్నారు. ప్రజల తరఫున నిరంతరం పనిచేసే జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన డిమాండ్ల పరిష్కారం కాకపోవడం ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

**22ఏలో చిక్కుకున్న భూముల సంగతేంటి?**

భూభారతి సమస్యలు కూడా సామాన్య ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. తమ స్థలాలను బ్లాక్‌లిస్ట్ ఏ-22 నుంచి తొలగించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. సొంత భూమిపై హక్కును నిరూపించుకోవడానికి యజమానులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం రెవెన్యూ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. సాంకేతికత, కొత్త పోర్టళ్లు వచ్చినా.. క్షేత్రస్థాయిలో ప్రజలకు న్యాయం అందకపోతే సంస్కరణల అసలు లక్ష్యం నెరవేరనట్టే.

**అన్ని జిల్లాల్లోనూ ఆందోళనలు**

జూలైలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట రైతులు నిరసనలు కొనసాగించగా.. ప్రధానంగా అనధికారిక కోతల విషయం వెలుగులోకొచ్చింది. షామీర్‌పేట్, శంషాబాద్ ప్రాంతంలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ హబ్ కోసం 650 ఎకరాల భూమికి ఫెన్సింగ్ చేయడాన్ని రైతులు, స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించడం ఉద్రిక్తతకు దారితీసింది. మహబూబ్‌నగర్‌లోనూ 19వేల పోలీసు ఉద్యోగాల భర్తీ కోసం ధర్నా జరిగింది. హైదరాబాద్‌లో విద్యార్థి సంఘాల ఆందోళనతో పాటు.. ఆగస్ట్ నెలలో పాలిటెక్నిక్ విద్యార్థులు జీఓ 97కు వ్యతిరేకంగా కదంతొక్కారు. ఓ మంత్రి కాన్వాయ్‌ను కూడా అడ్డుకున్నారు. ఇక పీఆర్‌సీ, డీఏ బకాయిలు, ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల డిమాండ్లతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు కనీస వేతనం, వేతన పెంపు తదితర డిమాండ్లపై హైదరాబాద్‌లో నిరసనలు చేపట్టారు. ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా ఆటో, యాప్ ఆధారిత రవాణా కార్మికులు నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

**అనేక అంశాలపై అసంతృప్తులు**

ఇది ఒక్కరోజులో పుట్టుకొచ్చిన పరిస్థితి కాదు. సమస్యలు పరిష్కారం కాకపోవడం.. ఫైళ్లు కదలకపోవడం.. నిర్ణయాల్లో జాప్యం.. అధికారుల స్పందనలో లోపాలు.. హామీలు అమలులోకి రాకపోవడం వంటి అంశాలు ప్రజలను చివరకు ఆందోళనల వైపు నడిపిస్తున్నాయి. ప్రతి సమస్యకు ప్రభుత్వం రోడ్డుపై నిరసన వచ్చిన తర్వాతే స్పందిస్తే.. అది సమర్థవంతమైన పాలనకు సంకేతం కాదు. ప్రస్తుతం వివిధ వర్గాలు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ గొంతు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం దీనిని ప్రతికూలంగా చూడాల్సిన అవసరం లేదు. ఇది ప్రజలతో సంభాషించడానికి వచ్చిన అవకాశం. ఆయా వర్గాలతో నేరుగా చర్చలు జరిపి, ప్రతి డిమాండ్‌పై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ఏ సమస్య ఎప్పటిలోగా పరిష్కరిస్తారో కాలపరిమితితో ప్రకటించాలి. పాలన అంటే కేవలం హామీలు ఇవ్వడం కాదు.. ఇచ్చిన హామీని అమలు చేసి ప్రజలకు ఊరట కల్పించడం. రైతు యూరియా కోసం, విద్యార్థి స్టైఫండ్ కోసం, జర్నలిస్టు హెల్త్ కార్డు కోసం, భూభారతి బాధితుడు తన భూమి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి లేకుండా చూడాలి. మొత్తంగా.. తెలంగాణలో గత రెండు నెలల పరిణామాలను చూస్తే 'హామీల అమలు ఎప్పుడు?' అనే ప్రశ్న అనేక వర్గాల ఆందోళనలకు కేంద్రబిందువుగా మారడం గమనార్హం.

# లోతైన విశ్లేషణతోనే నేరాలపై కట్టడి

- పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి
- నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానంపై ఆరా తీయాలి
- నేర నియంత్రణలో సాంకేతికతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి
- తెలంగాణలో పెరిగిన క్రైమ్
- హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు..
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం

డీజీపీ సూచించారు. సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయని అన్నారు. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడించారు. ఆయా యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరని స్పష్టం చేశారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని మార్గనిర్దేశర చేశారు. ఇటీవల సీసీటీఎన్‌ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న.. సీసీటీఎన్‌ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయా జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 7.15శాతం నేరాలు పెరిగాయని డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల కేసుల్లో 46.10శాతం వృద్ధి సాధించిందని అన్నారు. సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగాయని వివరించారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 2025-26లో 2,84,363కు చేరాయని చెప్పారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని ప్రస్తావించారు. మూడేళ్లలో 46.10 శాతం పెరిగాయని వెల్లడించారు. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు పెరిగి 1,704 శాతం వృద్ధిని నమోదు చేశాయని అన్నారు. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందాయన్నారు. మరోవైపు సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గి 13.29 శాతం, ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం క్షీణించాయని చెప్పారు. తీవ్ర నేరాల్లో 10.33శాతం తగ్గాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

తెలంగాణలో పెరిగిన క్రైమ్..

హైదరాబాద్‌లో తీవ్రమైన నేరాలు తగ్గినట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో నేరాలపై పోలీసు అధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వివరాలు వెల్లడించారు. తెలంగాణలో మూడేళ్లలో నేరాలు 7.15 శాతం పెరిగాయి. 2023-24లో 2,65,377 కేసులు నమోదు కాగా, 2025-26లో వీటి సంఖ్య 2,84,363కు పెరిగింది. డ్రగ్స్ కేసుల్లో 46.10% పెరుగుదల నమోదై 2,026 నుంచి 2,960 కేసులు పెరిగాయి. ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసులు 25 నుంచి 451కి పెరిగాయి. ట్రాఫిక్ నేరాల్లో 9.48% పెరుగుదల నమోదైంది. మరోవైపు సైబర్ క్రైమ్ రేటు 13.29 శాతానికి తగ్గింది. ఆర్థిక నేరాలు 13.28%, తీవ్ర నేరాలు 10.33 శాతానికి తగ్గాయి. హైదరాబాద్ నగరంలో తీవ్రమైన నేరాలు 26.23% తగ్గగా, సైబరాబాద్‌లో డ్రగ్స్ కేసులు 90.98% పెరిగాయి. ఆదిలాబాద్‌లో డ్రగ్స్ కేసులు 57 నుంచి 219కి చేరాయి. సమీక్ష సందర్భంగా అధికారులకు డీజీపీ పలు సూచనలు ఇచ్చారు. నెలవారీ క్రైమ్ రివ్యూలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రైమ్ రివ్యూలు కేవలం గణాంకాలకే పరిమితం కాకూడదన్నారు. నేరాల కారణాలు, పని విధానం, దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కారంపై విశ్లేషణ చేయాలన్నారు. ఫీల్డ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర ధోరణులను ముందుగానే గుర్తించి యాక్షన్ ప్లాన్‌లు రూపొందించాలని పేర్కొన్నారు. క్రైమ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ (సీసీటీఎన్‌ఎస్) డేటా అప్‌డేట్ 96%కి చేరిందన్నారు. గతంలో ఈ ఇది 70-80 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఏఐ, సీసీటీఎన్‌ఎస్, టీజీ కాప్, హాక్‌ఐ టెక్నాలజీ, ఈగల్, ఐసీజేఎస్, కొత్త క్రిమినల్ చట్టాల అమలుపైనా డీజీపీ సమీక్ష నిర్వహించారు. యూనిట్ స్థాయి జవాబుదారీతనం, సత్వర నిర్ణయాలు, ఫోకస్డ్ ఫీల్డ్ యాక్షన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

# లెక్కకు మిక్కిలిగా జయరాజ్ ఆస్తులు

- గనులశాఖలో అవినీతి మేట
- 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించిన ఏసీబీ కోర్టు
- వరంగల్ జైలుకు తరలింపు

**వరంగల్,ఆగస్ట్28(జనంసాక్షి):**ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్‌ను అవినీతి నిరోధక శాఖ అరెస్ట్ చేసింది. కోర్టులో హాజరు పర్చగా ఆదేశాలతో వరంగల్ జైలుకు తరలించారు. జయరాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ నిర్ధారణకు రావడంతో.. ఆయనను అరెస్ట్ చేసి వరంగల్‌కు తరలించారు. అనంతరం జయరాజ్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు జయరాజ్‌ను వరంగల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జయరాజ్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో దాడులు చేపట్టినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. జయరాజ్ అవినీతికి పాల్పడుతున్నారంటూ గతంలోనే గనుల శాఖ అధికారులు హెచ్చరించారు కూడా. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ తీరులో మార్పు రాలేదని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో జయరాజ్ భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి సమాచారం అందడంతో దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వరంగల్‌తో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. బోడుప్పల్‌లోని జయరాజ్ నివాసంతో పాటు ఆయన స్నేహితులు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టారు. సోదాల్లో భారీగా ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. ఏసీబీ లెక్కల ప్రకారం జయరాజ్‌కు సంబంధించిన సుమారు రూ.65 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, తూప్రాన్, తుంగతుర్తి, సూర్యాపేటలో ఒక్కో ఎ÷-లాట్, కీసరలో రెండు ఇంటి స్థలాలు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. కేపీహెచ్‌బీలో విలువైన మరో ఎ÷-లాట్‌ను కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే సుమారు రూ.20 లక్షల విలువైన ఎల్‌ఐసీ బాండ్లు, రూ.20 లక్షలకు పైగా పోస్టాఫీస్ సేవింగ్స్, మూడు బ్యాంకు ఖాతాల్లో రూ.71 లక్షల నగదు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటితో పాటు సుమారు రూ.40 లక్షల విలువైన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 629 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక జయరాజ్ తన ఇంటి డ్రైవర్ బ్యాంకు ఖాతా నుంచి తన కుమార్తె ఖాతాలోకి రూ.24 లక్షలు బదిలీ చేయించినట్లు కూడా ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఈ లావాదేవీలపై కూడా అధికారులు విచారణ చేపట్టారు. సోదాల్లో బయటపడిన ఆస్తులు, నగదు, బంగారం, బ్యాంకు లావాదేవీల ఆధారంగా జయరాజ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ నిర్ధారణకు రావడంతో.. ఆయనను అరెస్ట్ చేసి వరంగల్‌కు తరలించారు. అనంతరం జయరాజ్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు జయరాజ్‌ను వరంగల్ జైలుకు తరలించారు.

## చెట్టుకు రాఖీ కట్టిన పర్యావరణ ప్రేమికుడు



నల్గొండ, ఆగస్ట్28 (జనంసాక్షి) : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ జరుపుకుంటారు. అయితే ఈ పండుగ వేళ ఓ పర్యావరణ ప్రేమికుడు మాత్రం వినూత్నంగా ఆలోచించి.. పర్యావరణంపై తన ప్రేమను వ్యక్తం చేశాడు. గతంలో తాను నాటిన రావి చెట్టు మహావృక్షంగా ఎదగడంతో.. అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. రాఖీ పండగ సందర్భంగా ఆ చెట్టుకు ఆప్యాయంగా రాఖీని కట్టి తన ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నాడు. అతడి పేరు సురేష్ గుప్తా. అతడి స్వస్థలం నల్గొండ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు మనకు ప్రాణవాయువును అందిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయని పేర్కొన్నారు. వాటిని సొంత కుటుంబ సభ్యుల్లా భావించి సంరక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. చెట్టుకు రాఖీ కట్టి దానిని సంరక్షణకు ప్రతిజ్ఞ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే సందేశాన్ని ఇచ్చినట్లు సురేష్ గుప్తా వెల్లడించారు

## స్కూళ్లలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించండి

- తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్

ఖమ్మం, ఆగస్ట్28 (జనంసాక్షి) : ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు మన ఊరి -మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని, లేదంటే సెప్టెంబర్ 17న బడులకు తాళాలు వేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. దీనికి సంబంధించి శుక్రవారం మన ఊరు మనబడి పథకంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు, ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్ కు వినతిపత్రం అందజేశారు. పనులు పూర్తి చేసిన మూడేండ్లు అయినా బిల్లులు చెల్లించలేదని, అప్పులు చేసి పనులు చేయించామని వారు వినతిలో ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులతో మానసిక ఒత్తిడి గురై ఆత్మహత్యలే శరణ్యంగా మారిందన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం లోపు పెండింగ్ బిల్లులు చెల్లించాలని లేనిచో పనులు చేసినా బిల్లులు రాని బడులకు గత్యంతరం లేక తాళాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్టర్ల బాధలు తెలుసుకుని బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.వసంతరావు, వి.రామిరెడ్డి, గడిపర్తి వీరభద్రరావు, ఏసుబాబు, ఎస్.శ్రీనివాసరావు, రఘు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- ధరల పెరుగుదల, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా చలో ఢిల్లీకి తరలిరండి
- సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు పిలుపు



గద్వాల (జనంసాక్షి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశంలో ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించ చకుండా ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సెప్టెంబర్ ఒకటవ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో చలో ఢిల్లీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు దోచిపెడుతూ, రైతులు, కార్మికు లు, యువత, పేదల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆయన విమర్శిం చారు. ధరల పెరుగుదలను అరికట్టడం, రైతులకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించడం, యువతకు ఉద్యోగాలు కల్పించడం, కార్మిక హక్కులను పరిరక్షిం చడం వంటి డిమాండ్ల సాధన కోసం సిపిఐ నిరంతరం పోరాడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గద్దె దించాలని నిరసనగా సిపిఐ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు, రైతులు, విద్యార్థు లు, యువత, మహిళలు, ప్రజాస్వా మ్యవాదులు పెద్దఎత్తున తరలిరావాలని బి.ఆంజనేయులు పిలుపుని చ్చారు. ప్రజల హక్కుల కోసం జరిగే ఈ పోరాటాన్ని విజయ వంతం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి జిల్లా కార్యదర్శి రంగన్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరమేష్, సిపిఐ నాయకులు రామాంజ నేయులు, వెంకటేష్, గోకారి పాల్గొన్నారు.

## జుక్కల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయండి

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాదయాత్ర

కామారెడ్డి, ఆగస్ట్28 (జనంసాక్షి) : జుక్కల్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలపై జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి మండలంలోని మహ్మదాబాద్ చౌరస్తా నుండి జుక్కల్ చౌరస్తా వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ చౌరస్తా నుండి కండెబాల్లూరు వరకు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను సైతం పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రోడ్లు అధ్వాన్నంగా మారడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిద్రపోతోందని, అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని మండిపడ్డారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే గుర్తించి రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2015-16లో రహదారిని వెడల్పు చేసి బీటీ రోడ్డు నిర్మించామని, రోడ్డు మరమ్మతులకు రావడంతో తమ ప్రభుత్వ హయాంలో రోడ్డు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. జుక్కల్ చౌరస్తా నుండి కండెబాల్లూరు వరకు రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు సురక్షితమైన రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల కోసం,అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర కొనసాగుతోందని చెప్పారు.

## హెల్మెట్ ధరించండి..భయ్యా

- రాఖీ కట్టి పోలీసుల హితబోధ

కామారెడ్డి, ఆగస్ట్28 (జనంసాక్షి) : హెల్మెట్లు లేని వాహనదారులకు ఎప్పుడూ చలాన్లు వేసే ట్రాఫిక్ పోలీసులు.. నేడు రక్షా బంధన్ సందర్భంగా ప్రేమతో రాఖీలు కట్టారు. కామారెడ్డి డీఎస్పీ ఆదేశాలతో పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో రాఖీ పూర్ణిమ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి బొట్టు పెట్టి, రాఖీ కట్టి.. హెల్మెట్ ధరించా లని అవగాహన కల్పించారు ట్రాఫిక్ పోలీసులు. హెల్మెట్ ధరించడం ప్రతి కుటుం బానికీ రక్ష అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిం చడం వల్ల ప్రమాదాల బారినపడే తీవ్రత పెచ్చరించారు. రక్షా బంధన నాడు రాఖీ ఎంత రక్షణ ఇస్తుందని విశ్వసిస్తామో.. హెల్మెట్ కూడా నిత్యం అంతే రక్షణను ఇస్తుందని పేర్కొన్నారు. పోలీసులు రాఖీ కట్టడం చూసి వాహనదారులు ఆశ్చర్యపోయారు. ఈ రకమైన రీతిలో వినూత్నంగా అవగాహన కల్పించడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

- వివాదాల తరవాత తొలిసారి సిఎం ఇంటికి కొండా సురేఖ
- సిఎంకు ఆడబిడ్డల ఆశీర్వాదాలు ఉండాలని వ్యాఖ్య
- సిఎంకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు, మహిళా కానిస్టేబుల్స్





హైదరాబాద్, ఆగస్టు 28 (జనంసాక్షి) : రక్షా బంధన్ సందర్భంగా అపూర్వ సన్నివేశం ఆవిష్కృతం అయ్యింది.మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రేవంత్‌కు రాఖీ కట్టారు. సిఎం కుటుంబ సభ్యుల సమక్షంలో వీరిద్దరు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సిఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు. సీఎం రేవంత్‌రెడ్డికి బంగారు రాఖీ కట్టిన తర్వాత.. ఆమె నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుతున్నా. ముఖ్యమంత్రికి ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఇటీవల ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి పై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే బ్రహ్మకుమారీలు, హోంగార్డులు, మహిళా కానిస్టేబుళ్లు కూడా సిఎం రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టారు. వారి పట్ల సిఎం రేవంత్ వాత్సల్యం ప్రకటించారు.

## బంగారం మైనింగ్‌లో హట్టి- సింగరేణి జతకట్టాలి

- భవిష్యత్తు ప్రాజెక్టుల్లో జాయింట్ వెంచర్ గా కలిసి పని చేయడానికి పరిశీలన చేయాలి
- సింగరేణి అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం





గోదావరిఖని (జనంసాక్షి) : బంగారం శుద్ధి కేంద్రం పరిశీలన, హట్టి, యుటీ బంగారు గనులలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విస్తృత పర్యటన. బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యుటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు.

### ఆర్థిక భద్రతలో బంగారం కీలకం..

దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు.

### ఉత్పత్తి నుంచి శుద్ధి వరకు పరిశీలన..

హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. యుటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్ వ్యూ పాయింట్ వద్ద నిలబడి బంగారం ముడి మట్టిని వెలికి తీసిన ప్రక్రియను, సేకరించిన ప్రదేశాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి కావలసిన ముడి సరుకును తీశారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారని అధికారులను అడిగారు. అక్కడి అధికారులు డిప్యూటీ సీఎంతో మొక్కను నాటించారు.అనంతరం యుటి భూ గర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలించారు.భూగర్భ గనిలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అప్జల్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ్ రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.

### ఖనిజ అన్వేషణ పనులను వేగవంతం చేయాలి

దేవదుర్గ బంగారం-రాగి బ్లాక్‌లో ఖనిజ అన్వేషణ పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సింగరేణి వేలంలో దక్కించుకున్న దేవదుర్గ బంగారం-రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్ హట్టి గోల్డ్ మైన్స్‌కు సమీపంలో ఉండటం గొప్ప అవకాశమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హట్టి సంస్థ సాంకేతిక అనుభవాన్ని దేవదుర్గ ప్రాజెక్టులో వినియోగించుకోవాలన్నారు. దేవదుర్గలో ఖనిజ నిక్షేపాల పరిమాణం, నాణ్యతను నిర్ధారించేందుకు ఆధునిక సాంకేతిక పద్ధతులతో అన్వేషణను వేగవంతం చేయాలని సూచించారు. ఆశాజనక ఫలితాలు వచ్చిన వెంటనే తదుపరి దశలో చేపట్టే అంశాలపై ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.దేవదుర్గలో ఏర్పాటు చేయనున్న సింగరేణి సైట్ కార్యాలయాన్ని త్వరలో ప్రారంభించడానికి కావలసిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎండీని ఆదేశించారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అప్జల్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ్, రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.

## పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లుంది

- కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ప్రజల్లో బాధ
- రేషన్ కార్డులపై మోడీ ఫోటో ఎందుకు వేయరు
- సిఎస్ సంజయ్ జాజుతో పలు అంశాలపై చర్చించిన ఈటెల



హైదరాబాద్, ఆగస్ట్28 (జనంసాక్షి) : తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లుగా తయారయ్యిందని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కెసిఆర్‌ను కాదని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అంతకు మించి అన్నట్లుగా అవినీతి పాలన సాగుతోందని మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ పాలనలాగానే.. రేవంత్ రెడ్డి పాలన కూడా తయారయ్యిందని ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ పోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగిరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం ఇచ్చేది కేంద్రమైతే మీ బొమ్మలెందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్.. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి మీ ఆశీర్వాదంతోపాటు మీ మద్దతు కావాలంటారని వ్యంగ్యంగా అంటారని తెలిపారు. ఇక్కడికి వచ్చి అదే సీఎం రేవంత్.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తారని పేర్కొన్నారు. మోదీ దేశానికి ప్రధాని కాబట్టే రాష్ట్రానికి ఇన్ని రహదారులు, రైల్వే అభివృద్ధికి నిధులు వచ్చాయని ఎంపీ ఈటల వివరించారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశం అభివృద్ధి ఉందని మోదీ అంటారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం మాటెంటి ఇచ్చేదని అన్నారన్నారు. అలాగే ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అసలు దేశ ప్రధాని మోదీని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేర్ చేయలేదన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు మంచిది కాదని.. అధిష్టానం ఆయన తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలు వేసి పార్టీ నాయకులకు కేటాయించుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ విమర్శించారు. మీ తాత జాగీరు కాదు అలా చేయడానికి అంటూ కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్లపై కేంద్రానికి ఎలాంటి వివక్షత లేదన్నారు. మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే రూ.100 కోట్లు అధికంగా కేంద్రం ఇచ్చిందన్నారు. మెట్రో ఫేజ్ -1, ఫేజ్ -2 కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల గ్రామాలను కూడా కలిపారని చెప్పారు. కానీ వాటిని పట్టించుకోవట్లేదని విమర్శించారని ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబీ), రైలు అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) నడుపాలని లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.





## మేడ్చల్ అథ్లెట్ల ప్రతిభకు గుర్తింపు

హైదరాబాద్ (జనంసాక్షి) : 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు (దక్షిణ జోన్) ఆగస్టు 26, 27 తేదీల్లో హనుమకొండలోని జెఎన్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. అండర్-16 బాలికల విభాగంలో గరిగె అభినవశ్రీ 60 మీటర్ల పరుగు పందెంలో 8.35 సెకన్లతో మూడో స్థానం సాధించింది. లాంగ్‌జంప్‌లో 5 మీటర్ల అగ్రోతో 3.80 మీటర్ల దూరం దూకి నాలుగో స్థానంలో నిలిచింది. అండర్-18 బాలు ర హెప్టాథ్లాన్‌లో చలావాది గణేష్ ఐదో స్థానం, అండర్-20 బాలుర డెకాథ్లాన్‌లో బండి సాత్విక్ నాలుగో స్థానం సాధించారు. అండర్-20 జావెలిన్ త్రోలో ఎన్. నవ్యుత్ 6వ స్థానం సాధించాడు. అండర్-18 బాలుర 1000 మీటర్ల పరుగు పందెంలో ఎన్. చింటూ 15వ స్థానంలో నిలిచాడు. హైజంప్‌లో డి. దినేష్ 11వ స్థానం, అండర్-16 హైజంప్‌లో ఎన్. సిద్ధు 10వ స్థానం సాధించారు. ఈ క్రీడాకారులను అథ్లెటిక్స్ కోచ్ తిరుమల రావు బొూడి శిక్షణ అందిస్తున్నారు. తండ్రి ధర్మేంద్ర , సెక్రటరీ కె. రాజశేఖర్, బి.ఈ. స్టాఫ్‌తోపాటు క్రీడాకారుల చదువుతున్న పాఠశాలల యాజమాన్యం బలేంద్ర, తేజేంద్ర శిక్షణకు అందిస్తున్న సహకా రాన్ని కోచ్ అభినందించారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా క్రీడాకారులను తీర్చిది ద్దుతున్నట్లు కోచ్ తిరుమల రావు బొూడి తెలిపారు.

## అశ్లీల నృత్యాలు వద్దు.. శాస్త్రీయ దృక్పథమే ముద్దు

కావడ్ యాత్రల్లో డీజేల మోతలు, అభ్యంతరకర నృత్యాలపై చర్చ జరుగుతున్న ఈ తరుణంలో నిజంగా అడగాల్సిన ప్రశ్న వేరే ఉంది. ఇరవై ఒకటో శతాబ్దపు భారతదేశం... అంతరిక్షంలో చంద్రయాన్‌ను పంపిన దేశం... ప్రపంచంలోనే అతిపెద్ద యువశక్తి కలిగిన దేశం. మన యువతను ఎటువైపు నడిపిస్తున్నాం?

రాజ్యాంగంలోని 51ఏ(హెచ్) అధికరణం ప్రకారం శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యం. కానీ ఆచరణలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. యువతలో ఒక వర్గం సామాజిక మాధ్యమాల్లో క్షణిక ప్రాచుర్యం కోసం పరితపిస్తోంది. మతపరమైన కార్యక్రమాలు సైతం కొన్నిసార్లు భక్తి కంటే ప్రదర్శనకు వేదికలుగా మారుతున్నాయి.

కావడ్ యాత్రలో కనిపిస్తున్న కొన్ని దృశ్యాలు దీనికి తాజా ఉదాహరణ మాత్రమే. ఇది ఒక్క యాత్రకు, ఒక్క రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు. పండుగలు, జాతరలు, ఊరేగింపులు... ఏ కార్యక్రమమైనా జనాన్ని ఆకర్షించేందుకు హద్దులు దాటే ప్రదర్శనలు పెరుగుతున్నాయన్నది ఆందోళన కలిగించే అంశం. ఒకసారి ఆలోచించాలి. యువతలో ఉన్న ఇదే ఉత్సాహాన్ని, ఇదే సృజనాత్మకతను, ఇదే సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశోధన, ఆవిష్కరణలు, నూతన వ్యాపారాలు, శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మళ్లిస్తే దేశం ఎంత ముందుకు వెళ్తుందో? చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌తో అద్భుతమైన చిత్రాలు రూపొందించగలిగే యువత, సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు వెతకడంలోనూ అదే ఆసక్తి చూపాలి. అనుసరించడం కంటే ప్రశ్నించడం నేర్చుకోవాలి. అందరూ చేస్తున్నారు కాబట్టి మనమూ చేయడం కాదు... ఇది ఎందుకు? దీని వల్ల ప్రయోజనం ఏమిటి? సమాజానికి నష్టం జరుగుతుందా? అనే ప్రశ్నలు వేసే తత్వం పెరగాలి. ఇక్కడ అసలు వైఫల్యం వ్యవస్థాగతమైనదే.

పాఠశాలల్లో ప్రయోగశాలలు ఉన్నప్పటికీ, విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచే బోధనకు తగిన ప్రాధాన్యం లభించడం లేదు. శాస్త్రవేత్తల విజయాలు, పరిశోధనలు, ఆవిష్కరణలు కొద్దిసేపటి వార్తలుగా మిగిలిపోతున్నాయి. అదే సమయంలో సంచలనాత్మక దృశ్యాలు, వివాదాస్పద ప్రదర్శనలు రోజుల తరబడి చర్చకు వస్తున్నాయి. యువతలో హేతుబద్ధత, శాస్త్రీయ ఆలోచన పెంపొందించాల్సిన బాధ్యత ఉన్న నాయకత్వం కూడా చాలాసార్లు భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. మత విశ్వాసాలను గౌరవించడం ఒక విషయం... వాటిని జనాన్ని రెచ్చగొట్టే సాధనంగా మార్చడం మరో విషయం. భక్తి తప్పు కాదు. సంప్రదాయం తప్పు కాదు. మత విశ్వాసాలను గౌరవించడం కూడా తప్పు కాదు. కానీ భక్తి పేరుతో విచక్షణను పక్కన పెట్టడం మాత్రం ప్రమాదకరం. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవచ్చు.

ఒక దేశ భవిష్యత్తు కేవలం ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడదు. ఆ దేశ యువత ఆలోచించే విధానంపైన కూడా ఆధారపడి ఉంటుంది. యువతలో ప్రశ్నించే తత్వం, పరిశోధనా ఆసక్తి, సృజనాత్మకత పెరిగితే దేశం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. క్షణిక ప్రాచుర్యం, గుంపు మనస్తత్వం, అర్థంలేని ప్రదర్శనలే లక్ష్యాలైతే భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ప్రతి పండుగను ప్రదర్శనగా... ప్రతి యాత్రను వినోదంగా... ప్రతి కార్యక్రమాన్ని సంచలనంగా మార్చే ధోరణిని సమాజం ఆలోచించాలి. యువతకు అర్థవంతమైన లక్ష్యాలు, మంచి ఆదర్శాలు, సృజనాత్మక అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కుటుంబాలది, విద్యాసంస్థలది, ప్రభుత్వాలది, మాధ్యమాలది. నిబంధనలు విధించడం అవసరమే. కానీ జరిమానాలు, ఆంక్షలతో సమస్యకు శాశ్వత పరిష్కారం రాదు. ఆలోచనా విధానంలో మార్పు రావాలి. యువతకు ఏది అనుసరించాలి, ఏది ప్రశ్నించాలి, ఏది తిరస్కరించాలి అనే విచక్షణను నేర్పాలి.

**భక్తికి వేదిక ఉండాలి. సంప్రదాయానికి గౌరవం ఉండాలి. కానీ యువత చేతిలోని శక్తి దేశ నిర్మాణానికి ఉపయోగపడాలి. వైరల్ కావడం గొప్ప విషయం కాదు... విలువైనదాన్ని సృష్టించడం గొప్ప విషయం. డీజేల మోత కంటే ప్రయోగశాలల సందడి వినిపించాలి. అసభ్య ప్రదర్శనల కంటే ఆవిష్కరణల ప్రదర్శనలు కనిపించాలి. క్షణిక ప్రాచుర్యం కంటే శాశ్వతమైన విజయాల కోసం యువత పరుగెత్తాలి. అదే నిజమైన భక్తి... అదే దేశభక్తి.. అదే అభివృద్ధికి బాట.**

# పెరుగుతున్న నిత్యవసర సరుకులు - ఆర్థిక ఇబ్బందుల్లో ప్రజలు

నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం కేవలం మార్కెట్‌లో కనిపించే ఆర్థిక పరిణామం కాదు. అది నేరుగా సామాన్య కుటుంబం వంటింటిని, పిల్లల చదువును, ఆరోగ్య ఖర్చులను, పొదుపును, చివరకు జీవన ప్రమాణాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన సామాజిక--ఆర్థిక సమస్య. ఆదాయం పెరగకుండానే ఖర్చులు పెరుగుతున్నప్పుడు కుటుంబ బడ్జెట్‌లో మొదట కోత పడేది వినోదం, దుస్తులు, ప్రయాణం వంటి అవసరాలపై. ఆ తర్వాత పొదుపు తగ్గుతుంది. పరిస్థితి మరింత విషమిస్తే విద్య, వైద్యం వంటి మౌలిక అవసరాలపైనా ప్రభావం పడుతుంది. ప్రస్తుతం తెలంగాణలో కనిపిస్తున్న ధరల పరిస్థితి ఈ ప్రమాదాన్ని సూచిస్తోంది.

జూలైలో దేశవ్యాప్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతంగా నమోదైన సమయంలో తెలంగాణలో అది 6.32 శాతంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ధరల పెరుగుదల గణనీయంగా అధికంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 5.72 శాతం, తమిళనాడులో 5.44 శాతం, మధ్యప్రదేశ్‌లో 4.91 శాతం, కర్ణాటకలో 4.80 శాతం నమోదైన నేపథ్యంలో తెలంగాణ గణాంకాలు మరింత స్పష్టమైన హెచ్చరికను ఇస్తున్నాయి. దేశవ్యాప్తంగా ధరల ఒత్తిడి ఉన్నప్పటికీ తెలంగాణలో అది అదనపు భారంగా మారుతున్నదంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని సరఫరా వ్యవస్థ, మార్కెట్ నియంత్రణ, వ్యవసాయ ఉత్పత్తుల పంపిణీ, నిల్వ వ్యవస్థలను సమీక్షించాల్సిన అవసరం ఉందని అర్థం.

ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతంగా ఉండటం మరో ముఖ్యమైన అంశం. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 5.79 శాతానికి చేరడం మరింత ఆందోళనకరం. ఎందుకంటే గ్రామీణ కుటుంబాల ఆదాయంలో ఆహారం కోసం వెచ్చించే వాటా సాధారణంగా ఎక్కువగా ఉంటుంది. కూరగాయలు, ఉల్లిపాయలు, పప్పులు, వంటనూనెలు, పాలు వంటి వస్తువుల ధరలు పెరిగితే తక్కువ ఆదాయ కుటుంబాలపై దాని ప్రభావం వెంటనే పడుతుంది. ధరల పెరుగుదల ఒకవైపు రైతును ప్రభావితం చేస్తే, మరోవైపు వినియోగదారుడినీ ఇబ్బంది పెట్టే పరిస్థితి ఏర్పడుతుంది. ఉత్పత్తి చేసే రైతుకు సరైన ధర రాకపోవడం, వినియోగదారుడు అధిక ధర చెల్లించడం మధ్యలో ఉన్న సరఫరా వ్యవస్థలోని లోపాలను సూచిస్తుంది.

హైదరాబాద్ అంబర్‌పేటలో నివసిస్తున్న ఒక ప్రైవేటు ఉద్యోగి కుటుంబ పరిస్థితి ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకోవడానికి ఉదాహరణగా నిలుస్తుంది. నెలకు రూ.50 వేల ఆదాయం ఉన్న కుటుంబం గతంలో సుమారు రూ.45 వేలలో ఇంటి ఖర్చులను నిర్వహించి రూ.5 వేలు పొదుపు చేసుకోగలిగేది. ఇప్పుడు కూరగాయలు, ఉల్లి, పప్పులు, నూనె, పాలు తదితర వస్తువుల ధరలు పెరగడంతో నెలవారీ ఖర్చు రూ.50 వేలకు మించి పోతున్నది. కేవలం కూరగాయలు, కిరాణా సరుకులపైనే నెలకు సుమారు రూ.3 వేల అదనపు భారం పడుతుంటే ఆ కుటుంబం పొదుపును కొనసాగించడం ఎలా సాధ్యం? ఇదే పరిస్థితి వేలాది మధ్యతరగతి కుటుంబాల్లో కనిపిస్తే దాని ప్రభావం సమాజవ్యాప్తంగా ఉంటుంది.

తెలంగాణలో నమోదవుతున్న 6.32 శాతం ద్రవ్యోల్బణాన్ని సాధారణ గణాంకంగా తీసుకోకూడదు. దేశ సగటు 4.45 శాతంతో పోలిస్తే రాష్ట్రంలో ధరల ఒత్తిడి ఎందుకు ఎక్కువగా ఉందో ప్రభుత్వం లోతుగా పరిశీలించాలి. ఏ వస్తువులు ఎక్కువగా ధర పెరుగుదలకు కారణమవుతున్నాయి? ఉత్పత్తి--సరఫరా గొలుసులో ఎక్కడ సమస్య ఉంది? రైతుకు లభిస్తున్న ధర ఎంత? వినియోగదారుడు చెల్లిస్తున్న ధర ఎంత? మధ్యలో వ్యత్యాసం ఎందుకు ఏర్పడుతోంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనకుండా ధరల మంటలను ఆర్పడం సాధ్యం కాదు.

ధరల పెరుగుదలపై చర్చించేటప్పుడు ద్రవ్యోల్బణం శాతాలను మాత్రమే చూడటం సరిపోదు. 6.32 శాతం ద్రవ్యోల్బణం అంటే ఒక కుటుంబం గతంలో రూ.10,000తో కొనుగోలు చేసిన నిత్యావసరాల బుట్టకు ఇప్పుడు సగటున మరింత ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తోందని అర్థం. దేశ సగటు ద్రవ్యోల్బణం 4.45 శాతంగా ఉన్న సమయంలో తెలంగాణలో 6.32 శాతం నమోదవడం రాష్ట్ర ప్రజలపై అదనపు ధరల భారం ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తోంది. దేశ సగటుతో పోలిస్తే తెలంగాణ ద్రవ్యోల్బణం 1.87 శాతం పాయింట్లు అధికంగా ఉంది. శాతం పాయింట్లలో ఇది చిన్న తేడాగా కనిపించినా, ప్రతి నెలా నిత్యావసరాలపై ఖర్చు చేసే కుటుంబాలకు ఇది నిరంతర ఆర్థిక ఒత్తిడిగా మారుతుంది.

ఆహార ద్రవ్యోల్బణం దేశవ్యాప్తంగా 5.52 శాతంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో అది 5.79 శాతానికి చేరడం కూడా ఆందోళన కలిగించే అంశమే. ఆహారం కుటుంబ బడ్జెట్‌లో తప్పనిసరి ఖర్చు కావడంతో దాని ధర పెరుగుదలను ప్రజలు పూర్తిగా తప్పించుకోలేరు.

ఒక కుటుంబానికి నెలకు రూ.50,000 ఆదాయం ఉందనుకుందాం. అద్దె, విద్యుత్, రవాణా, పిల్లల విద్య, వైద్యం వంటి ఖర్చులు కలిపి రూ.30,000 వరకు స్థిర వ్యయాలుగా ఉంటే, ఆహారం, కిరాణా, కూరగాయలు, పాలు, వంటనూనెల కోసం మిగిలిన రూ.20,000లో పెద్ద భాగం ఖర్చవుతుంది. నిత్యావసరాల ధరలు 5--10 శాతం మేర పెరిగినప్పుడు ఆ కుటుంబానికి అదనపు ఖర్చు నెలకు రూ.1,000--రూ.2,000 మాత్రమే అనిపించవచ్చు. కానీ ఏడాదికి అది రూ.12,000--రూ.24,000 అవుతుంది. ఇప్పటికే పొదుపు పరిమితంగా ఉన్న కుటుంబానికి ఈ మొత్తం చాలా పెద్ద ఆర్థిక భారమే.

మరోవైపు రూ.20,000-రూ.25,000 నెలవారీ ఆదాయం ఉన్న కుటుంబాన్ని పరిశీలిస్తే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఆదాయంలో ఎక్కువ భాగం ఆహారం, అద్దె, విద్యుత్, ప్రయాణం వంటి ప్రాథమిక అవసరాలకే వెళ్తుంటే ధరల పెరుగుదల కోసం ప్రత్యేకంగా కేటాయించే నిధి ఉండదు. ధరల సమస్యకు మరో వైపు రైతు పరిస్థితి. పట్టణ మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.50--రూ.55 పలికితే, హోల్‌సేల్ మార్కెట్‌లో అదే ఉల్లి రూ.30--రూ.35 మధ్య ఉండటం ధరల పంపిణీ వ్యవస్థలోని వ్యత్యాసాన్ని చూపిస్తుంది. ఈ వ్యత్యాసం పూర్తిగా రైతు ఆదాయంగా మారడం లేదు. రైతు ఉత్పత్తి వ్యయం, రవాణా ఖర్చు, మార్కెట్ ఖర్చులు, నిల్వ ఖర్చులు, మధ్యవర్తుల మార్జిన్ వంటి అంశాలు తుది ధరను ప్రభావితం చేస్తాయి. వినియోగదారుడు ఎక్కువ ధర చెల్లిస్తున్నప్పటికీ రైతు అదే స్థాయిలో లాభపడకపోవడం వ్యవసాయ మార్కెట్‌లోని నిర్మాణాత్మక సమస్యను సూచిస్తుంది.

ప్రభుత్వం ధరల పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లలో రోజువారీ ధరల సమాచారాన్ని సేకరించి, ఉత్పత్తి కేంద్రం నుంచి చిల్లర మార్కెట్ వరకు ధరల మార్పులను విశ్లేషించాలి. ఒక వస్తువు ధర ఆకస్మికంగా 20 శాతం, 30 శాతం పెరిగితే దాని వెనుక కారణాలను గుర్తించాలి. నిజమైన కొరత అయితే ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను తెరవాలి. నిల్వల కారణంగా ధరలు పెరిగితే నిల్వ పరిమితులను తనిఖీ చేయాలి. రవాణా సమస్య అయితే సరఫరా వ్యవస్థను సరిచేయాలి. సమస్య ఏదైనా దాని మూలాన్ని గుర్తించి పరిష్కరించాలి.

ప్రభుత్వం ధరలను నియంత్రించడానికి తాత్కాలికంగా సబ్సిడీలు, ప్రత్యేక విక్రయ కేంద్రాలు, మార్కెట్ జోక్యాలు చేపట్టవచ్చు. కానీ ప్రతి సంవత్సరం ఇదే సమస్య పునరావృతమైతే తాత్కాలిక చర్యలు సరిపోవు. ఉత్పత్తి పెంపు, నిల్వ సామర్థ్యం పెంపు, రవాణా మౌలిక వసతుల అభివృద్ధి, రైతు మార్కెట్ బలోపేతం, ధరల సమాచార పారదర్శకత వంటి దీర్ఘకాలిక చర్యలు తప్పనిసరి.

అంతిమంగా 6.32 శాతం ద్రవ్యోల్బణం వెనుక ఉన్న అసలు కథ ఒక గణాంకం కాదు. అది నెలాఖరులో ఖాళీ అవుతున్న కుటుంబ పర్సు. అది తగ్గిపోతున్న పొదుపు. అది పిల్లల అవసరాలపై పడుతున్న కోత. అది పెరుగుతున్న అప్పు. అది కూరగాయల బుట్టను చిన్నదిగా చేసుకునే తల్లి. అది పప్పు ధర చూసి పరిమాణం తగ్గించే కుటుంబం. అది జీతం వచ్చిన వారం రోజుల్లోనే ఖర్చుల లెక్కలు వేసుకునే మధ్యతరగతి ఉద్యోగి. అందుకే ద్రవ్యోల్బణాన్ని కేవలం ఆర్థిక శాఖ నివేదికలోని శాతంగా కాకుండా ప్రజల జీవన ప్రమాణానికి కొలమానంగా చూడాలి.

దేశ సగటు 4.45 శాతంతో పోలిస్తే తెలంగాణలో 6.32 శాతం ద్రవ్యోల్బణం నమోదవడం ప్రభుత్వం అప్రమత్తం కావాల్సిన సంకేతం. ఆంధ్రప్రదేశ్‌లో 5.72 శాతం, తమిళనాడులో 5.44 శాతం, మధ్యప్రదేశ్‌లో 4.91 శాతం, కర్ణాటకలో 4.80 శాతం నమోదైన నేపథ్యంలో తెలంగాణ పరిస్థితిని ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ధరలు ఎందుకు అధికంగా పెరుగుతున్నాయి? ఏ వస్తువులు ప్రధాన కారణం? గ్రామీణ--పట్టణ ధరల మధ్య వ్యత్యాసం ఎంత? రైతు పొందుతున్న ధర, వినియోగదారుడు చెల్లిస్తున్న ధర మధ్య ఎంత తేడా ఉంది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం గణాంకాలతో సమాధానం చెప్పాలి.

**ధరల మంటలను ఆర్పడానికి ప్రకటనలు సరిపోవు. మార్కెట్‌లో ప్రత్యక్ష జోక్యం, రైతు--వినియోగదారుల మధ్య దూరం తగ్గించడం, నిల్వ వ్యవస్థను బలోపేతం చేయడం, అక్రమ నిల్వలపై చర్యలు, నిత్యావసర వస్తువుల సరఫరాను నిరంతరం పర్యవేక్షించడం అవసరం. అదే సమయంలో తక్కువ ఆదాయ కుటుంబాల కొనుగోలు శక్తిని కాపాడేందుకు సామాజిక భద్రతా చర్యలు మరింత బలపడాలి.**

ప్రజల ఆదాయం పెరగడం ఎంత ముఖ్యమో, ఆ ఆదాయంతో కొనగలిగే వస్తువుల పరిమాణం తగ్గకుండా చూడటం అంతకంటే ముఖ్యం. జీతం పెరిగినా కూరగాయల ధర రెట్టింపు అయితే కుటుంబానికి నిజమైన ప్రయోజనం ఉండదు. వ్యవసాయ ఉత్పత్తి పెరిగినా రైతుకు ఆదాయం పెరగకపోతే వ్యవసాయ రంగం బలపడదు. మార్కెట్‌లో వస్తువులు ఉన్నా సామాన్యుడికి అందుబాటులో లేకపోతే ఆర్థిక వృద్ధికి అర్థం ఉండదు.

అందువల్ల తెలంగాణలో ధరల నియంత్రణను అత్యవసర పరిపాలనా అంశంగా పరిగణించాల్సిన సమయం వచ్చింది. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి అందుబాటు ధర, మధ్యవర్తిత్వంలో పారదర్శకత, మార్కెట్‌లో పోటీ, నిల్వలో నియంత్రణ, సరఫరాలో నిరంతరత --- ఈ ఆరు అంశాలపై సమగ్ర విధానం రూపొందించాలి. అప్పుడే 6.32 శాతం అనే గణాంకం క్రమంగా తగ్గి, దాని ప్రభావం ప్రజల వంటింట్లో కూడా కనిపించే స్థాయిలో ఉపశమనం కలుగుతుంది.

ధరల స్థిరత్వం అంటే కేవలం ఆర్థిక స్థిరత్వం కాదు; అది కుటుంబ స్థిరత్వం. కుటుంబ స్థిరత్వం అంటే సమాజ స్థిరత్వం. కాబట్టి ధరల మంటలను ఆర్పడం ప్రభుత్వానికి ఒక సాధారణ మార్కెట్ బాధ్యత కాదు-కోట్లాది ప్రజల జీవన భద్రతను కాపాడే అత్యవసర సామాజిక బాధ్యత.



డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి

## దిల్ సే మీకు లాల్ సలాం!!

ఇది ఎగసిన ఉప్పెన
కోట్ల ఉరుముల గర్జన
దిగంతాలు ఒక్కటైన
యువ ప్రళయ హోరు

లేటుగా లేయవచ్చు
నీటుగా పెల్లుబికింది
ఫాసిస్టు ఘుమండుల్ని
పెను మంటై కమ్మింది

ప్రశ్నకు పాతర వేస్తూ
ఎత్తిన ప్రతి గొంతునూ
కత్తులు ఝుళి పిస్తూ
ఖైదులేస్తూ మూసేస్తే

వేసిన ప్రతి ఓటునూ
మిషనులేసి మార్చేసి
జన కాంక్షలు గల్లంతై
గెలిచానని గంతులేస్తే

ఎధవాయి వేషాల్నిక
ఆపేస్తవా లేదంటూ
దేశ ద్రోహుల పాలన
ఎల్లకాలం సాగదంటు

యువత మేల్కొన్నది
చలిచీమల బారుగట్టి
దోపిడెల్ల బూడిదవ్వ
లావాలను చిమ్మింది

కులమతాల ఊబిలో
బెట్టింగూ జూదాలూ
జులాయి తిరుగుళ్ళే
నసీబులుగ మార్చేసి

యువతను చెడగొట్టి
తొడగొట్టిక చేయలేరు
కుట్రలింక కూలి పోవు
విరిచేస్తం కోరలంటూ

అవినీతి లీకు పాలనకూ
అంతిమ ఘడియలంటూ
దింపుడు కల్లం ఆశలన్నీ
కల్లలు ఇది అంతమంటూ

ఛప్పన్ ఇంచ్ ఛాతెనుక
దాచిన ఘోరాల్ నేరాల్
దొమ్మల్చీల్చి ఈడ్సేస్తిరి
కాక్రోచ్ల బలం సూపిస్తిరి

మా కన్నులూ.. కలలూ
ఆశలూ ఆకాంక్షల్ మీరే
రణాలు గెలిసే కావాతు
ఫిరంగి మోతలు మీరేలే

యువతా మీ తలంపుకు
కాలం సైతం తల వంచు
మీ శక్తిని ఆపే శక్తే దిక్కడ
దిల్ సే మీకు లాల్ సలాం!!

డా. ఇక్బాల్ పాషా
9440775732

# పొలాన్ని చదివిన కమ్యూనిస్టు కామ్రేడ్ సారంపల్లి


రైతు గురించి మాట్లాడేవారు.. రైతు సమస్యలపై పోరాడేవారు అనేకమంది ఉంటారు. కానీ, రైతు జీవితాన్ని అధ్యయనం చేసి, ఆ జీవితాన్ని నిర్దేశించే సామాజిక ఆర్థిక సంబంధాలను అర్థం చేసుకుని, ఆ అవగాహనను నిరంతర ప్రజా ఉద్యమంగా మలిచిన నాయకులు చాలా అరుదు. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అలాంటి కమ్యూనిస్టు నాయకుడు. ఆయన జీవితాన్ని ఒక వ్యక్తి జీవితచరిత్రగా చూస్తే సరిపోదు. తెలంగాణ గ్రామీణ సమాజంలో కమ్యూనిస్టు ఉద్యమం ఎదిగిన తీరు, రైతాంగ పోరాటం పరిణామం, వ్యవసాయ రంగంపై మారుతున్న ప్రభుత్వ విధానాలు, వాటిపై ఒక మార్క్సిస్టు నాయకుడు సాగించిన అధ్యయనం – పోరాటం ఈ సమస్తాన్ని కలిపి చూస్తేనే ఆయన జీవితానికి సరైన అర్థం లభిస్తుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతంలోని తిమ్మంపేట గ్రామంలో పుట్టి పెరిగిన మల్లారెడ్డి బాల్యంలోనే గ్రామీణ సమాజంలోని అసమానతలను చూశారు. భూస్వాములు, కరణాలు, మాలి పటేళ్ల ఆధిపత్యం, పేదలపై పెత్తనం, గ్రామీణ జీవితంలో వర్గ విభజన లాంటివన్నీ ఆయన రాజకీయ చైతన్యానికి నేపథ్యంగా నిలిచాయి. 1961లో గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడటం, 1962 ఎన్నికల్లో పేద ప్రజలు కమ్యూనిస్టు అభ్యర్థిని గెలిపించడం ఆయనపై ప్రభావం చూపాయి. 1964లో కమ్యూనిస్టు పార్టీ విభజన తర్వాత ఏర్పడిన సీపీఐ(ఎం)లో ఆయన చేరారు. అప్పటి నుంచి ఆయన జీవితం పార్టీతో, ప్రజలతో, ముఖ్యంగా రైతాంగ ఉద్యమంతో ముడిపడిపోయింది. ఆయనకు పాఠశాల విద్య ఎక్కువగా దక్కలేదు. పదో తరగతి తర్వాత చదువు కొనసాగలేదు. అయితే అక్కడితో వారి అధ్యయనం ఆగలేదు. పుస్తకాలు ఆయనకు విశ్వవిద్యాలయాలయ్యాయి. గ్రామం పాఠశాల అయింది. రైతు జీవితం పాఠ్యాంశమైంది. ఉద్యమం రాజకీయ విద్యను అందించింది. మార్క్సిజాన్ని ఆయన కేవలం సిద్ధాంతంగా చదవలేదు. భూమి, కౌలు, అప్పు, ధర, మార్కెట్, శ్రమ వంటి వాస్తవ జీవిత సమస్యలతో అనుసంధానించి అర్థం చేసుకున్నారు. అందుకే ఆయన ప్రసంగాల్లో నినాదం కంటే వాస్తవాలు ఎక్కువగా కనిపిస్తాయి. రచనల్లో భావోద్వేగం కంటే అధ్యయనం బలంగా ఉంటుంది.

ఆ అధ్యయనం వ్యవసాయ రంగానికే పరిమితం కాలేదు. సాహిత్యంపై కూడా ఆయనకు మంచి పట్టు సాధించారు. దీన్ని నేను స్వయంగా అనుభవించాను. 2011లో నేను రాసిన 'వికసించని మందారాలు' కవితా సంపుటిని ఆయనకు అందించినప్పుడు, పుస్తకాన్ని కేవలం ఒకసారి తిప్పి చూసినట్టు కాదు, కవితల అంతరార్థాన్ని, సామాజిక నేపథ్యాన్ని, వాటిలోని భావప్రవాహాన్ని పరిశీలించారు. దాదాపు పది నిమిషాల్లోనే పుస్తకంపై తన అవగాహనను ఏర్పరచుకున్నారు. మరో పది నిమిషాల్లో ఆ పుస్తకానికి ముందుమాట రాశారు. ఆ వేగం కేవలం రచనా చాతుర్యానికి సూచిక కాదు. చదివినదాన్ని వెంటనే గ్రహించి, దాని సారాన్ని పట్టుకుని, అవసరమైన మాటలో వ్యక్తీకరించగల అధ్యయనశీలతకు అది నిదర్శనం. 'వికసించని మందారాలు'కు ఆయన రాసిన ముందుమాట నాకు వ్యక్తిగతంగా ఒక జ్ఞాపకం మాత్రమే కాదు. మల్లారెడ్డి సాహిత్య దృష్టికి కూడా ఒక చిన్న సాక్ష్యం. రైతాంగం, వ్యవసాయం, రాజకీయాలు, చరిత్ర వంటి విస్తృత రంగాల్లో ఆయనకు ఉన్న పరిజ్ఞానంతో పాటు సాహిత్యాన్ని కూడా సామాజిక జీవితంతో అనుసంధానించి చూడగలిగిన దృష్టి ఆయనలో ఉంది. కవిత్వాన్ని కేవలం పదాల అలంకారంగా కాకుండా సమాజం పట్ల రచయితకు ఉన్న స్పందనగా చూడగలిగారు. ఒక యువ లేదా సమకాలీన రచయిత రచనలోని సామాజిక అంతస్సారాన్ని గుర్తించి, దానిని ప్రోత్సహించడానికి ముందుమాట రాయడం ఆయనలోని సాహిత్య సంస్కారానికి నిదర్శనం.

ఇక్కడే మల్లారెడ్డి వ్యక్తిత్వంలోని మరో కోణం కనిపిస్తుంది. సాధారణంగా రాజకీయ నాయకుడి అధ్యయనం రాజకీయ పుస్తకాల వరకే పరిమితమవుతుంది. కానీ ఆయన పఠన పరిధి విస్తృతమైనది. వ్యవసాయ విధానాలపై నివేదికలు చదివిన వ్యక్తే సాహిత్యాన్ని కూడా అంతే శ్రద్ధగా చదవగలిగారు. చరిత్రను పరిశీలించిన వ్యక్తే కవిత్వంలోని మానవీయ స్పందనను గుర్తించగలిగారు. ఈ విస్తృత పఠనమే ఆయన మాటలకు లోతును ఇచ్చింది. తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమం తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్న కాలంలో మల్లారెడ్డి రాజకీయ జీవితం మరింత పదునెక్కింది. 1970 – 80 దశకాల్లో వరంగల్ ప్రాంతంలో సీపీఐ(ఎం) కార్యకర్తలపై దాడులు, హత్యలు, కేసులు, అరెస్టులు కొనసాగాయి. ఆయన స్వయంగా అజ్ఞాత జీవితాన్ని అనుభవించారు. ప్రజల కోసం పనిచేసే కార్యకర్తకు నిర్బంధం కొత్త విషయం కాదు. నిర్బంధం మధ్య కూడా రాజకీయ నిబద్ధతను నిలబెట్టుకోవడం ఉద్యమకారుడి అసలు పరీక్ష. ఆ పరీక్షను ఆయన దాటారు. అధికారం కోసం రాజకీయాన్ని ఎంచుకోలేదు. ప్రజల మధ్య ఉండటానికే రాజకీయాన్ని ఎంచుకున్నారు.

మల్లారెడ్డి జీవితానికి రైతాంగ ఉద్యమం కేంద్రబిందువు. తెలంగాణలో రైతు సంఘం నిర్మాణం నుంచి అఖిల భారత కిసాన్ సభ నాయకత్వం వరకు ఆయన ప్రయాణం సాగింది. రైతు సమస్యలను రాష్ట్ర సరిహద్దుల్లో బంధించకుండా జాతీయ వ్యవసాయ విధానాల ప్రశ్నగా ముందుకు తీసుకెళ్లారు. అఖిల భారత కిసాన్ సభలో జాతీయ స్థాయి బాధ్యతలు నిర్వహించారు. ఇది ఒక పదవి కాదు. దేశంలోని వివిధ ప్రాంతాల రైతాంగ సమస్యలను సమగ్రంగా చూడాల్సిన బాధ్యత. పంజాబ్ రైతు, తెలంగాణ రైతు, బీహార్ కౌలు రైతు, కేరళ చిన్న రైతు వారి పరిస్థితుల్లో తేడాలున్నా భూమి, మార్కెట్, రుణం, ధర, ఉత్పత్తి వ్యయం, ప్రభుత్వ విధానాల ప్రశ్నల్లో ఉన్న సంబంధాలను ఆయన గుర్తించారు. రైతు అంటే ఒకే వర్గం కాదని ఆయన రాజకీయ అవగాహన స్పష్టం చేసింది. భూస్వామి, ధనిక రైతు, మధ్యతరగతి రైతు, సన్నకారు రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికుడు, వారి ప్రయోజనాలు ఒకేలా ఉండవు. రైతాంగ సమస్యను అర్థం చేసుకోవాలంటే గ్రామీణ వర్గ సంబంధాలను అర్థం చేసుకోవాలి. భూమి ఎవరి చేతిలో ఉంది? సాగు చేసేది ఎవరు? పంటకు పెట్టుబడి ఎవరిది? కౌలు ఎంత? అప్పు ఎక్కడి నుంచి వస్తోంది? పంటను ఎవరు కొనుగోలు చేస్తున్నారు? ధరను ఎవరు నిర్ణయిస్తున్నారు? ఈ ప్రశ్నలే రైతు సంక్షోభం వెనుక ఉన్న వాస్తవాన్ని బయటపెడతాయి. అందుకే ఆయనకు రైతు సమస్య అంటే కేవలం పంట ధర సమస్య కాదు. అది భూమి సమస్య. కౌలు హక్కుల సమస్య. రుణ సమస్య. నీటి సమస్య. మార్కెట్ సమస్య. ప్రభుత్వ కొనుగోలు సమస్య. వ్యవసాయ కార్మికుడి ఉపాధి సమస్య. వ్యవసాయ ఉత్పత్తిపై కార్పొరేట్ ఆధిపత్యాన్ని అడ్డుకునే ప్రశ్న. రైతు జీవితాన్ని ప్రభావితం చేసే ఈ అంశాలన్నింటినీ కలిపి చూడటం ఆయన రాజకీయ దృష్టిలోని ప్రధాన బలం.



కనీస మద్దతు ధర కోసం ఆయన చేసిన పోరాటం కూడా ఇదే దృక్పథంలో భాగం. రైతు పంటను ఉత్పత్తి చేస్తాడు. కానీ ఆ పంటకు ధరను రైతు నిర్ణయించడు. విత్తనాల ధరను కంపెనీలు నిర్ణయిస్తాయి. ఎరువులు, పురుగుమందుల ధరలు పెరుగుతాయి. బ్యాంకు రుణం రైతు మీద వడ్డీ భారాన్ని పెడుతుంది. మార్కెట్‌లో పంట ధర పడిపోతుంది. చివరికి ఉత్పత్తి చేసిన రైతే నష్టపోతాడు. ఈ విరోధాన్ని పరిష్కరించకుండా రైతు సంక్షోభానికి శాశ్వత పరిష్కారం సాధ్యం కాదని ఆయన నిరంతరం వాదించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం అదనంగా రైతుకు ధర లభించాలన్న డిమాండ్‌ను ఆయన బలంగా ముందుకు తెచ్చారు. ఇది కేవలం ధర పెంచమనే డిమాండ్ కాదు. రైతు ఉత్పత్తికి సముచిత విలువ ఇవ్వాలనే ప్రశ్న. ప్రభుత్వం రైతును మార్కెట్ దయకు వదిలేయకుండా బాధ్యత తీసుకోవాలనే ప్రశ్న. కౌలు రైతుల సమస్యపై కూడా ఆయన స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. భూమి స్వంతం లేని వ్యక్తి సాగు చేస్తే అతను రైతు కాదా? భూమి పట్టా పేరులో ఉన్నవారికే ప్రభుత్వ సహాయం అందితే వాస్తవంగా సాగు చేస్తున్న కౌలు రైతు పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం లేకుండా రైతు సంక్షేమం గురించి మాట్లాడటం అసంపూర్ణం. కౌలు రైతుకు గుర్తింపు, రుణం, బీమా, పంట నష్టం పరిహారం, సాగు హక్కులు కల్పించాలన్న డిమాండ్ రైతాంగ ఉద్యమంలో ఆయన నిరంతరం ముందుకు తెచ్చిన అంశం. 2020 – 21లో దేశాన్ని కుదిపేసిన మూడు వ్యవసాయ చట్టాల వ్యతిరేక రైతాంగ ఉద్యమంలో కూడా ఆయన తెలంగాణ నుంచి బలమైన స్వరం వినిపించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ ఆధిపత్యానికి తెరిచే విధానాలను ఆయన వ్యతిరేకించారు. రైతు ఉత్పత్తి, మార్కెట్, ధరలపై ప్రభుత్వ బాధ్యత తగ్గి, కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగితే చిన్న, సన్నకారు రైతు మరింత అసురక్షితుడవుతాడని హెచ్చరించారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు నెలల తరబడి పోరాడినప్పుడు తెలంగాణలో కూడా ఆ ఉద్యమానికి మద్దతుగా రైతులను సమీకరించడంలో ఆయన భాగస్వామ్యం అయ్యారు.

వ్యవసాయంలో కార్పొరేట్ జోక్యాన్ని ఆయన కేవలం కొనుగోలు, అమ్మకాలకే పరిమితం చేసి చూడలేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, మార్కెటింగ్, రుణం – వ్యవసాయ ఉత్పత్తి గొలుసులోని ప్రతి దశలో పెరుగుతున్న ప్రైవేటు ఆధిపత్యాన్ని ఆయన పరిశీలించారు. అధిక ఎరువుల వినియోగం వెనుక ఉన్న వాణిజ్య ప్రయోజనాలను ప్రశ్నించారు. రైతు శాస్త్రీయ వ్యవసాయం చేయాలి అంటే శాస్త్రీయ సలహా కూడా కంపెనీల మార్కెటింగ్ ప్రయోజనాలకు అతీతంగా ఉండాలని ఆయన పట్టుదలగా చెప్పారు. మల్లారెడ్డి మరో విశిష్టత ఆయన రచనా కృషి. ఆయనకు రచన ప్రచారం కోసం కాదు. ఉద్యమానికి జ్ఞానాన్ని సమకూర్చేందుకు. భారతదేశ రైతు ఉద్యమాల చరిత్ర నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వరకు ఆయన అధ్యయనం చేశారు. రైతు ఉద్యమాల చరిత్రను నమోదు చేయడం ద్వారా నేటి పోరాటాలను గత పోరాటాల అనుభవాలతో అనుసంధానించారు. చరిత్ర ఆయనకు గతాన్ని స్మరించుకోవడానికి కాదు; వర్తమాన పోరాటానికి దిశను కనుగొనడానికి అవసరమైన సాధనం.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై ఆయన చేసిన రచనలు ఈ దృష్టిని ప్రతిబింబిస్తాయి. రైతాంగ పోరాటాన్ని కేవలం వీరగాథగా కాకుండా, భూమి, వెట్టి, భూస్వామ్య ఆధిపత్యం, ప్రజా ప్రతిఘటన, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం వంటి సామాజిక, ఆర్థిక అంశాలతో చూడాల్సిన అవసరాన్ని ఆయన రచనలు గుర్తుచేస్తాయి. చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలకు సమాధానం కూడా చరిత్రను శాస్త్రీయంగా అధ్యయనం చేయడమేనన్న అవగాహన ఆయనలో బలంగా ఉంది. మల్లారెడ్డి జీవితంలో అధ్యయనం ఒక అలవాటు కాదు. అది రాజకీయ క్రమశిక్షణ. బడ్జెట్ చదవాలి. వ్యవసాయ విధానాలు చదవాలి. చట్టాలు చదవాలి. ప్రభుత్వ గణాంకాలు చూడాలి. రైతుతో మాట్లాడాలి. గ్రామానికి వెళ్లాలి. పంటను చూడాలి. అప్పు నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాతే రైతు సమస్యపై మాట్లాడాలి. ఈ పద్ధతి ఆయనను కేవలం వేదికలపై ప్రసంగించే నాయకుడి స్థాయి నుంచి అధ్యయనశీలి అయిన ప్రజా నాయకుడి స్థాయికి తీసుకెళ్లింది. ఆయన జీవితంలోని మరో విశేషం వయసు. దశాబ్దాల ఉద్యమం తర్వాత కూడా ప్రజా జీవితానికి దూరం కాలేదు. కరోనా కాలంలో కూడా రైతుల సమస్యలపై ప్రభుత్వాలకు లేఖలు రాశారు. ఎనభై దాటిన వయసులోనూ వ్యవసాయ రంగంపై పుస్తకాలు రాశారు, రైతు సమస్యలపై మాట్లాడారు, ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వయసు పెరిగేకొద్దీ శరీరం నెమ్మదించవచ్చు; కానీ ప్రజల పట్ల బాధ్యత తగ్గకూడదనే జీవన సందేశాన్ని ఆయన ఆచరణలో చూపించారు.

ఇటీవలి కాలంలో కూడా రైతు సంఘం కార్యకర్తలకు స్థానిక సమస్యలపై దృష్టి పెట్టాలని, భూ సమస్యలను పట్టించుకోవాలని, ప్రతి కార్యకర్త అధ్యయనం పెంచుకోవాలని ఆయన ఇచ్చిన పిలుపు ఆయన రాజకీయ జీవితానికి కొనసాగింపే. ఉద్యమం అంటే పెద్ద సభలు, పెద్ద నినాదాలు మాత్రమే కాదని, గ్రామంలో రైతు ఎదుర్కొంటున్న ఒక భూ సమస్యను పట్టుకోవడం నుంచి ఉద్యమం ప్రారంభమవుతుందని ఆయన అనుభవం చెబుతోంది. సారంపల్లి మల్లారెడ్డిని సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడిగా మాత్రమే గుర్తించడం సరికాదు, ఆయన తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక తరం అనుభవాన్ని మోసుకొచ్చిన నాయకుడు. రైతాంగ ఉద్యమంలో దీర్ఘకాలం పనిచేసిన నిర్వాహకుడు. అఖిల భారత కిసాన్ సభలో జాతీయ స్థాయి నాయకుడు. వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసిన ప్రజా మేధావి. రైతు ఉద్యమ చరిత్రను నమోదు చేసిన రచయిత. సాహిత్యాన్ని కూడా ఆస్వాదించి, కొత్త రచయితలను ప్రోత్సహించిన సహృదయుడు. అయితే ఆయన జీవితానికి అసలు కొలమానం పదవులు కాదు. ప్రజల మధ్య గడిపిన కాలం. నిర్బంధంలో నిలబెట్టుకున్న నిబద్ధత. రైతు సమస్యపై చూపిన పట్టుదల. చదివిన పుస్తకాలను ఉద్యమ జ్ఞానంగా మార్చిన తీరు. ఒకతరం నుంచి మరో తరానికి అందించిన రాజకీయ అనుభవం. సాహిత్యాన్ని కూడా ప్రజా జీవితంలోని అంతర్భాగంగా చూడగలిగిన విస్తృత దృష్టి.

నేడు భారత వ్యవసాయం కొత్త సంక్షోభాల మధ్య ఉంది. ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. పంట ధరల్లో అనిశ్చితి కొనసాగుతోంది. కౌలు రైతులకు గుర్తింపు కొరవడుతోంది. వాతావరణ మార్పులు పంటలపై ప్రభావం చూపుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులపై కార్పొరేట్ ఆధిపత్యం పెరుగుతోంది. వ్యవసాయ మార్కెట్‌లో రైతు బేరసారాల శక్తి బలహీనంగా ఉంది. ఇలాంటి సమయంలో మల్లారెడ్డి గారి జీవితాన్ని స్మరించుకోవడం అంటే ఒక సీనియర్ నాయకుడిని అభినందించడం మాత్రమే కాదు. ఆయన నేర్పిన పద్ధతిని తిరిగి గుర్తుచేసుకోవడం. ప్రజల మధ్య ఉండాలి. చదవాలి. ప్రశ్నించాలి. వాస్తవాలను సేకరించాలి. రైతాంగాన్ని ఒకే సమూహంగా కాకుండా దాని అంతర్గత వర్గ సంబంధాలతో చూడాలి. ప్రభుత్వ విధానాలను విమర్శించడమే కాదు, వాటి వెనుక ఉన్న ఆర్థిక ప్రయోజనాలను బయటపెట్టాలి. ఉద్యమాన్ని నినాదం నుంచి సంఘటిత శక్తిగా మార్చాలి. చరిత్రను అధ్యయనం చేసి వర్తమాన పోరాటానికి ఉపయోగించాలి. సాహిత్యాన్ని ప్రజల జీవిత స్పందనగా చదవాలి. కొత్త రచయితలలోని సామాజిక చైతన్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలి. ఇదే సారంపల్లి మల్లారెడ్డి జీవిత సారం.

తిమ్మంపేటలో గ్రామీణ అసమానతలను చూసిన యువకుడు కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చాడు. నిర్బంధాన్ని ఎదుర్కొన్నాడు. అజ్ఞాత జీవితాన్ని అనుభవించాడు. రైతాంగాన్ని సంఘటితం చేశాడు. రాష్ట్రం నుంచి దేశస్థాయికి రైతు గొంతును తీసుకెళ్లాడు. పుస్తకాలు రాశాడు. చరిత్రను అధ్యయనం చేశాడు. సాహిత్యాన్ని చదివాడు. ఒక కవితా సంపుటిని కొద్దిసేపట్లో చదివి దాని అంతరార్థాన్ని పట్టుకుని ముందుమాట రాసినంత వేగంతో రచనను అర్థం చేసుకున్నాడు. వయసు మీదపడినా ఉద్యమాన్ని విడిచిపెట్టలేదు. అందుచేత సారంపల్లి మల్లారెడ్డి జీవితం ఒక వ్యక్తి జీవిత చరిత్ర కాదు. అది తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమం, రైతాంగ పోరాటం, అధ్యయనం, సాహిత్య సంస్కారం, ప్రజా నిబద్ధత కలిసిన ఒక దీర్ఘ ప్రయాణం. పొలాన్ని చదివిన కమ్యూనిస్టు ఆయన. రైతు బాధను రాజకీయ ప్రశ్నగా మలిచిన నాయకుడు ఆయన. చరిత్రను చదివి, చరిత్రను రాసి, చరిత్రలో భాగమైన ఉద్యమకారుడు ఆయన. సాహిత్యంలోని సామాజిక స్పందనను గుర్తించిన సహృదయ పాఠకుడు ఆయన. ప్రజల కోసం పోరాడాలంటే ముందుగా ప్రజల జీవితాన్ని చదవాలి. ఆ జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే అధ్యయనం చేయాలి. అధ్యయనాన్ని ఉద్యమంగా, ఉద్యమాన్ని సంఘటిత శక్తిగా మార్చాలి. ఇదే మల్లారెడ్డి నుంచి నేర్చుకోవాల్సిన పాఠం. కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి దీర్ఘ ప్రజా – రైతాంగ ఉద్యమ జీవితానికి విప్లవ జోహార్లు.



**మామిండ్ల రమేష్ రాజా**
**రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ,**
**సెల్ : 78932 30218**

### భారతదేశ ఆర్థిక సామాజిక వాస్తవికత
## ప్రతిఫలం లేని వాగ్దానాలు

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరుగుతాయి. హామీలు గుప్పిస్తారు కానీ, అమలులో లక్ష్యాలకూ, ప్రయోజనాలకు మధ్య వారధి లేకపోవడం అనేది దేశవ్యాప్తంగా కనిపించే వైరుధ్యం. "ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులు, యువతకు ఉద్యోగాలు, రైతులకు న్యాయం" అనే డిమాండ్లు భారతదేశ రాజకీయ చరిత్రలో ఎన్నడూ కొత్త కాదు. అయితే 2026 నాటి విధానపరమైన నిర్ణయాలు, గణాంకాలు ఈ డిమాండ్ల ప్రాథమిక స్వభావాన్ని మార్చకుండా, కేవలం వేదికలను మార్చాయని చెప్పాలి.

యువత ఉద్యోగాల విషయంలో ఈ విరుద్ధత అత్యంత స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలో ప్రతి నెలా సుమారు 10 లక్షల మంది యువత శ్రామిక బలగంలోకి ప్రవేశిస్తున్నారు . కానీ, 2026 ఏప్రిల్-జూన్ కాలానికి దేశంలో మొత్తం నిరుద్యోగిత రేటు 5.4 శాతానికి పెరిగింది. ఇది సర్వే చరిత్రలోనే అత్యధికం. 15-29 సంవత్సరాల మధ్య వయస్సు వారిలో యువత నిరుద్యోగిత రేటు 15.9 శాతానికి ఎగబాకింది. గ్రామీణ ప్రాంతాల్లో 14.7 శాతంగా ఉంది. అసలైన సంక్షోభం ఇంతటితో ఆగదు. అధికారిక సర్వేలు దీనిని తక్కువగా చేసి చూపిస్తుంటే, స్వతంత్ర సంస్థ (సీ.ఎం.ఐ.ఈ.) ఈ రేటు 7-8 శాతం మధ్య ఉందని అంచనా వేసింది . ప్రభుత్వం (పీఎం-వీ.బీ.ఆర్.వై.) (వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన) పథకం కింద మార్చి 2026లో రూ2,400 కోట్ల ప్రోత్సాహకాలను మాత్రమే పంపిణీ చేసి, 15 లక్షల మందికి ప్రయోజనం కలిగించినట్లు ప్రకటించింది. కానీ, 2024-25 నుండి 2026-27 వరకు ఉన్న నిరంతర అధిక నిరుద్యోగిత రేటు నేపథ్యంలో, ఈ కోట్ల సంఖ్యలు స్థూలమైన సంఖ్యలు మాత్రమేనని, అవి జనాభా అవసరాలను తీర్చలేకపోతున్నాయని స్పష్టమవుతోంది.

కార్మికుల పరిస్థితి అలాగే ఉండగా, రైతాంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు 'ధర' కాదు, 'విశ్వాసం'. (ఎం.ఎస్.పీ)ని అమలు చేయడంలో రాష్ట్రాల మధ్య వ్యత్యాసం ఉంది. మధ్యప్రదేశ్ లో 5.33 లక్షల టన్నుల పెసరపప్పు కొనుగోళ్లు రికార్డు స్థాయిలో జరిగాయి, రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరింది. గుజరాత్, తమిళనాడు, హర్యానాలో కూడా వేర్వేరు స్థాయిల్లో కొనుగోళ్లు ఆమోదించబడినా , పంటలో ఎక్కువ భాగం ఇప్పటికీ ప్రైవేట్ వ్యాపారుల చేతిలోనే నష్టపోతోంది. 2026-27 మార్కెటింగ్ సీజన్ లో ధాన్యం కొనుగోళ్లు కేవలం 10 శాతానికే పరిమితమైతే, మిగతా 90 శాతం పంట తక్కువ ధరకు అమ్ముడై రైతులు రూ. 3.07 లక్షల కోట్ల నష్టాన్ని చవిచూస్తున్నారని "సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్.కే.ఎం.) అంచనా వేసింది . రైతులకు (ఎం.ఎస్.పీ) హామీలో 'సమానత్వం' లేకపోవడం, అసలైన స్థూల లాభాలను మాత్రమే పరిగణిస్తున్న ప్రభుత్వ ధర, వల్ల రైతులు పోరాడే పరిస్థితి నెలకొంది.

ఇక, విద్య మరియు సామాజిక భద్రత రంగాల్లో పథకాలకు, వాటి వినియోగానికి మధ్య భారీ అంతరం కనిపిస్తుంది. 2026-27 బడ్జెట్లో విద్యకు కేవలం రూ. 1.39 లక్షల కోట్లు మాత్రమే కేటాయించబడినా, అది దేశ జీడీపీలో కేవలం 0.36 శాతం మాత్రమే. ఇది నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్.ఏ.పీ) 2020 అమలుకు అవసరమైన నిధుల కంటే చాలా తక్కువ. పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ప్రీ-మ్యెట్రిక్ స్కాలర్షిప్ ల కేటాయింపులు స్తంభించడంతో, డ్రాపౌట్ రేట్లు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఎస్టీ బాలికల్లో డ్రాపౌట్ 15 శాతానికి చేరింది . దీనికి తోడు, (పీఎం- యు.ఎస్.హెచ్.ఏ.) వంటి అధిక విద్యా పథకాల్లో నిధులు కేవలం 16 శాతం మాత్రమే వినియోగించబడ్డాయి . ఈ నిధుల వినియోగంలో నిర్లక్ష్యం అంటే, యువతను నైపుణ్యం లేని శ్రామికులుగా మార్చి, తర్వాత నిరుద్యోగం అనే సమస్యను తీవ్రతరం చేయడమే.

మరోవైపు, ప్రయోజనాలను చేరవేసే విధానాల్లో స్పష్టమైన మెరుగుదల కనిపిస్తోంది. 2016లో కేవలం 22 శాతంగా ఉన్న సామాజిక భద్రతా కవరేజీ, 2026 నాటికి 65.3 శాతానికి పెరిగింది. 90 కోట్ల మందికి పైగా ప్రజలు రక్షణ పొందుతున్నారు. జన్ ధన్ ఖాతాలు (రూ. 55.64 కోట్లు), ఆయుష్మాన్ భారత్ (రూ.41.29 కోట్లు), (పీ.ఎం.జీ.కే.ఏ.వై.) కింద 80.67 కోట్ల మందికి ఉచిత ఆహారం అందుతోంది. కానీ, ఈ భద్రతా వలయం ఎంత పెద్దదిగా విస్తరించినా, అది కేవలం 'జీవనాధారం' వరకే పరిమితం. ఉపాధి, వేతనం, వృద్ధి అవకాశాలను సృష్టించలేకపోవడంతో, ఈ భద్రతా ప్రయత్నాలు పూర్తి స్థాయి అభివృద్ధికి ప్రత్యామ్నాయం కావడం లేదు.

చివరగా చెప్పాలంటే, స్థానిక రాజకీయాల్లో మాటలుగా, హామీలుగా ఉన్న విషయాలు జాతీయస్థాయిలో విధాన సంక్షోభంగా మారాయి. 'మాటపై నిలబడటం' అనేది ప్రతిపక్షానికి మాత్రమే పరిమితం కాకుండా, పాలకవర్గం కూడా తమ వాగ్దానాలను నిలబెట్టుకునే అవసరాన్ని సూచిస్తుంది. కేటాయింపుల డేటా, నిరుద్యోగిత గణాంకాలు, రైతుల నష్టాల లెక్కలు నిరూపించేది ఒక్కటే – సిద్ధాంతాలు ఎంత అందంగా ఉన్నా, వాటి అమలు, అలాగే కేటాయింపులలో లోపాలు కొనసాగుతున్నంత కాలం భారతదేశం 'వికసిత్ భారత్'గా మారే కాంక్ష కేవలం ఒక ఎన్నికల నినాదంగానే మిగిలిపోతుంది.




**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
ramkishore.1504@gmail.com

## వ్యక్తిత్వమే..

ఆ పేరు అంబికో అంబాలికో వలుపులరాశి
వ్యాసునితో ఒక రాత్రి సంగమంలో ధృతరాష్ట్రుడు
ఉదయించాడు
రాజసౌధాల వైభవం లేని
బంగారునగ మెరుపులేని
అంతఃపుర దాసి
అదే మహర్షితో ఒక సంయోగంలో విదురుడు
జన్మించాడు
ఒక గర్భం కిరీటం ఇస్తే మరో గర్భం కిరణమిచ్చింది
సింహాసనంపై ఒకరైతే ధర్మాసనంపై ఒకరు
శాస్త్రం చదవడం ఒకరైతే ఆచరించడం ఒకరు
మాటల్లో దూసే కత్తులతో ఒకరైతే
రాజీ పొత్తులతో ఒకరు
అత్యాశతో ఆఖరికి వంశవృక్షం
కొమ్మలన్నీ ఇరుచుకున్న వికృతి ఒకరైతే
సుగుణాల ప్రకృతిగా ఒకరు
పుట్టుకలో ఏముంది
చరిత్ర జన్మలను లెక్కపెడుతుంది
కాలం గుణాలను గుర్తించుకుంటుంది
వంశం మనిషిని పరిచయం చేస్తుంది
వ్యక్తిత్వమే మనిషిని నిలబెడుతుంది

కోటం చంద్రశేఖర్
9492043348

## పక్షి



ఎండుపుల్లలతో
గూడుకట్టుకుంటుంది ఓపక్షి
చెట్టుబోదెను తొలచిన
గూడులోను ఓపక్షి
నారతీగలతో
గూడు అల్లుకుంటుంది ఓపక్షి
పక్షుల నైపుణ్యాలతో
ఇల్లు మన అక్షర కుక్షి

రేడియమ్
9291527757

# ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి
- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ




**చేవెళ్ల, ఆగస్టు 28 (జనంసాక్షి) :** కరీంనగర్ పట్టణంలో సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని లేబర్ అడ్డ వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతూ భారతదేశంలోనే బలమైన కార్మిక సంఘంగా ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర మహాసభల్లో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్మిక ఉద్యమానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో కార్మిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు కార్మిక పోరాటాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 6న కరీంనగర్‌లో నిర్వహించే కార్మిక బహిరంగ సభకు వందలాది మంది కార్మికులు తరలిరావాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో లక్షలాది మంది అసంఘటిత రంగ కార్మికులు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించేందుకు నాయకులు, కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం. సత్తిరెడ్డి, ఏఐకేఎస్ రాష్ట్ర సమితి సభ్యులు ఎం. సుధాకర్‌గౌడ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. మక్బూల్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బాబురావు, బీకేసీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీను, హనుమంత్, శంకర్, మల్లయ్య, భవన నిర్మాణ రంగ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికే పరిమితమైన నీటి ప్లాంటు..!

- రోగుల అవసరాల కోసం రూ. 2 లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు..
- ఏడాదిగా పట్టించుకోని గుత్తేదారు



**యాచారం, ఆగస్టు 28 (జనం సాక్షి) :** యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో రోగుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన నీటి శుద్ధి ప్లాంటు ఏడాది కాలంగా వృథాగా పడి ఉంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తన ఎంపీ కోటా నిధులు రూ. 2 లక్షలు వెచ్చించి, స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డితో కలిసి ఈ ప్లాంటును అట్టహాసంగా ప్రారంభించారు. అయితే, ప్రారంభోత్సవం జరిగే నాటికే ఈ ప్లాంటు బిగింపు పనులు పూర్తిగా కాలేదు. కేవలం అధికారిక కార్యక్రమం ముగించాలనే తొందరలో ప్లాంటును ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, ఆ తర్వాత దాని పర్యవేక్షణను పూర్తిగా విస్మరించారు. ప్రారంభోత్సవం ముగిసి ఏడాది గడుస్తున్నా, సంబంధిత గుత్తేదారు (కాంట్రాక్టర్) మిగిలిన పనులను పూర్తి చేసి దీనిని వినియోగంలోకి తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారు. ప్రజాధనం రూ. 2 లక్షలు వెచ్చించినా రోగులకు మాత్రం తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అసంపూర్తిగా ఉన్న ప్లాంటు పనులను పూర్తి చేయించి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## కులమతాలకు అతీతంగా అన్నదానం



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) :** మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని నాగర్‌కర్నూల్ పట్టణంలోని ముస్లిం మైనారిటీ యువకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అన్నదానం చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. వక్ఫ్ కాంప్లెక్స్ ఎదుట ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని మాజీ వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఉర్ రహ్మాన్, కౌన్సిలర్ మహమ్మద్ నిజాం, సీనియర్ జర్నలిస్ట్ అహ్మదుల్లా ఖాన్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సమాజానికి ప్రేమ, సోదరభావం, సమానత్వం, మానవత్వం వంటి విలువలను బోధించారని తెలిపారు. మనుషుల మధ్య కులం, మతం, ప్రాంతం వంటి భేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలన్నదే ప్రవక్త బోధనల సారాంశమని పేర్కొన్నారు. ప్రవక్త జన్మదినాన్ని కేవలం మతపరమైన కార్యక్రమాలకు పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి సేవా కార్యక్రమాలు మానవత్వానికి ప్రతీకలని అన్నారు. భూమిపై ఉన్న సకల జీవజాతులతో పాటు ప్రతి మనిషిని మానవత్వంతో చూడాలని మహమ్మద్ ప్రవక్త బోధించారని వారు గుర్తుచేశారు. సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యత పెంపొందించేలా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కులమతాల పేరుతో ప్రజల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించకుండా, సమాజ సేవనే లక్ష్యంగా చేసుకుని ప్రతి ఒక్కరికీ అండగా నిలవాలని కోరారు. మీలాద్ ఉన్ నబీ సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ముస్లిం మైనారిటీ యువకులు సమష్టిగా ముందుకు వచ్చి పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. మత సామరస్యం, సోదరభావాన్ని చాటేలా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు మహమ్మద్ నవాజ్, మహమ్మద్ నసీర్, మహమ్మద్ రియాజ్, మహమ్మద్ జునైద్, మహమ్మద్ మహమూద్, ఆ. నవాబ్, మహమ్మద్ వాసిఫ్ తదితరులతో పాటు ముస్లిం మైనారిటీ యువకులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సంఘాల బాధ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈనెల 31న జోగులాంబ రైల్వే స్టేషన్ పరిశీలించనున్న మంత్రి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 28 (జనం సాక్షి) :** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అలంపూర్ పర్యటనను విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఈ నెల 31న కేంద్ర మంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ అలంపూర్‌లో ఏర్పాట్లు పరిశీలించారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. అమృత్ భారత్ స్టేషన్స్ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించడం జరుగుతుందన్నారు. స్టేషన్లో ప్రయాణికులు వేచి ఉండు హాల్స్ ను, టికెట్ కౌంటర్, ఇతర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. జోగులాంబ స్టేషన్ అభివృద్ధి పనులను, ఈ స్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకల వివరాలను అసిస్టెంట్ రైల్వే డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. డబ్లింగ్ పనులకు అవసరమైన భూ సేకరణ జిల్లా పరిధిలో పూర్తయిందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఆలంపూర్ పట్టణంలోని హరిత హోటల్ సందర్శించిన కలెక్టర్ అక్కడికి మంత్రి వస్తున్నందున అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ ఆలంపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి 22 ఏ కింద వ్యవసాయ, వ్యవసాయతర భూముల వివరాలను సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కానీ, ఇతర ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ ప్రక్రియలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ప్రసాద్ పథకంలో భాగంగా నిర్మించిన భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి అన్నప్రసాద కేంద్రంలో నిర్వహణపై ఆరా తీశారు. భక్తులకు భోజనాన్ని రుచికరంగా వండి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలంపూర్ ఆలయాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సౌండ్స్ అండ్ లైట్స్ ప్రదర్శనను కేంద్రమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లపై కలెక్టర్ క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ పర్యటనలో పర్యాటక శాఖ అధికారులు పర్షవేది, వినోద్ కుమార్, విక్రమ్, ఆలంపూర్ తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ రాజేష్, ఆలయ అధికారులు, తదితరులున్నారు.

## గుండె జబ్బుతో బాధపడుతున్న 69 ఏళ్ల మహిళకు భారీ అండాశయ తిత్తి తొలగింపు




**సికింద్రాబాద్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 69 ఏళ్ల మహిళకు భారీ అండాశయ తిత్తిని (ఓవేరియన్ సిస్ట్)ను తొలగించారు . సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యుల బృందం ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను నిర్వహించి, విజయవంతంగా పూర్తి చేసి ఆ వృద్ధురాలికి పునర్జన్మ ప్రసాధించారు. హైదరాబాద్ కు చెందిన రౌదభాయ్(68) భారీగా పెరిగిన అండాశయ తిత్తి కారణంగా కడుపులో తీవ్రమైన అసౌకర్యం, ఒత్తిడితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. తిత్తి పరిమాణం ఎక్కువగా ఉండటంతో శస్త్రచికిత్స అనివార్యమైంది. అయితే ఆమెకు ఇప్పటికే తీవ్ర మైన గుండె జబ్బు ఉండటంతో శస్త్రచికిత్సతో పాటు మత్తు మందు ఇవ్వడం కూడా సవాల్‌గా మారింది. పెద్ద స్థాయి కడుపు శస్త్రచికిత్స సమయంలో గుండెపై అదనపు ఒత్తిడి పడే అవకాశం ఉండటంతో వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. మత్తు మందు సమయంలో రక్తపోటు, గుండె స్పందన, రక్త ప్రసరణలో వచ్చే మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తూ చికిత్స చేపట్టారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి డొక్కు నేతృత్వంలో శస్త్రచికిత్స నిర్వహించగా.. కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకంటి గుండె సంబంధిత అంశాలను, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ మత్తుమందు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి డొక్కు మాట్లాడుతూ.. భారీ అండాశయ తిత్తిని తొలగించడం సాధారణ పరిస్థితుల్లోనే సవాలు తో కూడుకున్నదని, రోగికి తీవ్రమైన గుండె జబ్బు ఉండటంతో ప్రమాదం మరింత పెరిగిందని తెలిపారు. గుండెస్థితి స్థిరంగా ఉండేలా చూసుకుంటూనే గైనకాలజీ, కార్డియాలజీ, అనస్థీషియా విభాగాల సమన్వయంతో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ కృష్ణవేణి, మెడికల్ సూపరింటెండెంట్ డా. ప్రశాంత్ పాల్గొన్నారు.

## వీహెచ్‌ఎస్ పోరాటంతోనే వికలాంగులకు గుర్తింపు, గౌరవం

- రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య



**యాచారం, ఆగస్టు 28 (జనం సాక్షి) :** వికలాంగుల హక్కుల పోరాట సమితి సుదీర్ఘ పోరాటాల వల్లే సమాజంలో వికలాంగులకు గుర్తింపు, గౌరవం దక్కాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య అన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలో విహెచ్పిఎస్ 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్ల జంగయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2007 ఆగస్టు 28న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో విహెచ్పిఎస్ ఏర్పడిందని, గత 19 ఏళ్లుగా వికలాంగుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేసి ఎన్నో ఫలాలను సాధించిపెట్టిందని గుర్తు చేశారు. గతంలో కేవలం రూ. 200 గా ఉన్న వికలాంగుల పెన్షన్ నేడు రూ. 4016 కి పెరిగిందంటే అది విహెచ్పిఎస్ చేసిన నిరంతర పోరాటాల ఫలితమేనని స్పష్టం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు వికలాంగుల పెన్షన్‌ను రూ. 6000 కి పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా తిరగబడి ఉద్యమించిన ఏకైక సంఘం విహెచ్పిఎస్ మాత్రమేనని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని జంగయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్ చారి, జిల్లా అధ్యక్షులు యాచారం జంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము రాములు, మహమ్మద్ సలీం, మాజీ మండల అధ్యక్షులు దేరంగుల ఈశ్వర్, మండల కన్వీనర్ చెక్క రాజు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బోడ కృష్ణ, జోగు అంజయ్య, చింతుల్ల సాయిలు, కంబాలపల్లి సాయిలు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కో ఇన్చార్జి బోడ ముత్యాలు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మూలి మహేష్, అధికార ప్రతినిధి మస్కు యాదగిరి, ప్రధాన కార్యదర్శి కందుకూరి కొండలు, ఎమ్మార్పీఎస్ చింతపట్ల గ్రామ శాఖ అధ్యక్షులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యువత అవకాశాలను సృష్టించుకోవాలి

- మినీ థియేటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, ఆగస్టు 28 (జనంసాక్షి) :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో కౌన్సిలర్ మంగలి కళ్యాణి యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఎల్‌జే సెలబ్రేషన్స్ మినీ ప్రైవేట్ థియేటర్‌ను ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమలోని ప్రతిభను గుర్తించి వ్యాపార రంగంలో అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. సొంతంగా వ్యాపారం ప్రారంభించి మరో నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కష్టపడి పనిచేస్తే విజయాన్ని సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, కౌన్సిలర్లు పైండ్ల మధుసూదన్‌రెడ్డి, కృష్ణానాయక్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డిశెట్టి మధుసూదన్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లోనే పాలకుల నిర్లక్ష్యం

- తాళం వేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం
- వింత సమాధానం ఇస్తున్న జిల్లా అధికారి వినయ్

**గద్వాల, ఆగస్టు 28 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ సముదాయంలో అత్యంత కీలకమైన జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో లేకుండా తాళం వేసి దర్శనమివ్వడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా మారింది. మందుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన మరియు నకిలీ మందుల దందాను అరికట్టాల్సిన బాధ్యత గల ప్రభుత్వ కార్యాలయమే ఇలా లాక్‌డౌన్‌లో ఉండటం స్థానికంగా తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ మధ్యకాలంలో కాలం చెల్లిని మందులను రైల్వే ట్రాక్ దగ్గర ముళ్లపదలలో కుప్పలు కుప్పలుగా పోసిన వైనం కూడా తెలిసింది అయిన వాటి పైన ఎలాంటి చర్యలు తీసుకున్నారు ఇంతవరకు బయటికి ప్రకటించకపోవడం అన్యాయం అని,కళ్ళు మూసుకున్న యంత్రాంగం జిల్లా పరిపాలనకు గుండెకాయ లాంటి కలెక్టరేట్ సముదాయంలోనే ఈ రకమైన నిర్లక్ష్యం కొనసాగుతుండటం ప్రభుత్వ పర్యవేక్షణా లోపానికి స్పష్టమైన అద్దం పడుతోంది. పొంతన లేని బుకాయింపులు,కార్యాలయం మూసివేతపై జిల్లా అధికారి వినయ్ వివరణ కోరగా, “మా ఎంప్లాయిస్ అక్కడ పని చేస్తున్నారు” అంటూ సమాధానం ఇవ్వడం హాస్యాస్పదంగా మారింది. బయట నుంచి తాళం వేసి ఉన్న గదిలో సిబ్బంది ఎలా పని చేస్తున్నారనేది ఇప్పుడు ఒక మిస్టరీగా మారింది .గాల్లో దీపమైన ప్రజల ఆరోగ్యం,గ్రామీణ ప్రాంతాల నుండి ఔషధాల నాణ్యత, ధరల దోపిడీ, మెడికల్ షాపుల నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేయడానికి వచ్చే సామాన్య ప్రజలు, లైసెన్సుల కోసం వచ్చే వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో వెనుదిరుగుతున్నారు. జీతాలు తీసుకుంటూ విధులకు డుమ్మా కొడుతున్న సిబ్బందిపై, బయట తాళాలు వేసి లోపల పని చేస్తున్నామంటూ కట్టుకథలు చెబుతున్న అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న ఇలాంటి కీలక కార్యాలయంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కార్యాలయం నిర్దిష్ట సమయాల్లో తెరిచి ఉంచి ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారులకు లేదా స్పందన పోర్టల్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసిన లాభం లేకపోయిందని ప్రజలు ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత, వేగం ముఖ్యం

- జిల్లా కలెక్టర్ ప్రియాంక
- మక్తల్‌లో యంగ్ ఇండియా స్కూల్, ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన



**మక్తల్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మక్తల్ మండలం గొల్లపల్లి సమీపంలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్’ నిర్మాణ పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం గొల్లపల్లి శివారులో కేటాయించిన భూములను పరిశీలించారు. ఆర్టిఫిషియల్ విభాగానికి 9 ఎకరాలు, సెట్విన్ విభాగానికి 10 ఎకరాల 30 గుంటలు, సెట్విన్ ట్రైనింగ్ సెంటర్‌కు 20 గుంటలు, ఏటీసీ భవనానికి 1.5 ఎకరాలు అలాగే పట్టణంలో కొనసాగుతున్న ఫైర్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

### పన్నుల వసూళ్లలో జాప్యంపై అసంతృప్తి

అనంతరం మక్తల్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై మున్సిపల్ కమిషనర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. బకాయిలను వెంటనే వసూలు చేయాలని స్పష్టం చేశారు. పట్టణంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, చెత్త సేకరణ వాహనాల రాకపోకలను జీపీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన కోసం కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు.

### మార్చి నెలాఖరు నాటికి 150 పడకల ఆస్పత్రి సిద్ధం కావాలి

మక్తల్ శివారులోని 916/2, 917/2 సర్వే నంబర్లలోని 10 ఎకరాల స్థలంలో రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టిన 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటికే ఆా, దీ, జ, ఐ బ్లాకుల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు వివరించగా, మిగిలిన పనులన్నీ మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి ఆస్పత్రిని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస, మున్సిపల్ కమిషనర్ రాజయ్య తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో 96 మొబైళ్లను గుర్తించిన మేడిపల్లి పోలీసులు



**బోడుప్పల్, ఆగస్టు 28 (జనంసాక్షి) :** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న లేదా పడిపోయిన మొత్తం 96 సెల్‌ఫోన్లను పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ సహాయంతో గుర్తించి రికవరీ చేశారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్లను శుక్రవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మేడిపల్లి సీఐ జలంధర్ రెడ్డి బాధితులకు అందజేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి అప్పగించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సెల్‌ఫోన్లు తిరిగి లభించడం పట్ల మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌కు, మేడిపల్లి ఎస్‌హెచ్‌ఓకు, పోలీసు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఐ బొలిశెట్టి శ్రీను, ఏఎస్ఐ బాల్ సింగ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సిఈఐఆర్ పోర్టల్‌లో ఐఎంఈఐ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజల ఆస్తుల రక్షణ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
29 ఆగస్టు 2026

# విద్యుత్ సవరణ బిల్లు రద్దయ్యే వరకు పోరాటం

- విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) : విద్యుత్ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేసే వరకు నిరంతర పోరాటం కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. విద్యుత్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్. శ్రీనివాసులు మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28న హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి అమరులయ్యారని గుర్తుచేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించ డాన్ని వ్యతిరేకిస్తూ, ప్రజలపై విద్యుత్ భారాలను మోపవద్దని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమంపై నాటి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించిందన్నారు. బషీర్‌బాగ్‌లో జరిగిన ఆందోళనపై పోలీసులు కాల్పులు జరపడంతో ముగ్గురు ఉద్యమకారులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. విద్యుత్ అమరవీరుల త్యాగాలతో పాటు నాటి ప్రజా ఉద్యమాల ఫలితంగానే విద్యుత్ చార్జీల పెంపుపై ప్రభుత్వాలు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అమలులోకి రావడానికి కూడా నాటి పోరాటాలు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువరాదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యుత్ సవరణ బిల్లు వల్ల విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణకు మరింత అవకాశం ఏర్పడు తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఉచిత విద్యుత్ పథకానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రజలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొనే విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విద్యుత్ విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను, రాష్ట్రంలోని టీడీపీ రాజకీయ వైఖరిని ఆర్. శ్రీనివాసులు విమర్శించారు. గతంలో విద్యుత్ ఉద్యమాలపై కఠినంగా వ్యవహరించిన వారు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. నాటి ఉద్యమాల స్ఫూర్తిని విస్మరించకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధన కోసం సీపీఎం కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నూతన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య, గుంపల్లి అశోక్, తారా సింగ్, నాయకులు మల్లికార్జున్, శివ, శ్రీనివాసులు, చారి, నిజాం భాష, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన టౌన్‌హాల్ పనులను 10 రోజుల్లో పూర్తి చేసి అప్పగించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



వనపర్తి బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం పాత మార్కెట్ యార్డులో నిర్మించిన టౌన్‌హాల్‌ను సందర్శించి, తుది దశలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. టౌన్‌హాల్‌లో చేపట్టిన వివిధ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేస్తూ, మిగిలిన పనులను 10 రోజుల్లోగా పూర్తి చేసి టౌన్‌హాల్‌ను అప్పగించాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తూ, నూతన టౌన్‌హాల్‌ను త్వరితగతిన ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 15న తదుపరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నూతన టౌన్‌హాల్‌లోనే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా



ఆలంపూర్, ఆగస్టు 28 (జనం సాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శుక్రవారం ఆలంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పెద్ద సంఖ్యలో సిబ్బంది ఉన్నప్పటికీ ఓపీ సంఖ్య తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి అనుగుణంగా ఓపీ పెరగాలని సూచించారు. సరైన చికిత్స అందించకుండా కర్నూలు, ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని వైద్యాధికారులను హెచ్చరించారు. పలువురు ఉద్యోగులు ఎక్కువగా సెలవులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని ఇన్ పేషెంట్లను పలకరించి వైద్య సేవలపై ఆరా తీశారు. రోజూ పరీక్షలు నిర్వహించి, మెనూ ప్రకారం ఆహారం అందించాలని, ల్యాబ్ పరీక్షల రిపోర్టులు సకాలంలో ఇవ్వాలని ఆదేశించారు.

# బీసీ ద్రోహి హరీశ్‌రావు

- తెలంగాణ రక్షణ ఇన్‌చార్జ్ మెదక్ బట్టి అజయ్ తీవ్ర ఆరోపణలు

మెదక్ టౌన్, ఆగస్టు 28 (జనం సాక్షి) : కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచే కుట్ర జరుగుతోందని వ్యాఖ్యలు మెదక్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మెదక్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ బట్టి అజయ్, నర్సాపూర్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ అపర్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు రాజకీయ అంశాలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు.

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై విమర్శలు

బట్టి అజయ్ మాట్లాడుతూ హరీశ్‌రావు బీసీ వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకున్నారని తాము భావిస్తున్న మాధవరెడ్డిని హరీశ్‌రావు తన ఇంటికి పిలిపించి శాలువాతో సత్కరించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో కార్పొరేటర్‌గా పోటీ చేసిన సమయంలో బీసీ సంఘాలు, తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీలో, హరీశ్‌రావు వద్ద ఇంతటి ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు వెన్నుపోటు కుట్ర జరుగుతోందని ఆరోపణ

మెదక్‌ను వేదికగా చేసుకుని కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు హరీశ్‌రావు కుట్ర చేస్తున్నారని బట్టి అజయ్ ఆరోపించారు. ఇటీవల మెదక్ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో హరీశ్‌రావు పార్టీ భవిష్యత్ నాయకత్వంపై, బీజేపీతో పొత్తుపై కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ తర్వాత పార్టీ నాయకత్వం తనకే వస్తుందనే ధోరణిలో మాట్లాడారని, మెదక్‌లో పార్టీ బలపడిన తర్వాత బీజేపీతో ఒప్పందం చేసుకోవాలని సూచించినట్లు ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలకు సంబంధించి స్వతంత్ర ధృవీకరణ తమ వద్ద లేదని, హరీశ్‌రావు స్వయంగా దీనిపై వివరణ ఇవ్వాలని బట్టి అజయ్ డిమాండ్ చేశారు.

### బీజేపీతో రహస్య ఒప్పందాలంటూ ఆరోపణలు

హరీశ్‌రావు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొందరు నేతలతో రహస్యంగా చర్చలు జరుపుతున్నారని బట్టి అజయ్ ఆరోపించారు. ఇందుకు 'రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్' వేదికగా మారిందని ఆయన పేర్కొన్నారు.




అక్కడికి వచ్చే ఓ ఆర్ఎస్ఎస్ నాయకుడిని హరీశ్‌రావు పలుమార్లు కలుస్తున్నారని, ఆయన వచ్చిన సందర్భాల్లో తన కార్యక్రమాలను సైతం రద్దు చేసుకుని సమావేశాలకు వెళ్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా తన రాజకీయ పదవిని అడ్డుపెట్టుకుని అవినీతి, వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రస్తుతం ముఖ్యమంత్రితో కూడా లాలూచీ పడ్డారని బట్టి అజయ్ ఆరోపించారు. ఈ రాజకీయ పరిణామాలను తెలంగాణ ప్రజలు గమనించి వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన మెదక్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కేవల్ నందకిషోర్, కాసాపురం అశోక్, మెదక్ జిల్లా టీఆర్ఎస్ స్టూడెంట్ వింగ్ ఎండీ జునైద్, అబ్బాసు తదితర నాయకులు, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సంతోషిమాత జయంతి వేడుకలు



తూప్రాన్, ఆగస్టు 28 (జనం సాక్షి) : శ్రీ సంతోషి మాత జయంతి ఉత్సవం పట్టణంలోని బాల ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో కొలువైన శ్రీ సంతోషిమాత ఆలయంలో దేవీ ఉపాసకులు సోమయాజుల రవీందర్ శర్మ ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ కోడిపాక అన్నపూర్ణ నారాయణ గుప్తా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి అభిషేకం, చతుష్షష్టి ఉపచార పూజ, రక్షాబంధన కార్యక్రమం ఆలయ వ్యవస్థాపకులు దేవి ఉపాసకులు సోమయాజుల రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు.

## మహిళపై అత్యాచారం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్




మక్తల్, ఆగస్టు 28 (జనంసాక్షి) : మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 53 ఏళ్ల మహిళపై జరిగిన అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మహేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులైన మక్తల్ నివాసితులు బోయ అరవింద్ (19), బోయ విజయ్ (19) లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చట్టపరమైన ప్రక్రియ అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. కేసును వేగంగా ఛేదించిన మక్తల్ సీఐ రామ్‌లాల్, ఎస్సై రాజుతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. జిల్లాలో మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితురాలికి అవసరమైన అన్ని విధాలా పోలీసు సహాయం అందిస్తామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

## ఘనంగా మార్కండేయ స్వామి పల్లకి సేవ



మద్దూరు, ఆగస్టు 28 (జనం సాక్షి) : ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో వచ్చే రాఖీ పౌర్ణమి సందర్భంగా మద్దూరు పట్టణంలోని శ్రీ మార్కండేశ్వర స్వామి ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించడంతో పాటు పద్మశాలీ కులబాంధవులు గాయత్రీ ధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం ఆలయం నుంచి మార్కండేయ స్వామివారి పల్లకి సేవను ఘనంగా ప్రారంభించారు. పల్లకి సేవ మద్దూరు పట్టణంలోని ప్రధాన పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మార్గమధ్యంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, భక్తి గీతాలతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మద్దూరు పద్మశాలీ సంఘం సభ్యులు, పద్మశాలీ కుటుంబాల సభ్యులు, భక్తులు, పురప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డెంగ్యూ, మలేరియా నివారణకు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి




వనపర్తి బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) : డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. దోమల వృద్ధికి అవకాశం లేకుండా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 19, 20, 8వ వార్డుల్లో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్య సిబ్బంది చేపడుతున్న డెంగ్యూ, మలేరియా నివారణ అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సూచనలు, తీసుకుంటున్న నివారణ చర్యలపై ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే ప్రదేశాలను గుర్తించి చేపడుతున్న యాంటీ లార్వా ఆపరేషన్లను కూడా అదనపు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మున్సిపల్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల వృద్ధికి అవకాశం లేకుండా యాంటీ లార్వా చర్యలను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్లలో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఖీమ్యా నాయక్ కోరారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పాటిస్తూ డెంగ్యూ, మలేరియా నివారణలో అధికారులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, మున్సిపల్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలి

- వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపైన వెంటనే స్పందించాలి
- పానగల్ గ్రామ సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశం

వనపర్తి బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) : ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా సమర్పించినా, వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించినా అధికారులు వెంటనే స్పందించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సాంకేతికత అభివృద్ధి చెందిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. శుక్రవారం పానగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన పానగల్ మండల గ్రామ సభలో గత రెండున్నర సంవత్సరాలుగా మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు సమర్పించిన ఫిర్యాదులు, వాటిలో పరిష్కారమైనవి, ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు నిత్య జీవితంలో అనేక పనులతో బిజీగా ఉంటారని, తమ సమస్యల పరిష్కారం కోసం నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. అధికారుల పనితీరులో మార్పు రావాలని, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను రెండు, మూడు రోజుల్లోనే జారీ చేయాలని సూచించారు. ప్రజలు



తమ సమస్యలను రాతపూర్వకంగా నమోదు చేసి, తమ చిరునామా, ఫోన్ నంబర్‌తో సంబంధిత శాఖాధికారులకు వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించవచ్చని మంత్రి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో ఇప్పటివరకు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను మంత్రి సమీక్షించారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.

### భూ సమస్యలపై ప్రత్యేక సమీక్ష

ముందుగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారులు సమర్పించిన భూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి, వాటి పెండింగ్‌కు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

కొల్లాపూర్ నియోజకవర్గంలోని మూడు మండలాలకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరై, ఆర్థిక స్తోమత లేక నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తదుపరి సమీక్షా సమావేశంలో అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు నాలుగో విడత నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు.

విద్యుత్ శాఖతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ప్రజా సమస్యలను కూడా మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా మంత్రికి సమర్పించారు.

### మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు మండల స్థాయిలోనే పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల కోసం ఉన్నతాధికారుల వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా క్షేత్రస్థాయిలోనే అధికారులు స్పందించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డీఆర్ఓ తిరుపతయ్య, తహసీల్దార్ కార్తిక్, ఎంపీడీఓ గోవిందారావు, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, పానగల్ సర్పంచ్ నాగలక్ష్మి, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# నూతన సమీకృత కలెక్టరేట్‌కు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయం తరలింపు

- నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచే శాఖ కార్యకలాపాలు
- గ్రౌండ్ ఫ్లోర్‌లోని జీ-20 గదిలో కార్యాలయం ఏర్పాటు



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 28(జనంసాక్షి) :** పాత కలెక్టరేట్‌లో ఇప్పటివరకు కొనసాగుతున్న జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని నూతనంగా ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి తరలించి నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. రఫీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న జీ-20 గదిని జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి జిల్లా కలెక్టర్ కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇకపై జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయ కార్యకలాపాలు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచే కొనసాగుతాయని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అధికారిక సమాచార వ్యవహారాలు, మీడియా సమన్వయం, ఇతర కార్యాలయ కార్యకలా పాలు ఇకపై నూతన ఐడీఓసీ నుంచే నిర్వహించనున్నట్లు డీపీఆర్ఓ ప్రకటనలో వెల్లడించారు.

# మద్యం మత్తులో కారు బీభత్సం

- ఇంటలిజెన్స్ కానిస్టేబుల్ మృతి
- నిందితుడి అరెస్ట్.. 15 రోజుల రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన మట్టవాడ పోలీసులు





**వరంగల్ బ్యూరో, ఆగస్టు 28 (జనం సాక్షి) :** మద్యం మత్తులో కారు నడుపుతూ బీభత్సం సృష్టించిన ఘటనలో పోలీసు కానిస్టేబుల్ మృతికి కారణమైన నిందితుడిని మట్వాడా పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు కొండపర్తి రాజు(39)ను న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మట్వాడా పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 23న రాత్రి 9.45 గంటల సమయంలో హంటర్‌రోడ్డులోని సంతోషిమాత దేవాలయం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇంటెలిజెన్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాసుల శ్రీనివాస్(45) విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై అక్కడికి వచ్చి ఫలూదా బండి వద్ద ఆగి మాట్లాడుతున్నారు. అదే సమయంలో బృందావన్ కాలనీకి చెందిన స్వర్ణకారుడు కొండపర్తి రాజు మద్యం మత్తులో కియా సెల్టోస్ కారును (టీఎస్ 24 జె 3856) అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ తొలుత ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. అనంతరం శ్రీనివాస్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. పక్కనే ఉన్న ఫలూదా బండితో పాటు మరో బాటసారిని కూడా ఢీకొట్టాడు. ప్రమాదంలో శ్రీనివాస్‌తో పాటు పలువురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతి చెందారు.

**బ్రీత్ ఎనలైజర్‌లో 550 రీడింగ్**

ప్రమాదం అనంతరం పోలీసులు నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో నిందితుడి బీఆర్‌సీ రీడింగ్ 550గా నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం పరారీలో ఉన్న రాజును ఈ నెల 27న రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. కారులో ఉన్న మద్యం సీసాను స్వాధీనం చేసుకుని సీజ్ పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై మట్వాడా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ ఐ ఆర్ నం.455/2026 నమోదు చేశారు. నిందితుడిపై బి ఎన్ ఎస్ సెక్షన్లు 105, 125(ఏ ఫోన్ వస్తాను, 281తో పాటు మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 185 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మట్వాడా ఇన్‌స్పెక్టర్ ఎన్.కరుణాకర్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది.

**మద్యం సేవించి వాహనం నడపొద్దు**

మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని మట్వాడా పోలీసులు హెచ్చరించారు. మద్యం సేవించిన వారు స్వయంగా వాహనం నడపకుండా క్యాబ్, ఆటో లేదా మద్యం సేవించని డ్రైవర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో నిర్ణీత వేగ పరిమితిని పాటించాలని, రద్దీ ప్రాంతాలు, జంక్షన్లు, యూ-టర్న్‌ల వద్ద వేగాన్ని తగ్గించాలని కోరారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. రోడ్డు పక్కన, నో-పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలపవద్దని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే సీసీటీవీ, ఈ-చలాన్ ద్వారా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# సౌర విద్యుత్ సర్వే పనులను వేగవంతం చేయాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**మావల, ఆగస్ట్29 (జనంసాక్షి) :** సౌర విద్యుత్ సర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో పీఎం జన్మన్ పథకం కింద ఆవాసాల్లో చేపట్టిన సౌర విద్యుత్ సర్వే, ఆఫ్‌గ్రిడ్ సౌర విద్యుత్ వివరాలు, అలాగే ఎస్సీ కార్పొరేషన్ పనులపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 7 ఆవాసాల్లోని 55 గృహాల్లో 300 ఔజూ సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయగా, అందులో 39 సక్రమంగా పనిచేస్తుండగా 16 వ్యవస్థలు పనిచేయని ఉండగా త్వరలోనే వాటిని పునరుద్ధరించాలని ఆదేశించారు. కొత్తగా 12 ఆవాసాలకు సంబంధించిన ఆఫ్‌గ్రిడ్ సోలార్ సర్వే వివరాలను వారం రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఎక్స్‌టెన్షన్ విద్యుత్ పోల్స్, మీటర్ల ఏర్పాటుకు సంబంధించి లబ్ధిదారులు ముందుకు రావాల్సి ఉంటుందని, సర్పంచ్‌లతో మాట్లాడి ఆ పనులను త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. ధర్మాయిపేట, పోతుగూడ, లక్కారం, నర్సాపూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లు, పూర్తి కావాల్సిన ఇళ్లు, ఆర్సీ వివరాలపై సమీక్షించి, పెండింగ్ పనులను వేగవంతం చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి లబ్ది చేకూరేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సుభాష్, రెడ్కో డిఎం శ్రీనివాస్, డిఈ లు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పలిమెల ప్రజాపాలన కాగితాలకే పరిమితమా?

- దశాబ్ద కాలంగా ప్రజలకు ఎందుకీ నరకయాతన?
- 30 కిలోమీటర్ల దూరంలో ఆఫీసులు.. నిరుపేదల రక్తాన్ని పిండుకుంటున్న పాలకులు!
- అధికారులు అందుబాటులో ఉండరా? ప్రజాప్రతినిధులు పట్టించుకోరా?



**పలిమెల ఆగస్టు 28 (జనంసాక్షి) :** ఒక వైపు అధ్వానంగా మారిన భవనాలు, మరోవైపు కనిపించని అధికారులు.. ఇదీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా, పలిమెల మండల ప్రజల ప్రస్తుత దుస్థితి! కొత్త మండలం ఏర్పడి పదేళ్లు దాటుతున్నా, పాలనా యంత్రాంగం మాత్రం ఇంకా 'మహాదేవపూర్' దాటి రాకపోవడం వెనుక ఉన్న అసలు మర్మమేంటని నిరుపేద ప్రజలు నిలదీస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పలిమెల నిరుపేద రైతులు, కూలీలు తమ ప్రాథమిక పనుల కోసం మహాదేవపూర్ వెళ్లాలంటే భయపడిపోతున్నారు. సరైన రవాణా సౌకర్యం లేక, టైమ్‌కు బస్సులు రాక, అప్పులు చేసి మరీ ప్రైవేట్ వాహనాలకు వందలాది రూపాయలు తగలేస్తున్నారు. తీరా ఆ పూట కూలి పని వదులుకొని 30 కిలోమీటర్లు ప్రయాణించి మహాదేవపూర్ ఆఫీసులకు వెళ్తే.. అక్కడ కుర్చీల్లో అధికారులు దర్శనమివ్వరు! రోజంతా నిరీక్షించి, పని కాక, జేబులు ఖాళీ చేసుకుని తీవ్ర నిరాశతో వెనుదిరగడమే వారి వంతవుతోంది.

పేరుకే పలిమెల మండల కార్యాలయాలంటూ బోర్డులు తగిలించినా, ఆ స్థితి అత్యంత శోచనీయంగా మారింది. కనీసం ఫ్లోరింగ్ నాణ్యత కూడా లేక టైల్స్ పగిలిపోయి, ఊడిపోయి దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి ఈ భవన దృశ్యాలే నిలువెత్తు సాక్ష్యం. మహాదేవపూర్‌లోని పలిమెల ఎంపీడీవో ఆఫీస్ మహాదేవపూర్‌లో ఉన్న మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవనం గోడలకు నాచు పట్టి, పిచ్చిమొక్కలు మొలిచి తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. లిపదేళ్ల కాలం చాలదా? పలిమెల మండల కేంద్రంలోనే పూర్తిస్థాయి భవనాలు నిర్మించి, అధికారులను అక్కడ కూర్చోబెట్టడానికి ఇంకెన్ని సంవత్సరాలు పడుతుంది? ఆర్టీసీ బస్సులు సరిగా నడపక, నిరుపేదల నుండి ప్రైవేట్ వాహనదారులు వందలాది రూపాయలు పిండుకుంటున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు? 30 కిలోమీటర్ల దూరం నుండి వచ్చిన ప్రజలకు అందుబాటులో లేని అధికారులపై జిల్లా కలెక్టర్ ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదు? ఆఫీసులన్నీ వేరే మండలంలో ఉంచుకుని, పలిమెలను కేవలం పేరుకే మండలంగా మిగిల్చడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే కాదా? ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రమత్తు వదిలి తక్షణమే పలిమెల మండలంలో శాశ్వత భవనాల నిర్మాణాలు పూర్తి చేసి, అధికారులందరూ మండల కేంద్రంలోనే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోకపోతే ప్రజా ఆగ్రహం తప్పదని స్పష్టమవుతోంది.



# ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళా సోదరీమణులు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా భూపాలపల్లి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు మహిళా సోదరీమణులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ, జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. భూపాలపల్లి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని పలువురు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యేకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి పట్టణ అధ్యక్షురాలు కదారి మాలతి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యురాలు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పింగళి జ్యోతి, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు, మహిళా సోదరీమణులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన ఆత్రం సుగుణక్క



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28(జనంసాక్షి):** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోదరులకు రాఖీ కట్టడం మన సంప్రదాయమని, సొంత అన్న కాకపోయినా సోదరుడిగా భావించే వారికి రక్షాబంధన్ కట్టడం ఆనవాయితీగా వస్తోందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన ఆత్రం సుగుణక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకను జరుపుకున్నారు. అనంతరం రాష్ట్ర మంత్రి సీతక్క నివాసానికి వెళ్లిన సుగుణక్క మంత్రి సీతక్కతో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క, సుగుణక్క ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఆత్మీయంగా రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సీఎం సలహాదరు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డితోపాటు మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ కు సుగుణక్క రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# బాలికల విద్యే దేశ సాధికారతకు పునాది

- బాలికను చదివిద్దాం-దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం" సందేశంతో రాఖీలు కట్టిన బాలసదనం బాలికలు
- బాలికలను ఆశీర్వదించి మిఠాయిలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, ఆగస్టు 28(జనంసాక్షి) :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనం బాలికలు శుక్రవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును కలిసి రాఖీలు కట్టారు. 'బాలికను చదివిద్దాం-దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం" అనే సందేశంతో ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను కలెక్టర్‌కు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించడంతోపాటు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికలతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, భద్రత, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బాలికల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందిస్తుందని భరోసా కల్పించారు. జిల్లా సంక్షేమ అధికారి ఈపి ప్రేమలత మాట్లాడుతూ రక్షాబంధన్ ప్రేమానుబంధంతోపాటు పరస్పర బాధ్యత, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఒక బాలికను చదివించడం ద్వారా ఆమె భవిష్యత్తుతోపాటు కుటుంబం, సమాజం, దేశ పురోగతికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సహాయవాణి జిల్లా సమన్వయకర్త నరేష్, బాలసదనం సిబ్బంది అరుణ, రాణి, సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూసమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 28 (జనంసాక్షి) :** పెండింగ్‌లో ఉన్న భూసమస్యల దరఖాస్తులను ప్రాధాన్యత ప్రాతిపదికన వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి తహసీల్దార్లతో పెండింగ్ భూసమస్యల దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను సమీక్షించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి విచారణను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారుల వినతులను నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. తగిన ఆధారాలు లేని దరఖాస్తులను తిరస్కరించే సమయంలో అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. రెవెన్యూ, సర్వే బృందాలు సమన్వయంతో పనిచేసి భూవివాదాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో క్రీడా సందడి



**భైంసా, ఆగస్టు 28 (జనంసాక్షి) :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో భైంసాలోని ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో క్రీడాకారులకు వివిధ వినోదాత్మక క్రీడా పోటీలు నిర్వహించారు. శిక్షణ కేంద్రం కోచ్ సాయికృష్ణ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ రజిత పతకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చడం, క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందించడమే జాతీయ క్రీడా దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యువత ప్రతిరోజూ క్రీడలు, వ్యాయామం, యోగా వంటి శారీరక కార్యకలాపాలకు సమయం కేటాయించాలని సూచించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం - క్రీడలే ఆరోగ్యానికి పునాది" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ముగ్ధం విక్రమ్, ప్రకాష్ పాటిల్, ఉప్పు రవీందర్, శ్రీ సాయినాథ్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రం క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, క్రీడా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ వాహనం హల్‌చల్..



**డోర్నకల్ ఆగస్టు 27 (జనం సాక్షి ) :** పట్టణ ప్రధాన రోడ్డులో పోలీస్ వాహనం సృష్టించిన హల్‌చల్ స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు తమ ద్విచక్ర వాహనాలపై ప్రధాన వీధికి వచ్చి రాఖీలు కొనుగోలు చేస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా పోలీస్ వాహనం సైరన్ మోగిస్తూ వేగంగా దూసుకురావడంతో ప్రయాణికులు, వ్యాపారులు కంగారుపడ్డారు. అత్యవసర పరిస్థితి ఏమోనని భావించి వాహనదారులు అటు ఇటు పరుగులు తీశారు. సదరు వాహనాన్ని నడుపుతున్న ఓ ప్రైవేట్ డ్రైవర్ ఒకచేత్తో స్టీరింగ్ పట్టుకుని మరోచేత్తో తన సెల్ ఫోన్‌లో సైరన్ మోగిస్తూ వీడియోలు, ఫోటోలు తీయడం గమనార్హం. ఈ విషయమై సీఐ చంద్రమౌళి వద్ద ప్రస్తావించగా.. రక్షాబంధన్ సందర్భంగా రైల్వే స్టేషన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అవుతున్నట్లు సమాచారం మేరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి పోలీస్ వాహనాన్ని పంపించినట్లు ఆయన స్పష్టం చేశారు. పండుగ పూట బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన సదరు ప్రైవేట్ డ్రైవర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# దేశీదారు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**గుడిహత్నూర్, ఆగస్టు 28( జనం సాక్షి):** ఆదిలాబాద్ పట్టణంలో అక్రమంగా దేశీదారు విక్రయిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర బస్తీ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. అధికారుల తనిఖీల్లో సంపంగి వెంకట రమణ వద్ద నుంచి సుమారు రూ.9,920 విలువైన 90 లీటర్ల దేశీదారు, అలాగే 248 దేశీదారు మద్య పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ.. అక్రమంగా దేశీదారు, మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలపై ప్రజలు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడిలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రెండ్ల విజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

# టింబర్ డిపోల ముసుగులో అక్రమ కర్ర దందా?

- అధికారుల తోడుతో అటవీ సంపదకు భారీ గండి..
- సామిల్ డిపోను సీజ్ చేయకుండా తూతూ మంత్రంగా కేసులు నమోదు



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 28 (జనం సాక్షి) :** అటవీ సంపదను కాపాడాల్సిన వ్యవస్థలోని కొన్ని లోపాలను ఆసరాగా చేసుకుని టింబర్ డిపోల చుట్టూ అక్రమ కర్ర దందా సాగుతోందన్న పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో పరకాల కేంద్రంలో ఓ టింబర్ డిపోలో ఒక నెలలోనే రెండుసార్లు ట్రాక్టర్ తో సహా పెద్ద ఎత్తున అక్రమ కర్ర అధికారుల చేతికి చిక్కినట్లు దానిని గుట్టు చప్పుడు కాకుండా నామాత్రపు కేసులు పెట్టి చేతులు దులుపుకున్నట్లు పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. చెట్ల నరికివేత నుంచి కలప రవాణా, టింబర్ డిపోల్లో నిల్వ, విక్రయాల వరకు ప్రతి దశలోనూ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో కలప రాకకు సంబంధించిన రవాణా పర్మిట్లు, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలువిక్రయ వివరాలు సక్రమంగా ఉన్నాయా పరిశీలించే అధికారులు కరువయ్యారు

**రాత్రివేళ రవాణాపై నిఘా ఏది.?**

అక్రమ కలప రవాణా సాధారణంగా రాత్రి వేళల్లో జరుగుతుందనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. వాహనాల తనిఖీలు, కలప రవాణా పత్రాల పరిశీలన, అనుమానాస్పద లోడ్లపై నిఘా మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అటవీ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లోని టింబర్ డిపోల వరకు కలప చేరే మార్గాలపై ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**అక్రమ కర్ర దందాతో పర్యావరణానికి తీరని నష్టం..**

అక్రమంగా చెట్లను నరికివేసి కలపను తరలించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. అడవుల విస్తీర్ణం తగ్గడం, జీవవైవిధ్యానికి ముప్పు, నేల కోత, వర్షపాతం ప్రభావితం కావడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అక్రమ కర్ర దందాపై సమగ్ర విచారణ జరిపి, టింబర్ డిపోల స్టాక్‌ను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, అక్రమాలు బయటపడితే కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఫారెస్ట్ అధికారులను వివరణ కోరగా పరకాల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కర్ర దందా చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నామని ఇటీవల నెల క్రితం పరకాలలో ఒక టింబర్ డిపోలో లక్ష 25 వేల విలువచేసే కర్ర సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని అట్టి కేసుపై టింబర్ డిపో సీజ్ చేయడం పై ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేయడం జరిగిందని తదుపరి చర్య ఉన్నతాధికారులు తీసుకుంటారని తెలియజేశారు. గత మూడు రోజుల క్రితం మాత్రం పరకాలలో ఎలాంటి అక్రమ కర్ర దొరకలేదని స్కార్డు మరియు విజిలెన్స్ వారికి ఎవరికీ దొరికిన మాకు సమాచారం మాకు తెలిపేవారని మాకు ఎవరు ఎలాంటి సమాచారం తెలుపలేదు కావున అది ఎవరో తప్పుడు సమాచారం తెలపడం జరిగిందని తెలియజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- సిబ్బందికి అనుగుణంగా ఓపిల సంఖ్య పెరగాలి
- పలువురు ఉద్యోగులు ఎక్కువగా సెలవులు పెట్టడంపై కలెక్టర్ ఆగ్రహం



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 28 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు డాక్టర్లు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శుక్రవారం ఆలంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పని చేస్తున్నప్పటికీ అనుకున్న స్థాయిలో రోగులు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడ సరైన వైద్య సేవలు అందించకుండా కర్నూల్ కు, ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులను హెచ్చరించారు. ఆసుపత్రిలోని పలువురు రోగులను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వారికి అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇన్ పేషెంట్లను ప్రతి రోజు వారి ఆరోగ్య పరిస్థితిని అనుసరించి తరచూ పరీక్షిస్తూ ఉండాలని, ఆహారాన్ని మెనూ ప్రకారం అందజేయాలన్నారు. ల్యాబ్ ను తనిఖీ చేసి ప్రతిరోజు వివిధ రకాల పరీక్షలను పక్కాగా చేస్తూ రోగులకు రిపోర్టును సకాలంలో అందజేయాలని ఆదేశించారు. గైనిక్, యూఎస్ జీ, ఫార్మసీ, ఈసీజీ, తదితర విభాగాలను సందర్శించి అక్కడి సిబ్బంది పనితీరును గమనించారు. హాజరు రిజిస్టర్ తో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. కొంతమంది సిబ్బంది ఎక్కువగా సెలవులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సరైన పనితీరు కనబరచకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్ద ఎత్తున పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తున్నందున ఆసుపత్రినీ శుభ్రంగా ఉంచాలని, పరిసరాల్లోని పొదలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. బయో మెడికల్ వేస్టేజీ నిర్వహణకు ఏజెన్సీని నియమించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రహరీ కొంత భాగం కూలిపోవడాన్ని గమనించిన కలెక్టర్ మరమ్మత్తులు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆసుపత్రి పర్యవేక్షకులు సయ్యద్ పాషా, ఉండవెల్లి మండల తహసిల్దారు ధరణి షా, తదితరులున్నారు.

# పండుగ పూట పండంటి బాబు మృతి

- నల్లగొండ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విషాదం
- సమగ్ర విచారణకు డిమాండ్

**నల్లగొండ, ఆగస్టు 28 (జనం సాక్షి) :** పండుగ పూట పండంటి బిడ్డను ఇంటికి తీసుకెళ్లాలన్న ఆ కుటుంబం ఆశలు ఆవిరయ్యాయి. ప్రసవం కోసం నల్లగొండ ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చిన ఓ గర్భిణికి ఆపరేషన్ అనంతరం మగ శిశువు మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. నల్లగొండ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ 11వ డివిజన్‌కు చెందిన కంభంపాటి కవిత (25) ప్రసవం కోసం గురువారం ఉదయం ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రిలో చేరిన సమయంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉందని, బేబీ ఆరోగ్యంగా ఉందని చెప్పినట్లు వారు పేర్కొన్నారు. దీంతో వైద్యుల సూచన మేరకు కవితను ఆసుపత్రిలోనే ఉంచారు. అయితే శుక్రవారం ఉదయం పరిస్థితి ఒక్కసారిగా మారిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బేబీ హార్ట్‌బీట్ సక్రమంగా లేదని, అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు వారు పేర్కొన్నారు. దీంతో కవితకు సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్ పూర్తయిన కొద్దిసేపటికే మగ శిశువు మృతి చెందినట్లు వైద్యులు తమకు సమాచారం ఇచ్చారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు బిడ్డ ఆరోగ్యం బాగుందని చెప్పిన వైద్యులు.. మరుసటి రోజు హార్ట్‌బీట్ సక్రమంగా లేదని చెప్పడం, ఆపరేషన్ అనంతరం బిడ్డ మృతి చెందడంపై కుటుంబ సభ్యులు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు.



### మా బిడ్డ మృతికి కారణమేంటి..?

బిడ్డ మృతితో తీవ్ర ఆవేదనకు గురైన కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. తమ బిడ్డ మృతికి గల కారణాలను స్పష్టంగా వెల్లడించాలని, వైద్యపరంగా ఏం జరిగిందో తమకు వివరించాలని డిమాండ్ చేశారు.

నిన్నటి వరకు బేబీ ఆరోగ్యంగా ఉందని చెప్పారు. ఒక్కసారిగా హార్ట్‌బీట్ లేదంటూ ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ తర్వాత బిడ్డ చనిపోయిందని చెప్పారు. అసలు ఏం జరిగింది?' అంటూ బాధిత కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.

### వైద్యులు, అధికారులపై కుటుంబ సభ్యుల ఆగ్రహం

బాధిత కుటుంబం ఆందోళనకు దిగిన సమయంలో సర్జరీ చేసిన వైద్యుడు, ఆసుపత్రి సూపరింటెండెంట్ అందుబాటులో లేకపోవడంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు. తమ బిడ్డ మృతికి సంబంధించి సమాధానం చెప్పాల్సిన అధికారులు, వైద్యులు బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన నేపథ్యంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### సమగ్ర విచారణకు డిమాండ్

శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నప్పటికీ.. అసలు మృతికి వైద్యపరమైన కారణం ఏమిటనేది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది. బిడ్డ హార్ట్‌బీట్ ఎప్పుడు తగ్గింది? అత్యవసర ఆపరేషన్ ఎందుకు అవసరమైంది? ఆపరేషన్‌కు ముందు, తర్వాత శిశువు పరిస్థితి ఎలా ఉంది? వైద్యపరంగా తీసుకున్న చర్యలు ఏమిటి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే పేదలకు నాణ్యమైన వైద్యం, సకాలంలో అత్యవసర వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలపై పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. బాధిత కుటుంబం చేసిన ఆరోపణల్లో వాస్తవమెంత? శిశువు మృతికి అసలు కారణమేంటి? వైద్యపరమైన లోపం జరిగిందా? అనే విషయాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు వెంటనే స్పందించాలని బాధితులు, స్థానికులు కోరుతున్నారు.

## ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**సూర్యాపేట, ఆగస్టు 28 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీ మార్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రం ప్రజలకు మరింత సౌకర్యవంతంగా, నాణ్యమైన సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీ మార్ట్ ఎదురుగా 60 ఫీట్ రోడ్డు ఆక్స్ ఫర్డ్ స్కూల్ పక్కన ఏర్పాటు చేసిన నూతన ఆధార్ సేవా కేంద్రం ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఆధార్ వివరాలను క్రమం తప్పకుండా నవీకరించుకోవాలని సూచించారు. కొత్త ఆధార్ నమోదు పూర్తిగా ఉచితమని తెలిపారు. 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల వారికి తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ ఉచితంగా అందించబడుతుందన్నారు. 7 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల వారికి తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ 30 సెప్టెంబర్ 2026 వరకు ఉచితంగా అందించబడుతుందని పేర్కొన్నారు. ఇతర ఆధార్ సేవల కోసం, యుఐడిఏఐ నిర్ధారించిన రుసుము మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రజలకు మరింత సౌకర్యం కల్పించేందుకు ఈ కేంద్రంలో ఆదివారాల్లో కూడా ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. దీని వల్ల ఉద్యోగులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ఇతర ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో ఆధార్ సేవలను పొందవచ్చని అన్నారు. ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ సౌకర్యం అందుబాటులో ఉందని, ప్రజలు తమకు అనుకూలమైన తేదీ,సమయాన్ని ముందుగానే బుక్ చేసుకొని, నియమిత సమయంలో కేంద్రానికి వచ్చి ఆధార్ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ కొత్తగా స్థాపించబడిన కేంద్రం, సూర్యాపేట పట్టణ,పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధార్ సంబంధిత నివాసితుల సమస్యలను పరిష్కరించడంలో, ఆధార్ నమోదు, నవీకరణ సేవలను మరింత సులభంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యుఐడిఏఐ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ నాయిని రంగనాథ్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ పి.రత్నాకర్, బిఎల్ఎస్ ఆధార్ సేవా కేంద్రం రీజనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ కుమార్, ఆపరేషన్స్ మేనేజర్ లాలు, ఈ జిల్లా మేనేజర్ జి.గఫార్ అహ్మద్, ఆధార్ సెంటర్ టెక్నికల్ టీమ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కథనాలు రాసినా మారని తీరు

- మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం
- ఊళ్లలో రాని నీళ్లు పొలాల్లో మురుగు పారుదల
- పత్రికల్లో వార్తలొచ్చినా బేఖాతరు



**మాడుగులపల్లి, ఆగస్టు 28 (జనం సాక్షి) :** మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు రెవెన్యూ పరిధిలో మిషన్ భగీరథ తాగునీరు దుర్వినియోగం అవుతోందని పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు వార్తలు వచ్చిన తర్వాత నీటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాల్సింది పోయి, సమస్య తీవ్రత మరింత ఎక్కువవ్వడంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఒకవైపు గ్రామాల్లోని ప్రజలకు తాగడానికి బొట్టు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు కుళ్లలోకి (పొలాల కాలువల్లోకి) మాత్రం భగీరథ నీరు విచ్చలవిడిగా పారుతోంది పత్రికల్లో వార్తలు చూసైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైంది వార్తలు వచ్చిన తర్వాతే మరింత ఎక్కువగా నీటిని పొలాలకు మళ్లిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు ప్రజాధనంతో చేపట్టిన మిషన్ భగీరథ తాగునీటి ప్రాజెక్టు ఇలా అధికారుల నిర్లక్ష్యం వల్ల దుర్వినియోగం కావడంపై మండల ప్రజలు మండిపడుతున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, తాగునీటిని వ్యవసాయానికి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## రీ-సర్వే డేటా ఎంట్రీపై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 28 (జనం సాక్షి) :** కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం భగత్‌వీడు గ్రామ రీ-సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ విధానంపై సర్వేయర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, గ్రామపంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, సంబంధిత సిబ్బందికి జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఫీల్డ్ స్థాయిలో సేకరించిన సమాచారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. భగత్‌వీడు గ్రామంలోని మొత్తం భూమికి సంబంధించిన వివరాలను టీమ్‌ల వారీగా క్రమబద్ధంగా నమోదు చేయాలని తెలిపారు. ముందుగా ప్రీ-రీ-సర్వే డేటాను నమోదు చేసి, అనంతరం రీ-సర్వే డేటాను ఎంటర్ చేయాలని కలెక్టర్ సూచించారు. రెండు దశల డేటాను క్షుణ్ణంగా క్రాస్‌చెక్ చేసిన అనంతరం మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. డేటా ఎంట్రీ లాగిన్‌ను కేవలం డేటా నమోదు కోసం మాత్రమే వినియోగించాలని, ఫ్రీజింగ్, కన్ఫర్మేషన్ ఆప్షన్లు తహసీల్దార్ లాగిన్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. రీ-సర్వేకు ముందుగానే గ్రామ సరిహద్దులు, గ్రామ విస్తీర్ణం, శాఖల వారీగా ప్రభుత్వ భూముల వివరాలను పక్కాగా నిర్ధారించు కోవాలని కలెక్టర్ తెలిపారు. ఆర్ అండ్ బీ రోడ్లు, పీఆర్ రోడ్లు, అటవీ భూములు, వక్ఫ్, ఎండోమెంట్ భూములు, కోర్టు కేసులకు సంబంధించిన భూముల వివరాలను ముందుగానే నమోదుచేయాలని సూచించారు. ఈ వివరాలన్నీ రీ-సర్వే డేటా ఎంట్రీకి ముందే పక్కాగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రీ-సర్వే అనంతరం లభించిన వివరాలను కూడా జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పట్టాదారు పాస్‌బుక్ ఉన్న ఆక్యుపెన్సీ, లేని ఆక్యుపెన్సీ వివరాలను విడివిడిగా నమోదు చేయాలని తెలిపారు. రీ-సర్వే అనంతరం ఏదైనా ప్రభుత్వ భూమి విస్తీర్ణంలో మార్పు గుర్తించినట్లయితే, నిబంధనల ప్రకారం అవసరమైన సవరణలు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. డేటా ఎంట్రీలో అప్రమత్తంగా ఉండాలని, ఒక్క తప్పు నమోదైనా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి వివరాన్ని కనీసం పలుమార్లు క్రాస్‌చెక్ చేసిన తర్వాతే కన్ఫర్మ్ చేయాలని సూచించారు. ఎకరాలు, గుంటల వివరాలను నమోదు చేసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, గుంటల కొలత 40 కు మించకుండా చూసుకోవాలని తెలిపారు. 40 గుంటలకు మించిన కొలతను తదుపరి ఎకరాగా పరిగణించే విధంగా వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తికావడానికి డేటా ఎంట్రీ అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. చిన్నపాటి పొరపాటు లేదా నిర్లక్ష్యం కూడా భవిష్యత్తు లో తీవ్ర సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉన్నందున ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నమోదు చేయాలని సూచించారు. ఫీల్డ్‌లో గుర్తించిన సమస్యలు, వ్యత్యాసాలు, సందేహాలను తప్పనిసరిగా రికార్డు చేయాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించిన అనంతరం మాత్రమే డేటాను నిర్ధారించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దారు సైదులు, డిప్యూటీ తహసీల్దారు ఖాజా మొహిద్దీన్, ప్రధాన సర్వేయర్ మురళి, మండల సర్వేయర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, గ్రామపంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రక్షాబంధన్ వేడుకల్లో చిల్డ్రన్ హోమ్ విద్యార్థులతో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్



**సూర్యాపేట, ఆగస్టు 28 (జనంసాక్షి) :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు సూర్యాపేట జిల్లాలోని చిల్డ్రన్ హోమ్ విద్యార్థులు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ విద్యార్థినులు జిల్లా కలెక్టర్ కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం,రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. చిల్డ్రన్ హోమ్‌లోని పిల్లలు బాగా చదువుకొని, క్రమశిక్షణతో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు జిల్లా కలెక్టర్ స్వీట్స్ అందించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలతో కలిసి వేడుకల్లో పాల్గొని వారిలో ఆనందాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు , జి.హుస్సేన్,జిల్లా బాలల రక్షణ అధికారి బి.రవికుమార్, మహిళా సాధికారిత కోఆర్డినేటర్ ఎం.చైతన్య,చిల్డ్రన్ హోమ్ సిబ్బంది,మహిళ సాధికారిత సిబ్బంది, జిల్లా బాలల రక్షణ యూనిట్ సిబ్బంది,అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**చేవెళ్ల, ఆగస్టు 28 (జనంసాక్షి) :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రాహీంపల్లి వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులు బి. సత్యం, ఎర్రవల్లి రాములు నిర్మించుకున్న నూతన గృహాలను ఎమ్మెల్యే ప్రారంభించి, లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. నూతన గృహాల్లో లబ్ధిదారులు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజా ఆగిరెడ్డి, దావల్గారి గోపాల్‌రెడ్డి, కళ్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్, గుప్తా, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, జగన్‌గౌడ్, మహమూద్, ఖలీం, శివకుమార్, క్రిష్ణ, ఖదీర్ తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నల్లగొండలో గంజాయి గ్యాంగ్ గుట్టురట్టు

- 5 మంది అరెస్ట్.. ఒకరు పరారీ
- డిఎస్పీ శివరాం రెడ్డి

**నల్లగొండ, ఆగస్టు 28 (జనం సాక్షి) :** నల్లగొండ పట్టణంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముఠాపై నల్లగొండ టూ టౌన్ పోలీసులు కొరడా ఝుళిపించారు. గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి భారీగా గంజాయితో పాటు నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. డిఎస్పీ శివరాం రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణంలో కొంతకాలంగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో నల్లగొండ టూ టౌన్ పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి గంజాయి దందాకు పాల్పడుతున్న వ్యక్తుల కదలికలను గుర్తించారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో నిర్వహించిన తనిఖీలు, దాడుల్లో ఏ-1 నుంచి ఏ-5 వరకు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

రూ.25 వేల నగదు.. 2.5 కిలోల గంజాయి స్వాధీనం

అరెస్ట్ చేసిన నిందితుల నుంచి సుమారు 2.5 కిలోల గంజాయి, రూ.25,000 నగదు, ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరికి విక్రయిస్తున్నారు? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో వ్యక్తి పరారీ,ఈ గంజాయి వ్యవహారంలో ఏ-6గా ఉన్న మరో వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పరారీలో ఉన్న వ్యక్తి పట్టుబడితే గంజాయి సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

### యువతను టార్గెట్ చేసుకుని గంజాయి దందా

పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో నిందితులు నల్లగొండ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగుతున్నాయా అనే అంశంపైనా పోలీసులు దృష్టి సారించారు. నిందితుల మొబైల్ ఫోన్లను పరిశీలించడం ద్వారా వారి పరిచయాలు, గంజాయి కొనుగోలు--విక్రయాలకు సంబంధించిన లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. చీణూలా చట్టం కింద కేసు నమోదు

### డిఎస్పీ పర్యవేక్షణలో పోలీసుల ఆపరేషన్

నల్లగొండ 2 టౌన్ డీఎస్పీ కే. శివరాం రెడ్డి పర్యవేక్షణలో, నల్లగొండ 2 టౌన్ సీఐ కే. ఆదిరెడ్డి,ఎస్ ఐ సైదా బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది కలిసి నిందితులను పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నల్లగొండ పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. మొత్తంగా నల్లగొండలో గంజాయి దందాపై పోలీసులు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఐదుగురు అరెస్ట్ కావడం, మరో వ్యక్తి పరారీలో ఉండటం, 2.5 కిలోల గంజాయి స్వాధీనం కావడం కలకలం రేపుతోంది.






# రెండ్రోజుల నష్టాలకు బ్రేక్..

## లాభాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఐటీ, ఫార్మా, మెటల్ స్టాక్స్ రాణించాయి. దీంతో సూచీల రెండ్రోజుల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 24,150 ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 77,128.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,933.59) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,357.97 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 330.92 పాయింట్ల లాభంతో 77,264.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 84.80 పాయింట్ల లాభంతో 24,175.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.39గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 88.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4603 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఓలా నుంచి కొత్త స్కూటర్..

### సింగిల్ ఛార్జ్‌తో 301కి.మీ

**దిల్లీ:** ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ దేశీయ విపణిలోకి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1జడ్ మోడల్‌ను లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన భారత్ సెల్ ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని ఇందులో వినియోగించారు. దీన్ని ఓలా తన గిగా ఫ్యాక్టరీలో తయారు చేసింది. తక్కువ ధరలో, అధిక రేంజ్ స్కూటర్‌ను అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ స్కూటర్ రెండు వేరియంట్లలో లభ్యమవుతుంది. బ్యాటరీ ప్యాక్‌లతో లభిస్తుంది. చిన్న బ్యాటరీ వేరియంట్ ధర రూ.79,999 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. ఇది సింగిల్ ఛార్జ్‌తో 179 కిలోమీటర్ల ఐడీసీ రేంజ్ ఇస్తుందని కంపెనీ పేర్కొంది. ఇక 5.1ఎచ్‌డబ్ల్యూ బ్యాటరీ వేరియంట్ రూ.99,999కి లభ్యమవుతుంది. ఇది ఒకసారి ఛార్జ్ చేస్తే 301 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ పేర్కొంది. మొత్తం నాలుగు రంగుల్లో లభిస్తుంది. భారత్ సెల్ ఎల్ఎఫ్‌పీ టెక్నాలజీని ఇన్‌హౌస్‌లో అభివృద్ధి చేయడం ద్వారా బ్యాటరీ ఖర్చును గణనీయంగా తగ్గించగలిగామని ఓలా పేర్కొంది. అలాగని, ఇతర అంశాల్లో రాజీ పడకుండా తక్కువ ధరలో ఎస్1జడ్‌ను తీసుకొచ్చినట్లు తెలిపింది. 3.1ఎచ్‌డబ్ల్యూ బ్యాటరీ వేరియంట్ కలిగిన స్కూటర్లను ఈ ఏడాది డిసెంబర్ నుంచి, పెద్ద బ్యాటరీ కలిగిన స్కూటర్లను వచ్చే ఏడాది మార్చి నుంచి డెలివరీ చేస్తామని తెలిపింది. మూవ్ ఓఎస్ 5తో ఈ స్కూటర్ పనిచేస్తుంది. క్రూయిజ్ కంట్రోల్, రివర్స్ మోడ్, జీపీఎస్, ఓటీఏ ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, జియో, టైమ్, మోడ్ ఫెన్సింగ్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నట్లు ఓలా పేర్కొంది.



## త్వరలో జియో ఐపీఓ..

### సెబీ నుంచి గ్రీన్ సిగ్నల్


దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సేవల విభాగం జియోప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఐపీఓకు సంబంధించి మరో కీలక ముందుడుగు పడింది. ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి కంపెనీ అనుమతి పొందింది. సుమారు 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.37,700 కోట్లు) సమీకరించే అవకాశం ఉంది. దీంతో దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా జియో రికార్డు సృష్టించనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ జూన్‌లోనే ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ కోసం మార్కెట్ నియంత్రణ సంస్థకు ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఆగస్టు 28న సెబీ తుది పరిశీలన పొందింది. పబ్లిక్ ఇష్యూకు సెబీ పచ్చజెండా ఊపిన నేపథ్యంలో నియంత్రణ సంస్థల నిబంధనలకు లోబడి నిధులు సమీకరణకు సన్నాహాలు ప్రారంభించొచ్చు. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ప్రకారం.. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 27 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. మొత్తం ఈక్విటీలో 2.9 శాతం మేర వాటాను తగ్గించుకోనుంది. కొన్నేళ్లుగా జియో ఐపీఓ కోసం మదుపర్లు, మార్కెట్ విశ్లేషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ బంపర్ లిస్టింగ్..

### ఇన్వెస్టర్ల సొమ్ము డబుల్

టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ.. స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌లో అదరగొట్టింది. శుక్రవారం ఈ కంపెనీ షేర్లు ఏకంగా 111 శాతం ప్రీమియంతో లిస్టయ్యాయి. అంటే ఐపీఓలో మదుపర్లు పెట్టిన సొమ్ముకు రెట్టింపు కంటే ఎక్కువ ప్రతిఫలం అందించింది. ఐపీఓ ఇష్యూ ధర రూ.300 కాగా.. ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు రూ.634 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఆపై రూ.634.85 వద్ద గరిష్ఠాన్ని తాకిన షేరు విలువ.. తర్వాత 8 శాతం మేర పతనమై రూ.582 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మొత్తం రూ.650 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఈ నెల 20న ప్రారంభమైన ఈ పబ్లిక్ ఇష్యూ 24న ముగిసింది. ఐపీఓలో ధరల శ్రేణిని రూ.285-300గా నిర్ణయించింది. పబ్లిక్ ఇష్యూలో రూ.555 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా, రూ.95 కోట్లు ఫ్రెష్ ఇష్యూ ద్వారా షేర్లను జారీ చేశారు. మొత్తం 184 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం నుంచి గ్రే మార్కెట్ ప్రీమియంలో మంచి ధర పలుకుతూ వచ్చింది. ఒక్కో షేరుకు రూ.300 లాభాన్ని అంచనా వేశారు. అందుకు అనుగుణంగానే షేర్లు నేడు బంపర్ ఎంట్రీ ఇచ్చాయి. థర్మల్ ఇంజినీరింగ్ ఉత్పత్తులు, స్పెషలైజ్డ్ కేబుళ్లను తయారీ చేసే ఈ కంపెనీ.. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ విస్తరణకు వినియోగించనుంది.




## టీఎంపీవీ కొత్త బ్రాండ్ టాటా.కార్స్




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** టాటా.కార్స్ బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్న టీఎంపీవీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ముఖ్య వాణిజ్య అధికారి వివేక్ శ్రీవత్స ముంబయి: కార్లు కొనుగోలు చేసే యువతను ఆకర్షించే లక్ష్యంతో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ (టీఎంపీవీ) గురువారం తన కొత్త బ్రాండ్ గుర్తింపు అయిన టాటా.కార్స్‌ను ఆవిష్కరించింది. మరింత స్మార్ట్, పర్యావరణ హిత, అనుసంధానిత మొబిలిటీ అనుభవాలను తీర్చిదిద్దేలా.. ప్రపంచ వ్యాప్తంగా సులభంగా అర్థమయ్యేలా టాటా.కార్స్ పేరు నిర్ణయించినట్లు కంపెనీ పేర్కొంది. 'ఈ రోజు పరిచయం చేస్తున్న టాటా.కార్స్ కేవలం కొత్త బ్రాండ్ గుర్తింపు కాదు. మేము ఊహించే భవిష్యత్ కోసం మా సంకల్ప ప్రకటన కూడా' అని టీఎంపీవీ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు.

## ఐపీఓకు ఆరాజెన్ సన్నాహాలు

aragen

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఒప్పంద పరిశోధన, అభివృద్ధి, తయారీ సంస్థ (సీఆర్‌డీఎంఓ) ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ప్రకారం రూ.800 కోట్ల విలువైన తాజా షేర్లను సంస్థ జారీ చేయనుంది. దీంతోపాటు ప్రస్తుత వాటాదారు గోల్డ్‌మన్ శాక్స్ క్యాపిటల్ హోల్డింగ్స్, ప్రమోటర్లు 2.73 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో విక్రయిస్తారు. సమీకరించే నిధులను సంస్థ విస్తరణకు, అప్పులు తీర్చేందుకు వినియోగిస్తారు. హైదరాబాద్‌లోని కంపెనీ ల్యాబ్, తయారీ కేంద్రాలకు కొత్త యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేస్తారు. బెంగళూరులోని కంపెనీ అనుబంధ సంస్థ ఆరాజెన్ బయోలాజిక్స్‌లో సదుపాయాల విస్తరణకు, సాధారణ కార్పొరేట్ అవసరాల నిమిత్తం కొంత మొత్తం కేటాయిస్తారు. 2000లో ఏర్పడిన ఈ కంపెనీకి, మనదేశంతో పాటు అమెరికా, ఐరోపా, జపాన్‌లలో కలిపి 591 మంది అంతర్జాతీయ వినియోగదారులున్నారు. 4,362 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

## యమహా వైజెడ్ఎఫ్-ఆర్2

### ధరల శ్రేణి రూ.2.30-2.53 లక్షలు



చెన్నై: అంతర్జాతీయ విపణి కోసం తేలికపాటి స్పోర్ట్‌బైక్ వైజెడ్ఎఫ్-ఆర్2ను యమహా మోటార్ ఇండియా విడుదల చేసింది. ప్రారంభ ధర రూ.2.30 లక్షలు (ఎక్స్-షోరూమ్). టాప్ వేరియంట్ ఆర్2ఎం ధర రూ.2.53 లక్షలు (ఎక్స్‌షోరూమ్). ఈ బైక్ డెలివరీలు సెప్టెంబరు నుంచి ప్రారంభమవుతాయి. కొత్తగా అభివృద్ధి చేసిన 200 సీసీ లిక్విడ్ కూల్డ్, సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఈ బైక్‌కు అమర్చారు. దీనికి 6 స్పీడ్ గేర్‌బాక్స్‌తో పాటు స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్‌ను స్టాండర్డ్‌గా ఇచ్చారు. స్ట్రీట్, రెయిన్, స్పోర్ట్స్, కస్టమ్ అనే రైడింగ్ మోడ్స్ ఇచ్చారు. టాప్ వేరియంట్‌లో అదనంగా టీఎఫ్‌టీ తెర, స్మార్ట్ కీ వంటి అధునాతన ఫీచర్లను జోడించారు.

## ఇంజినీర్ల కంటే ఎంబీఏలకే

# 59% అధిక వేతనం

### టాప్ 10 బిజినెస్ స్కూళ్లలో సగటు ప్యాకేజీ రూ.27.4 లక్షలు డెలాయిట్ ఇండియా నివేదిక




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇపుడు హవా అంతా ఇంజినీరింగ్‌దే.. మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లో ఉన్నతోద్యోగాలకు ఉపయోగపడే ఎంబీఏ (మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) ప్రభ తగ్గుతోంది అనుకోవడం పొరబాటే. ఎందుకంటే కళాశాల ప్రాంగణ ఎంపికల్లో ఇంజినీరింగ్ పొజిషన్లతో పోలిస్తే ఎంబీఏ చేసిన వారికి అధిక వేతన ఆఫర్లు దక్కుతున్నాయని డెలాయిట్ ఇండియా పేర్కొంది. 505 దిగ్గజ కళాశాలల్లో నియా మక ఎంపికల తీరు ఆధారంగా నివేదికను సంస్థ రూపొందించింది. ఎంబీఏ, బీటెక్, బీబీఏ, బీకామ్ తదితర విభాగాల్లో టాప్-10 తర్వాత 40 ర్యాంకుల్లో ఉన్న క్యాంపస్‌లలో సర్వే చేపట్టి 'క్యాంపస్ వర్క్‌ఫోర్స్ ట్రెండ్స్ 2026' పేరిట ఒక నివేదికను విడుదల చేసింది. ఇంజినీరింగ్ విషయానికొస్తే నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ప్రకారం 11-40 ర్యాంకుల్లో ఉన్న సంస్థల్లో డెలాయిట్ సర్వే నిర్వహించింది. అందులో బిట్స్ పిలానీ, ఐఐటీ ఇందౌర్, ఎన్ఐటీ రవుర్కెలా, ఐఐటీ ధన్‌బాద్, ఎన్ఐటీ కాలికట్ వంటివి ఉన్నాయి. టైర్-1 ఎంబీఏ విభాగంలో రాయ్‌పుర్, తిరుచ్చి, కాశీపుర్, నాగ్‌పుర్ వంటి కొత్త ఐఐఎమ్‌లతో పాటు ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పుర్‌లోని మేనేజ్‌మెంట్ స్కూళ్లు, ఎస్‌పీ జైన్, ఐఎమ్ఐ దిల్లీ వంటి ప్రైవేటు సంస్థలూ ఉన్నాయి.

**ప్యాకేజీలిలా..**

2026 సంవత్సరానికి ప్లేస్‌మెంట్లు పొందిన ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు దక్కిన ప్యాకేజీలతో పోలిస్తే ఎంబీఏ విద్యార్థులకు 52% అధిక వేతనాలు లభించాయి. 2027 ప్లేస్‌మెంట్‌లలో ఈ వృద్ధి 59 శాతానికి చేరొచ్చని అంచనా. 2025లో ఈ అంతరం 47 శాతంగా ఉంది. అంటే ఏడాదికేడాది ఎంబీఏ, ఇంజినీరింగ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ వేతనాల అంతరం పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాదిలోనూ 250 కంపెనీలు (రిక్రూటర్లు) టెక్నికల్ హోదాల కంటే మేనేజ్‌మెంట్ ఆధారిత లీడర్‌షిప్/హోదాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు డెలాయిట్ పార్ట్‌నర్ నీలేశ్ గుప్తా తెలిపారు.

**మారిన కంపెనీల తీరు**

క్యాంపస్ నియామకాలను పెంచుకోవడం కోసం విడిగా నియామక బృందాలను 80% పైగా కంపెనీలు నియమించుకున్నాయి. ఆఫర్ ఇచ్చిన తర్వాత, ఉద్యోగంలో చేరే వారి సంఖ్య కూడా అన్ని డిగ్రీ విభాగాల్లో పెరిగింది. కృత్రిమ మేధ(ఏఐ) వల్ల కొత్త ఉద్యోగాలు/నైపుణ్యాల అవసరం వచ్చిందని 35% సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ఏఐ వల్ల నియామకాల తీరూ మారిందని 86% కంపెనీలు అంటున్నాయి. రెజ్యూమె స్క్రీనింగ్, అసెస్‌మెంట్స్, అభ్యర్థి ఎవాల్యువేషన్‌లలో ఏఐ పాత్ర పెరిగిందని సంస్థలు పేర్కొన్నాయి.

**విద్యా సంస్థలను బట్టే ప్యాకేజీలు..**

టాప్-10 విద్యాసంస్థల్లో ఎంబీఏ సగటు వార్షిక వేతన ప్యాకేజీ రూ.27.4 లక్షలుగా ఉండగా, టైర్-3 విద్యా సంస్థల్లో ఇది రూ.8.4 లక్షలుగా ఉంది. ఇదే విషయంలో బీటెక్ గ్రాడ్యుయేట్లకు ఇవి వరుసగా రూ.18.7 లక్షలు, రూ.5.75 లక్షలుగా ఉన్నాయి. ఏఐ, డేటా నైపుణ్యాలున్న వారికి మాత్రం 20-25% అదనంగా ప్యాకేజీ లభిస్తోంది. అనలిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలుంటే 10-15% మేర అధిక వేతనాలందుతున్నాయి.

## బ్యాంకెక్స్ పుట్ రూ.6 నుంచి రూ.986కి

### నిమిషాల వ్యవధిలోనే.. సీఏఎస్ ప్రభావం వల్లే: ట్రేడర్లు

గురువారం ఎక్స్‌పైరీ రోజున బ్యాంకెక్స్ 65000 ఆగస్టు పుట్ ప్రీమియం ధర రూ.6 నుంచి నిమిషాల వ్యవధిలోనే రూ.986కి పెరిగింది. బ్యాంకెక్స్ లాట్ పరిమాణం 30. అంటే రూ.180 పెట్టుబడి ఏకంగా రూ.29,580 అయ్యిందన్నమాట. అయితే చివరికి ఈ పుట్ కాంట్రాక్టు రూ.687 ధర వద్ద స్థిరపడగా, విలువ రూ.20,610గా ఉంది. సెన్సెక్స్ ఆప్షన్స్‌లోనూ ఇదే జరిగింది. సెన్సెక్స్ 77000 ఆగస్టు పుట్ రూ.7 నుంచి ఒక దశలో రూ.284.85ని తాకింది. సాధారణంగానే ఎక్స్‌పైరీ రోజున ఆప్షన్స్ కాంట్రాక్టులు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయి. దీనికి క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సీఏఎస్) ప్రక్రియ తోడవడంతో.. బ్యాంకెక్స్, సెన్సెక్స్ పుట్ ఆప్షన్స్ భారీగా పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. ఎక్స్‌పైరీ రోజుల్లో బ్యాంకెక్స్ వంటి అస్థిర సూచీ కాంట్రాక్టుల విషయంలో ఆప్షన్ల కదలికలు అత్యంత సున్నితంగా ఉంటాయి. క్లోజింగ్ ఆక్షన్ సమయంలో ప్రామాణిక సూచీ లేదా దానిలోని కంపెనీ షేర్లు అకస్మాత్తుగా తీవ్ర అస్థిరతకు గురైనప్పుడు అవుట్- ఆఫ్- ద- మనీ (ఓటీఎం) లేదా డీప్ ఓటీఎం ఆప్షన్‌లు తక్షణమే ఇన్- ది- మనీగా మారొచ్చు. సూచీ ప్రస్తుత ధరకు దూరంగా స్ట్రైక్ ప్రైస్ ఉన్న ఆప్షన్ కాంట్రాక్టులను అవుట్- ఆఫ్- ద- మనీగాను, ప్రస్తుత ధరకు మించి స్ట్రైక్ ప్రైస్ ఉండే కాంట్రాక్టులను ఇన్- ద- మనీ ఆప్షన్స్‌గా చెబుతారు. ఇలా ఒక్కసారిగా ఇన్ ద మనీ ఆప్షన్స్‌గా మారినప్పుడు ఆ కాంట్రాక్టు ప్రీమియం ధర స్థిరపడటానికి ముందే భారీగా పెరుగుతాయి. గురువారం బ్యాంకెక్స్ 65000 ఆగస్టు పుట్ రూ.986కి పెరిగి, ఆ తర్వాత రూ.687 వద్ద స్థిరపడినట్లుగా అన్నమాట. ఆకస్మికంగా భారీ మార్కెట్ ఆర్డర్లు లేదా ఎగ్జిక్యూషన్‌లో అసాధారణత వల్ల కూడా కొన్ని సెకన్లలోనే ప్రామాణిక సూచీల రెఫరెన్స్ ధర తీవ్రంగా మారుతోంది. ఈ పరిణామం కూడా ఆప్షన్స్ కాంట్రాక్టుల ప్రీమియం భారీగా పెరిగేందుకు దారితీస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. గురువారం బ్యాంకెక్స్ పుట్ కాంట్రాక్టుల్లో కనిపించిన ఈ భారీ పెరుగుదలకు సంబంధించిన గ్రాఫ్‌లను ట్రేడర్లు, మార్కెట్ పరిశీలకులు ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేయడంతో.. సీఏఎస్ విధానం మళ్లీ చర్చనీయాంశం అయ్యింది.

## నేను రుణ గ్రహీతను కాదు.. పూచీకత్తు మాత్రమే ఇచ్చా

### నాపై ఉన్న క్లెయిమ్ రూ.3992 కోట్లే : సుభాష్‌చంద్ర



**దిల్లీ:** ఎస్సెల్‌గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్‌చంద్ర వ్యక్తిగత దివాలా ప్రక్రియలో, రుణదాతలు పేర్కొన్న రూ.22,006.57 కోట్ల క్లెయిమ్‌లకు గాను కేవలం రూ. 6.5 కోట్లు చెల్లించే పరిష్కార ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ (జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్) ఆమోదం తెలిపిందనే వార్త సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ ప్రకారం చూస్తే రుణసంస్థలు ఇచ్చిన నిధుల్లో 99.97% నష్టపోయినట్లే. దీనిపై సుభాష్ చంద్ర గురువారం స్పందించారు. వ్యక్తిగత దివాలా ప్రక్రియలో తనపై ఉన్న మొత్తం క్లెయిమ్ రూ.3,992 కోట్లేనని తెలిపారు. ఆ మొత్తానికి తాను వ్యక్తిగత హామీదారు మాత్రమేనని, తాను ఏ రుణదాత వద్ద డబ్బు అప్పుగా తీసుకోలేదని పేర్కొన్నారు. ఆయన ప్రకారం.. రూ.3992 కోట్లలోనూ రూ.620 కోట్ల క్లెయిమ్ ఇప్పటికే పరిష్కారమైంది. మరో రూ.1,063 కోట్లు తిరిగి చెల్లించేందుకు రుణం తీసుకున్న సంస్థలు ముందుకొచ్చాయి. 'చంద్ర వ్యక్తిగత హామీలతో రుణాలు తీసుకున్న సంస్థలు ఇప్పటివరకు రూ.43,000 కోట్లు చెల్లించేశాయి. ఇతర మొత్తాలను కూడా పరిష్కరిస్తామని సంబంధిత సంస్థలు హామీ ఇచ్చాయి' అని పేర్కొన్నారు. వివేక్ ఇన్‌ఫ్రాకాన్ అనే సంస్థ తీసుకున్న రూ.170 కోట్ల రుణం నిరర్థక ఆస్తిగా మారడంతో తొలుత కేసు నమోదైంది. ఈ రుణానికి సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీ ఇచ్చారు. రుణదాత ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించి దివాలా ప్రక్రియ ప్రారంభించడంతో, చంద్ర నుంచి డబ్బులు రావాల్సిన ఇతర సంస్థలు కూడా జతచేరాయి. ఫలితంగా మొత్తం క్లెయిమ్‌లు రూ.22,006 కోట్లకు చేరాయి. ఇందులో ఎస్సెల్/జీ నెట్‌వర్క్ సంబంధిత కంపెనీలు తీసుకున్న రుణాలకు ఆయన పూచీగా ఉన్న కేసులున్నాయి.

అప్పీల్ చేస్తాం.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్: రికవరీ మొత్తం చాలా తక్కువగా ఉన్నందున, ఈ ప్రణాళికకు ఆమోదం ఇవ్వకూడదన్న ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నేతృత్వంలోని రుణదాతల వాదన తిరస్కరణకు గురయిన నేపథ్యంలో..అప్పీల్ చేస్తామని రుణదాతల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. ప్రణాళిక ప్రకారం బ్యాంక్ క్లెయిమ్ రూ.680 కోట్లలో 3.2% మాత్రమే వసూలయ్యే పరిస్థితి ఉండటమే ఇందుకు కారణమంది. మాతృసంస్థ హెచ్‌డీఎఫ్‌సీ నుంచి ఈ రుణం తమకు వచ్చినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వివరించింది. దీనిపై బ్రిటన్‌లో ఉన్న విజయ్‌మాల్యా వ్యంగ్యంగా స్పందించారు. 'ఇది నిజమైతే, నా స్నేహితుడు సుభాష్‌కు హృదయపూర్వక అభినందనలు. నా విషయంలో కోర్టు తీర్పు ద్వారా నిర్ధారించబడిన బకాయి రూ. 6,203 కోట్లు అయితే, రూ.14,100 కోట్లు రికవర్ చేసినట్లు బ్యాంకులు - ప్రభుత్వం అంగీకరించాయి. ఇంకా అనేకమంది రుణగ్రహీతలు కూడా తమ బకాయిలను చాలా తక్కువమొత్తం చెల్లించి పరిష్కరించుకున్నారు. ఇదే భారతదేశంలోని రుణ పరిష్కార న్యాయమని నేను భావిస్తున్నా' అని మాల్యా వ్యాఖ్యానించారు.

## 2030కి రూ.20 లక్షల కోట్ల ఈవీ విపణి

### 5 కోట్ల ఉద్యోగాల సృష్టి : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



దిల్లీ: దేశీయ విద్యుత్ వాహన (ఈవీ) విపణి 2030 నాటికి రూ.20 లక్షల కోట్ల స్థాయికి చేరొచ్చని అంచనా వేస్తున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ రంగం 5 కోట్ల ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉందని పేర్కొన్నారు. 'సీఐఐ-ఐటీసీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' నిర్వహించిన సదస్సులో గడ్కరీ మాట్లాడుతూ.. దేశంలో 57 లక్షల విద్యుత్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయని, మొత్తం వాహన విపణిలో వీటి వాటా 7 శాతమని చెప్పారు. రెండు అతి పెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థలైన బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్ తాము ఉత్పత్తి చేసే వాహనాల్లో 50 శాతానికి పైగా ఎగుమతి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేశంలో ఏటా లక్ష విద్యుత్ బస్సులకు గిరాకీ ఉన్నా, 50,000-60,000 వరకే తయారు చేయగలుగుతున్నామని వివరించారు. అయిదేళ్లలో మన వాహన రంగాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. మన దేశంలో తయారవుతున్న వాహనాల నాణ్యత బాగుండటం, వాటి ధర తక్కువగా ఉండటమే విజయ రహస్యమని గడ్కరీ పేర్కొన్నారు. తాను రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు భారత వాహన పరిశ్రమ పరిమాణం రూ.14 లక్షల కోట్లుగా ఉండేదని, ప్రస్తుతం రూ.23 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. అంతర్జాతీయంగా అమెరికా వాహన పరిశ్రమ రూ.78 లక్షల కోట్ల స్థాయిలో, చైనా రూ.47 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. మనదేశం ఏటా రూ.22 లక్షల కోట్ల విలువైన ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని, భవిష్యత్తులో బయో ఇంధనాలు కూడా వాహన రంగంలో కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. దేశంలో రోడ్లు మెరుగుపడినందున లాజిస్టిక్ వ్యయాలు 16% నుంచి 10 శాతానికి తగ్గాయని, దీన్ని 8 శాతానికి పరిమితం చేయడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# ట్రాఫిక్ నరకం

## ఇబ్రహీంపట్నం అతలాకుతలం

- సాగర్ హైవేపై గంటల తరబడి వాహనాల రద్దీ
- పండుగ వేళ మరింత పెరిగిన తిప్పలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

**రంగారెడ్డి, ఆగస్టు 28 (జనంసాక్షి) :** అభివృద్ధి చెందుతున్న పట్టణమే.. కానీ ఇబ్రహీంపట్నం ప్రజలకు మాత్రం ట్రాఫిక్ కష్టాలు నిత్య కృత్యంగా మారుతున్నాయి. రద్దీకి తగ్గట్టుగా రోడ్లు విస్తరించకపోవడం, మరోవైపు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సాగర్ హైవేపై ప్రయాణం నరకప్రాయం గా మారుతోంది. శుక్రవారం ఉదయం రాఖీ పౌర్ణమి పండుగ రద్దీకి తోడు, పీక్ అవర్స్ కావడంతో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనాల రద్దీ వల్ల గంటల తరబడి ట్రాఫిక్‌లోనే మగ్గిపోవాల్సి వచ్చింది. రద్దీని నియంత్రించాల్సిన సమయంలో ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై వాహనదారులు, స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సాగర్ హైవేపై వాహనాల సంఖ్య పెరగడంతో ఇటు మంచాల రోడ్డు, అటు రాయపోల్ రోడ్డు సైతం జామ్ కావడం వల్ల ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. ఇక ప్రధాన కూడళ్ల వద్ద పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

### పండుగ పూటా తప్పని తిప్పలు..

రాఖీ పౌర్ణమి పండుగ సందడి, ప్రయాణికుల రద్దీతో హైవే కిటకిటలాడింది. ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో అప్రమత్తంగా వ్యవహరించి రాకపోకలను క్రమబద్ధీకరించాల్సిన పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు.

### చలాన్లపై శ్రద్ధ.. క్రమబద్ధీకరణపై ఏదీ?

డిజిటల్ కెమెరాలు, స్పాట్ ఇన్‌స్పెక్షన్ల పేరుతో వాహనదారులపై నిబంధనల కొరడా ఝుళిపించి.. ఇబ్బడిముబ్బడిగా చలాన్లు విధించడంలో చూపే వేగం, ట్రాఫిక్ జామ్‌లను నివారించడంలో ఎందుకు కనిపించడం లేదని వాహనదారులు నిలదీస్తున్నారు. అది లేని రోజుల్లో నిత్యం రోడ్లపై కనిపించే ట్రాఫిక్ పోలీసులు పండగపూట ప్రతి సమయాల్లో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సమయంలోనే వాహనదారులను ఎప్పటికప్పుడు ప్రధాన రహదారులు వాహనాలతో నిలిచిపోకుండా సరి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. కానీ అలాంటి ప్రయత్నం మాత్రం పండుగ కూడా జరగడం లేదు.

### ట్రాఫిక్ నియంత్రణ ఎవరి బాధ్యత





పండగలు ఇతర ఈవెంట్ల సందర్భంగా ప్రధాన రహదారులు వాహనదారులు ప్రజలతో నిండిపోతుంది ఈ సమయంలోనే గంటలు తరబడి ప్రయాణికులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఇలాంటి సందర్భంలోనే సాగర్ హైవేపై రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన జంక్షన్ల వద్ద ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసులను కేటాయించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీని నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, దారి మళ్లింపు చర్యలు చేపట్టాలి.

### చలాన్లు కాదు, సేవలు ముఖ్యం

కేవలం చలాన్ల వసూళ్లపైనే కాకుండా, ప్రజల రాకపోకల సౌలభ్యం, భద్రతపై యంత్రాంగం దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. పండగల సమయంలోనే రోడ్లు కిటికీరలాడిపోతుంటాయి ఇలాంటి సందర్భంలోనే పోలీసుల పనితీరుకు అద్దం పడుతోంది. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ లో నియంత్రించడం పోలీసుల ప్రధాన లక్ష్యం. కానీ నియంత్రణ మరిచి చలాన్లకే సమయం కేటాయిస్తున్నాడంతో ట్రాఫిక్ పోలీసులపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

### కూరగాయలకు వెళ్లాలన్న భయమే

ఏర్పుల మల్లేష్, ఇబ్రహీంపట్నం.



"ఇంటి నుంచి చౌరస్తాకు వెళ్లి మెడికల్ షాప్, కూరగాయలు, కిరాణా సామాన్లు, పూలు తెచ్చుకుందామంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. వాహనం ఆపి సరుకులు తీసుకునే లోపే పోలీసులు ఎక్కడి నుంచో ప్రత్యక్షమై ఫోటోలు కొట్టి ఫైన్ వేస్తారో భయంగా ఉంది." పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ పేరుతో సాగుతున్న చలాన్ల మోత తమ కుటుంబాలకు అదనపు భారంగా మారుతోంది.

### సామాన్యుల పొట్టకొట్టేలా ట్రాఫిక్ జరిమానాలు

సీపీఐ మండల కార్యదర్శి కావలి సురేష్




రోజువారీ కూలీ చేసుకుంటూ బతికే సాధారణ ప్రజలపై ట్రాఫిక్ పోలీసులు చలాన్ల పేరుతో విపరీతమైన జరిమానాలు విధిస్తున్నారు. నిత్యం కష్టపడితే వచ్చే సంపాదన రూ.500 నుంచి రూ.1000 లోపే ఉంటుంది. కుటుంబ పోషణే భారంగా మారిన ఇలాంటి పరిస్థితుల్లో, కనీస అవసరాల కోసం బయటికి వచ్చే సామాన్యులపై ట్రాఫిక్ పోలీసులు వందల్లో, వేలల్లో ఫైన్లు వేయడం అత్యంత క్రూరం. ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి సామాన్యులపైన విపరీతంగా విధిస్తున్న జరిమానాల విధానాన్ని తక్షణమే నిలిపివేయాలి.

# తప్పుడు విరాసత్‌ను రద్దు చేయాలి

## భూముల సర్వే నంబర్లను బ్లాక్ చేయాలి

- కలెక్టర్, తహశీల్దార్‌కు వృద్ధురాలి వినతి
- 27 ఎకరాల భూమిపై అక్రమంగా పత్రాలు సృష్టించారని ఆరోపణ
- తనకు, కుమార్తెకు న్యాయం చేయాలని విజ్ఞప్తి



**కేశంపేట, ఆగస్టు 28 (జనంసాక్షి):** తప్పుడు అఫిడవిట్, ప్రొసీడింగ్, ధ్రువపత్రాలు సృష్టించి తనకు, తన కుమార్తెకు తెలియకుండా చేపట్టిన భూ విరాసత్‌ను రద్దు చేసి, సంబంధిత సర్వే నంబర్లను బ్లాక్ చేయాలని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన 75 ఏళ్ల అనసూయమ్మ అధికారులను కోరారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, కేశంపేట తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనసూయమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె భర్త వెంకట్‌రెడ్డి 2012లో మృతి చెందారు. అనంతరం తన ఇద్దరు కుమారులు తనకు, తన కుమార్తె నిర్మలకు తెలియకుండా సుమారు 27 ఎకరాల భూమికి సంబంధించిన పలు సర్వే నంబర్లపై తప్పుడు పత్రాలు సృష్టించి విరాసత్ చేసుకున్నారని ఆరోపించారు. దీనిపై షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయం, కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మోసం, చీటింగ్‌కు సంబంధించిన కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై కేశంపేట తహశీల్దార్ విచారణ జరిపి ఆర్డీవో కార్యాలయానికి నివేదిక సమర్పించినట్లు పేర్కొన్నారు. విరాసత్‌కు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేవని, కార్యాలయ రికార్డులు కూడా మాయమైనట్లు తనకు తెలిసిందన్నారు. ప్రస్తుతం తన కుమారులు భూమిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన అనసూయమ్మ.. భూముల సర్వే నంబర్లను బ్లాక్ చేసి, తనకు, తన కుమార్తెకు చట్టబద్ధంగా రావాల్సిన వాటా దక్కేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# విద్యార్థి నేస్తం ట్రస్ట్‌లో కొత్త బాధ్యతలు

## వికారాబాద్ జిల్లా కన్వీనర్‌గా వ్యాసరాజ్ కళ్యాణ్, కో-కన్వీనర్‌గా ఎం. రవీందర్



**వికారాబాద్, ఆగస్టు 28 (జనంసాక్షి):** విద్యార్థి నేస్తం ఎడ్యుకేషన్ ట్రస్ట్ వికారాబాద్ జిల్లా నూతన కమిటీని ప్రకటించింది. జిల్లా కన్వీనర్‌గా వ్యాసరాజ్ కళ్యాణ్, కో-కన్వీనర్‌గా ఎం. రవీందర్‌ను నియమిస్తూ ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి. మురళీ మనోహర్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యులు మాట్లాడుతూ యువత సాధికారతే లక్ష్యంగా విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కార్యక్రమాలను జిల్లాలో విస్తృతం చేస్తామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు సరైన మార్గనిర్దేశం అందిస్తామన్నారు. వికసిత్ భారత్-2047 నిర్మాణంలో యువతను భాగస్వాములుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ట్రస్ట్ కార్యకలాపాలను విస్తరించి మరింత మంది విద్యార్థులు, యువతకు సేవలు అందేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సమావేశాలు నిర్వహించి భవిష్యత్ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు. తమకు బాధ్యతలు అప్పగించిన ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ విశ్వనాథ్, ప్రొఫెసర్ గణేష్, రాజేష్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

# 'రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్'


- పోటీలో బంగారు - కాంస్య పథకాలు సాధించిన పారమిత విద్యార్థులు
- విద్యార్థులను అభినందించిన పారమిత చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు

**కరీంనగర్ బ్యూరో ఆగస్టు 28 (జనంసాక్షి) :** స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 2వ తరగతి 3 తరగతి చదువుతున్న విద్యార్థులు, 3వ తెలంగాణ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల లో బంగారు, కాంస్య పథకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఈ నెల 23 వ రోజున హైదరాబాద్ నగరంలోని అల్మాస్ గూడలో తెలంగాణ రోప్ స్కిప్పింగ్ క్రీడా సమాఖ్య అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ తెలంగాణ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో భాగంగా అండర్ 10 విభాగంలో పారమిత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న సి.హెచ్. ఈశ్వర సాయి, అండర్ 8 విభాగంలో 2వ తరగతి చదువుతున్న డి.నిఖిల్ లు అద్భుత ప్రతిభ తో బంగారు పతకం సాధించారు. అలాగే 2వ తరగతి చదువుతున్న ఎమ్. శ్రేయాన్స్ అండర్ 8 విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలో బంగారు, కాంస్య పథకాలు సాధించిన సి. హెచ్. ఈశ్వర్ సాయి, డి.నిఖిల్ ఎం. శ్రేయన్స్‌లను పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద రావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత సమన్వయకర్త శ్రీనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు రామక్రిష్ణ, కళ్యాణ్, మహేష్ లు అభినంధించారు.



# నేతన్నలకు ఆర్డర్లతో ఆర్థిక చేయూత

- చేనేత కార్మికుల జీవన ప్రమాణాల పెంపునకు కృషి
- మరోసారి చీరల తయారీ ఆర్డర్లు
- ఖాదీ వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలి
- ఘనంగా మార్కండేయ శోభాయాత్ర



**సిరిసిల్ల టౌన్, ఆగస్టు 28 (జనంసాక్షి):** నేతన్నలు ఆర్థికంగా ఎదిగేందుకు చీరల తయారీ ఆర్డర్లు అందించి ప్రభుత్వం అండగా నిలుస్తోందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. నూలు పౌర్ణమి, రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సిరిసిల్లలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మార్కండేయ శోభాయాత్రలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, నేతన్నల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో కోటి మంది మహిళలకు చీరలు అందించే కార్యక్రమం ద్వారా సిరిసిల్ల నేత కార్మికులకు పెద్దఎత్తున ఉపాధి లభించిందని, ప్రస్తుతం మరోసారి చీరల తయారీ ఆర్డర్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చేనేతకు సిరిసిల్ల ప్రసిద్ధి చెందిందని, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం సహకరిస్తుందన్నారు. ఖాదీ వస్త్రాల వినియోగాన్ని పెంచాలని, సన్మాన కార్యక్రమాల్లో ప్లాస్టిక్ శాలువాలకు బదులుగా ఖాదీ వస్త్రాలను ఉపయోగించాలని సూచించారు. మార్కండేయ స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా శోభాయాత్ర కొనసాగింది. భక్తులు, పద్మశాలి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ ట్రాక్టర్‌పై మగ్గాన్ని ఏర్పాటు చేసి శోభాయాత్రలోనే చీర నేస్తూ నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, యువజన అధ్యక్షుడు సబ్బని హరీష్, మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

**శంషాబాద్,ఆగస్టు28(జనంసాక్షి) :** కరీంనగర్‌లో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి, భవన నిర్మాణ సంఘం రాష్ట్ర నాయకులు నర్రగిరి తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర 4వ మహాసభలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్రగిరి మాట్లాడుతూ మహాసభలకు శంషాబాద్ మండలం నుంచి కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గిలక రాజు, మండల అధ్యక్షులు శ్రీను, భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు ఎద్దుల శ్రీను, ఉపాధ్యక్షుడు దండు రవి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత.. కేసు నమోదు

**తెలకపల్లి, ఆగస్టు 28 (జనం సాక్షి):** అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఎం. రమేష్ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన వివరాల ప్రకారం బల్మూరు మండలం తుమ్మెన్‌పేట గ్రామానికి చెందిన మల్లేష్ కొంతకాలంగా తెలకపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.18 నుంచి రూ.20 చొప్పున బియ్యం కొనుగోలు చేసి, అధిక ధరలకు నల్లబజారులో విక్రయించేందుకు నాగర్‌కర్నూల్‌కు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సివిల్ సప్లైస్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ ఏ. హేమ్లా నాయక్, పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో టీజీ 08టీ 5172 నంబరు గల అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీ చేయగా.. 60 గన్నీ బస్తాల్లో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించింది. బియ్యాన్ని పంచనామా నిర్వహించి సీజ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# రైతుల జీవితాలతో చెలగాటమా?

## అక్రమ బ్లాస్టింగ్ పై ఉక్కుపాదం మోపాలి - గొంగళ్ల రంజిత్ కుమార్



**గట్టు, ఆగస్టు 28 (జనం సాక్షి) :** గట్టు మండలం సల్కాపురం గ్రామంలో భారత్ మాల ప్రాజెక్టు క్రషర్ మిషన్, అక్రమ బ్లాస్టింగ్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రక్షణ సేన గద్వాల నియోజకవర్గ ఇన్చార్జి గొంగళ్ల రంజిత్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం జోఖన్ గట్టు ప్రాంతంలో బ్లాస్టింగ్ ప్రదేశాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్లాస్టింగ్ వల్ల బోర్లు దెబ్బతిని పంటలు ఎండిపోతున్నాయని, ఇళ్లకు బీటలు వస్తున్నాయని, దుమ్ము ధూళితో పిల్లలు, గర్భిణీలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.క్రషర్ ను నిలిపివేయాలని సల్కాపురం రైతు యేసు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని, అతని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీటీ రోడ్లు కూడా పూర్తిగా ధ్వంసమవుతున్నాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కంపెనీపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదేశాలతో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



# మధుయాష్కీ గౌడ్‌కు రాఖీ కట్టిన మంత్రి సీతక్క

**హయత్ నగర్, ఆగస్టు 28 (జనం సాక్షి) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. బంజారాహిల్స్‌లోని మధుయాష్కీ గౌడ్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీతక్క ఆయనకు రాఖీ కట్టి, స్వీట్లు తినిపించారు. ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి సందర్భంగా మధుయాష్కీ గౌడ్‌కు రాఖీ కడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకుంటున్న సీతక్క, ఈ ఏడాది కూడా అదే ఆత్మీయతను కొనసాగించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ సీతక్కకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాతృమూర్తి, అక్కలతో సీతక్క ఆత్మీయంగా మాట్లాడారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు సరదాగా గడిపారు.

# అక్రమ నీటి మోటార్లపై వాటర్‌బోర్డు కొరడా

**అమీర్‌పేట్, ఆగస్టు 28 (జనంసాక్షి):** అక్రమంగా ఏర్పాటు చేసిన నీటి మోటార్లపై వాటర్‌బోర్డు అధికారులు కొరడా ఝుళిపించారు. విజిలెన్స్ డ్రైవ్‌లో భాగంగా బాపునగర్, ఎస్ఆర్‌నగర్ ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించి 14 అక్రమ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మోటార్లు వినియోగించడం వల్ల నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడి, ఇతర వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మోటార్లు ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ మోటార్లను గుర్తించేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఎరువుల దుకాణంలో రికార్డుల తేడా?

- అనంత పద్మనాభ స్వామి ఫర్టిలైజర్ షాపులో వ్యవసాయ అధికారుల తనిఖీ
- ఈ-పాస్‌లోని స్టాక్‌కు.. భౌతిక నిల్వలకు వ్యత్యాసం
- డీలర్‌కు షోకాజ్ నోటీసు.మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

**ధారూర్,ఆగస్టు 28(జనంసాక్షి) :** ధారూర్ మండలం మున్నూరు సోమారం గ్రామంలోని అనంత పద్మనాభ స్వామి ఫర్టిలైజర్ దుకాణంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వికారాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేశం ఆధ్వర్యంలో దుకాణంలోని ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఈ-పాస్ యంత్రంలోని వివరాలను పరిశీలించారు.

తనిఖీల్లో స్టాక్ రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా లేదని అధికారులు గుర్తించారు.అలాగే దుకాణంలోని భౌతిక స్టాక్‌ను పరిశీలించగా, ఈ-పాస్ యంత్రంలో నమోదైన నిల్వలకు, వాస్తవంగా ఉన్న నిల్వలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ-పాస్ యంత్రంలో డీఏపీ మూడు బస్తాలు,అమ్మోనియం సల్ఫేట్ 11 బస్తాలు తదితర నిల్వలు నమోదై ఉండగా..భౌతికంగా పరిశీలించినప్పుడు అందుకు అనుగుణంగా స్టాక్ కనిపించలేదని పేర్కొన్నారు.



### రికార్డుల నిర్వహణపై ఆగ్రహం

ఎరువుల విక్రయాల్లో స్టాక్ రిజిస్టర్లు, ఈ-పాస్ వివరాలు సక్రమంగా నిర్వహించడం తప్పనిసరి. అయితే రికార్డుల నిర్వహణలో లోపాలు, ఈ-పాస్‌వివరాలు-భౌతిక నిల్వల మధ్య తేడాలు గుర్తించడంతో డీలర్ బిచ్చయ్యకు వ్యవసాయ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

### మూడు రోజుల్లో వివరణ.

షోకాజ్ నోటీసుకు మూడు రోజులలోపు వివరణ ఇవ్వాలని డీలర్‌ను ఆదేశించినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేశం తెలిపారు. డీలర్ ఇచ్చే వివరణను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్ ఉన్నారు.




# ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు

**ముస్తాబాద్ ఆగస్టు 28 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణములో ప్రయాణికులకు కూర్చున్న దానికి కుర్చీలు లేక నేలపై కూకుండే అవస్థలు పడుతున్న ప్రయాణికులు , కనీసం తాగడానికి మంచి నీళ్లు కూడా లేవు పరిశుభ్రత పాటించడం లేదు. టాయిలెట్ బాత్రూం లేవు. ఆర్టీసీ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ప్రయాణికులు అంటున్నారు వెంటనే జిల్లా ఆర్టిసి అధికారులు వెంటనే వసతులు ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్టీసీ బస్టాండ్ లో కుర్చీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు

# సీఎంఆర్ బియ్యం బకాయిలపై కఠిన చర్యలు

- పవన సుత రైస్ మిల్ రూ.12.28 కోట్ల డిఫాల్ట్ : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ఖరీఫ్, రబీ 2021-22కు సంబంధించి 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి
- డిఫాల్ట్ మిల్లర్‌తో పాటు ట్రక్ చిట్టీల్లో సంతకాలు చేసిన మరో వ్యక్తిపై కేసు నమోదు



**మంథని , ఆగస్టు 28, (జనంసాక్షి):** మండలంలోని పవన సుత రైస్ మిల్ సీఎంఆర్ బియ్యం డిఫాల్ట్‌కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథనిలోని రావికంటి పవన్ కుమార్ యాజమాన్యంలోని పవన సుత రైస్ మిల్‌కు ఖరీఫ్, రబీ 2021-22 సీజన్లలో మొత్తం 5,798.080 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, దానికి సమానంగా 3,891.295 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉందని తెలిపారు. అయితే మిల్లర్ ఇప్పటివరకు 1,069.380 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ఎఫ్‌సీఐ/టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అందించారని పేర్కొన్నారు. దీంతో 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి ఉన్నట్లు తెలిపారు. ఇది 4,211.813 మెట్రిక్ టన్నుల సమాన ధాన్యానికి సమానమని, దీని విలువ రూ.9,82,51,492గా ఉందని పేర్కొన్నారు. 25 శాతం పెనాల్టీ రూ.2,45,62,873 కలిపి మొత్తం డిఫాల్ట్ మొత్తం రూ.12,28,14,365గా నిర్ధారించినట్లు తెలిపారు. రబీ 2021-22కు సంబంధించి పవన సుత రైస్ మిల్లుకు అప్పగించిన ధాన్యాన్ని మంథనిలోని శ్రీలక్ష్మి ఎంఆర్ఎం సూరయ్య పల్లి మిల్లుకు తరలించినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి పీపీసీల ద్వారా సమర్పించిన ట్రక్ చిట్టీలు, జాయింట్ సంతకాలను అధికారులు పరిశీలించగా, శ్రీలక్ష్మి ఎంఆర్ఎం, సూరయ్యపల్లికి చెందిన భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్ సంతకాలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి అప్పగించిన ధాన్యం స్వీకరణ, అంగీకారానికి సంబంధించిన ట్రక్ చిట్టీల్లో నవీన్ కుమార్ సంతకాలు ఉన్న నేపథ్యంలో ఆయన పాత్రపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పవన సుత రైస్ మిల్ యాజమాని రావికంటి పవన్ కుమార్, శ్రీలక్ష్మి ఎంఆర్ఎం భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం విషయంలో డిఫాల్ట్‌కు పాల్పడిన మిల్లర్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు, రికవరీ తదితర చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలను పట్టించుకోని సర్కార్

**సారీ చెప్పడం కాదు.. సమస్య తీర్చండి : ఎంపీ ఈటల రాజేందర్**



**మల్కాజిగిరి ఆగస్టు 28 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్లను రిజిస్ట్రేషన్ల నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చడం తుగ్లక్ నిర్ణయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ఆర్కేపురంలో 22ఏ బాధితులతో ఆయన సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్కాజిగిరి మినీ ఇండియాలాంటిదని, దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఇక్కడ సామరస్యంగా జీవిస్తున్నారని ఈటల పేర్కొన్నారు. ఆర్కేపురం కాలనీ ఏర్పడి 61 ఏళ్లు గడుస్తున్నా, ఈ కాలనీని ఉన్నట్టుండి 22ఏ పరిధిలోకి తీసుకురావడం విడ్డూరమన్నారు.ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలి.ఒకవైపు ఇళ్లు లేనివారికి ఇళ్లు ఇస్తామంటూనే, మరోవైపు దశాబ్దాలుగా ఇళ్లు కట్టుకుని ఉంటున్న వారి హక్కులను కాలరాయడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోంది అని మండిపడ్డారు.30 గజాల చిన్న ఇళ్లలో బతుకుతున్న పేదల ఉసురు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోసుకుంటోందని ఆరోపించారు. హైడ్రా పేదల ఇళ్లను కూల్చివేసే దుర్మార్గమైన సంస్థగా మారిందని, హిట్లర్ పోకడలను గుర్తుచేస్తోందని ఆయన విమర్శించారు.గాజులరామారంలో 70 ఏళ్ల క్రితం కంకర కొట్టడానికి వచ్చి ఐదు ఎకరాల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలపై హైడ్రా ప్రతాపం చూపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలు ఖాళీ చేయాలని బోర్లు, కరెంట్ స్తంభాలను సైతం తొలగించడం అమానుషమని పేర్కొన్నారు. అదే స్థలంలో 20 ఎకరాలను ఆక్రమించిన బడా వ్యక్తుల జోలికి వెళ్లని అధికారులు, 5 ఎకరాల్లోని పేదల ఇళ్లను నేలమట్టం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.అక్రమ లేఅవుట్లు చేసిన రియల్టర్లు, బ్రోకర్లు, అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూసీ పరివాహక ప్రాంత బాధితులకు అండగా 48 గంటల పాటు క్షేత్రస్థాయిలో ఉండి కూల్చివేతలను అడ్డుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజల పక్షాన నిలబడి అన్యాయాలపై పోరాటం కొనసాగిస్తామని ఈటల స్పష్టం చేశారు. అనంతరం రాఖీ పండుగ వేడుకలలో పాల్గొని మహిళలతో రాఖీలు పట్టించుకోని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## సెప్టెంబర్ 4వ తేదీ నుండి జాతీయ సీనియర్ హాకీ పోటీలు

శేరిలింగంపల్లి, ఆగస్టు 28 (జనంసాక్షి) : వచ్చే నెల 4వ తేదీ నుండి హాకీ ఇండియా సీనియర్ మెన్ జాతీయ పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ హాకీ సంఘం అధ్యక్షులు కొండా విజయకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపాల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్ కంటాక్స్ బత్తిని సురేశ్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ హాకీ సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి హాకీ మైదానంలో సెప్టెంబర్ 4 నుండి 14 వ తేది వరకు నిర్వహించే 6 వ జాతీయ హాకీ ఇండియా సీనియర్ మెన్ ఇంటర్ డిపార్ట్ మెంట్ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించనున్నట్లు విజయకుమార్ తెలియజేశారు. గచ్చిబౌలి హాకీ క్రీడా మైదనంలో నిర్వహించే చాంపియన్ షిప్ లో మొత్తం దేశ వ్యాప్తంగా వివిధ డిపార్ట్ మెంట్ లకు చెందిన 20 టీంలు పాల్గొనున్నట్లు రాష్ట్ర హాకీ సంఘం ఆధ్యక్షుడు కొండ విజయ్ కుమార్, సెక్రటరీ భీం సింగ్ వివరించారు. టోర్నమెంట్ లో దేశంలోని పలువురు ప్రముఖ హాకీ క్రీడాకారులు , జాతీయస్థాయి హాకీ ప్రముఖులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ కం టాక్స్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



## 22-ఏ సమస్యను పరిష్కరించాలని బీజేపీ నేతల డిమాండ్

**హయత్ నగర్, ఆగస్టు 28 (జనం సాక్షి) :** 22- ఏ జాబితాలో చేర్చిన భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ల సమస్యను తక్షణమే పరిష్కరించి బాధిత రైతులు, భూ యజమానులు, ప్లాట్ యజమానులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. బి ఎన్ రెడ్డినగర్, శ్రీరామ్‌నగర్, వైదేహినగర్, సిరిపురం కాలనీ, సాహెబ్‌నగర్, ఫతుల్లాగూడ, సాయినగర్ తదితర ప్రాంతాల్లో 118 జీవో కారణంగా భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. అర్హత కలిగిన భూములు, ప్లాట్లను 22-ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు సమస్యపై పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ మోర్చాల పదాధికారులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్లాట్ యజమానులు, భూయజమానులు పాల్గొన్నారు.

## నేడు సీలింగ్ భూముల పట్టాల పంపిణీ

**హాజరుకానున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**నూతనకల్ ఆగస్టు 28(జనంసాక్షి) :** రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా నూతనకల్ మండల కేంద్రంలోని మర్రి సత్యనారాయణ రెడ్డి స్టేడియం సభా స్థలాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ శనివారం నాడు అనగా 29.08.2026 న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి గార్లచే సీలింగ్ భూముల రైతులకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమం ఉన్నందున అట్టి సభను జయప్రదం చేయుట కొరకు తొమ్మిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ గత 70 సంవత్సరంల నుండి ఎర్రపహాడ్ దొరలు భూములు అమ్మి రైతుల కు పట్టాలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న గత ప్రభుత్వం 10 సంవత్సరలు రైతులను పట్టించుకోలేదు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి రైతుల కష్టాలు తీర్చడానికి 979 మంది రైతు కుటుంబాలకి 1887 ఎకరాల భూమి పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వబోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం,భూ భారతి ధ్వారా రైతుల కష్టాలు తీర్చడం జరుగుతుంద అని వారు తెలియజేశారు.తదనంతరం జరగబోయే సభను అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కమిటీ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాసరావు, తభిత,ఎంపీడీవో సునీత మండల పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి పచ్చిపాల వెంకన్న యాదవ్ రేగటి రవి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే



**నవాబుపేట్ ఆగస్టు 28 (జనం సాక్షి) :** నవాబు పేట్ మండల పరిధిలోని దాతపూర్ గ్రామంలో శుక్రవారం దాతాపూర్ గ్రామ సర్పంచిమాలిస్ బలవంత రెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై భూభారతి రీసర్వే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దాతాపూర్ గ్రామంలో భూమి సమస్యలను పూర్తిగా సర్వే చేసి గ్రామంలోని ప్రజలందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు ఉన్న భూమి సమస్యలు తీర్చిదిద్దాలని మండల తాసిల్దార్ బుచ్చయ్యకు సూచనలు అందజేశారు. ప్రజలకు ఉన్న సమస్యలను పూర్తిగా నెరవేర్చాలని గ్రామంలోని వారికి స్మార్టేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ కిత సింగ్, పిఏసిఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, గడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావు గారి వెంకటరెడ్డి, వివిధ గ్రామ సర్పంచులు, శేఖర్, సంతోష్ రెడ్డి, శోభన్ పరమేశ్వర్, కిష్టయ్య, దుర్గయ్య, జగన్ రెడ్డి, శ్రీనివాస్, మండల సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూగ్రామంలో భూభారతి రీసర్వే ప్రక్రియను పరిశీలించి, రైతులను మరియు గ్రామస్తులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, ఉపసర్పంచ్లు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, మండల సీనియర్ నాయకుడు, పంచాయితీ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

**వేములవాడ, ఆగస్టు 28 (జనంసాక్షి):** వేములవాడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా అనేక మంది నిరాశ్రయులకు సొంత ఇల్లు నిర్మాణం చేసుకోవడం ఆనందకరమని ఆయన అన్నారు.

## గురుకుల విద్యార్థి అదృశ్యం కలకలం

**స్థానికుల చొరవతో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు.**

**తాండూరు అగస్టు 28(జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో గురుకుల విద్యార్థి అదృశ్య ఘటన కలకలం రేపింది.తాండూరు పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న అక్షిత్ అనే విద్యార్థి హాస్టల్ నుండి వెళ్లిపోయాడు. దీంతో హాస్టల్ సిబ్బంది, తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అయితే తాండూర్ నుండి నడుచుకుంటూ వెళున్న విద్యార్థిని మోమిన్ పేట్ మండల సమీపంలోని నయారా పెట్రోల్ పంప్ వద్ద స్థానికులు గుర్తించారు. వెంటనే విద్యార్థిని అడిగి వివరాలు తెలుసుకుని అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అనంతరం విద్యార్థిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థి క్షేమంగా దొరకడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

# చౌటుప్పల్‌లో 20.360 కిలోల గంజాయి పట్టివేత

**ఇద్దరు ఒడిశా వాసుల అరెస్ట్**




**చౌటుప్పల్, ఆగస్టు 28(జనం సాక్షి) :** అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 20.360 కిలోల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు మరియు ఒక ఫ్రాంక్స్ కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చౌటుప్పల్ డిఎస్‌పి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు, సీఐ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో ఈగల్ ఫోర్స్ సహకారంతో చౌటుప్పల్ ఎస్.ఐ ఎస్. కృష్ణమాల్ తన సిబ్బందితో కలిసి గురువారం ఎన్ హెచ్-65 హైదరాబాద్ మార్గంలోని ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారంతో చేపట్టిన ఈ తనిఖీల్లో ఒడిశాకు చెందిన ఫ్రాంక్స్ కారును అనుమానాస్పదంగా గుర్తించి తనిఖీ చేశారు.

కారు డిక్కీని తనిఖీ చేయగా బ్రౌన్ టేపుతో చుట్టి ఉన్న 20 ప్యాకెట్లలో మొత్తం 20.360 కిలోల గంజాయి లభించింది. ఒడిశా రాష్ట్రం కేంద్రపారా జిల్లా రాజ్‌నగర్‌కు చెందిన త్రిలోచన్ సామంత్రా (30), సాగర్‌బాల్ (23)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలో తక్కువ ధరకు కొనుగోలు చేసి తెలంగాణలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో నిందితులు అంగీకరించారు. ఈ అక్రమ రవాణాకు గాను తమకు రూ. 50,000 ఆఫర్ చేసినట్లు తెలిపారు. కేసులో ప్రమేయం ఉన్న మిగతా వ్యక్తులపై దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.ఎన్ డి పి ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# సూర్యాపేట ఉద్యమాలు విఫలమైనట్లు చరిత్రలో లేదు



**సూర్యాపేట(జనంసాక్షి):** ఉమ్మడి జిల్లాలో సూర్యాపేటలో జరిగిన ఉద్యమాలు విజయం సాధించకుండా విఫలమైన సంఘటనలు చరిత్రలో లేవని బిజెపి రాష్ట్ర నాయకురాలు పాదూరి కరుణ అన్నారు.శుక్రవారం సూర్యాపేటలో బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో 15వ రోజు రైతు సంఘం నాయకులు పాల్గొనగా దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు.సూర్యాపేటకు కొన్ని శతాబ్దాలుగా వాణిజ్య వ్యాపార పరంగా ఆసియా ఖండంలోని మంచి గుర్తింపు ఉందని, అలాంటి పట్టణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.బ్రిటిష్ వారి కాలంలోనే సూర్యాపేటకు రైలు సౌకర్యం కల్పించాల్సి ఉండగా భూస్వాముల పెత్తందార్ల నిరంకుశత్వం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షల కోట్లు ఖర్చు చేసి విద్యుత్ తో రైళ్ళు నడిచే విధంగా వేగవంతమైన రైలు ప్రయాణం సౌకర్యం కల్పించిందన్నారు.శిథిలావస్థలో ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను ప్రపంచ స్థాయిలో సుందరీకరణ చేస్తుందన్నారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ కొనసాగించేందుకు బిజెపి తరఫున పోరాడుతామని హామీ ఇచ్చారు.దీక్షలో కూర్చున్న వారందరికీ రాఖీ పండుగ సందర్భంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.వీరి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ ఉన్నారు.రిలే నిరాహార దీక్షలో శుక్రవారం సీపీఎం అనుబంధ సంస్థ రైతు సంఘం ఆధ్వర్యంలో సభ్యులు పాల్గొన్నారు.ఈ దీక్షలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున రెడ్డి, కాకి శంకర్ రెడ్డి, దండ వెంకటరెడ్డి, అవిరి అప్పయ్య, కొప్పుల రజిత, వీరబోయిన రవి, నెమ్మది లాజర్, శేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రామ్ రెడ్డి, జనార్దన్ గౌడ్, కృష్ణారెడ్డి, వీరస్వామి, పుల్లయ్య, వీరారెడ్డి, శేఖర్, యాదయ్య, మోహన్ రెడ్డి, సర్దార్ కృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో 15వ రోజు దీక్షలో పాల్గొన్న వారికి బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు.బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, గుర్రం సత్యనారాయణరెడ్డి, జీవన్ రెడ్డి, జీడి బిక్షం, నెమ్మాది బిక్షం, సాగర్ రెడ్డి, సీపీఎం నాయకులు వేల్పుల వెంకన్న,కోట గోపి, జర్నలిస్ట్ వజ్జె వీరయ్య, నాయకులు బుద్ధ సత్యనారాయణ, అఖిలపక్ష నాయకులు రమణాచారి, ధర్మార్జున్, డేవిడ్ కుమార్, కొత్తపెల్లి శివకుమార్, బూర వెంకటేశ్వర్లు, తల్లమల్ల హసీన్,చల్లమల్ల నరసింహ, వెలుగు వనిత, పేర్ల నాగయ్య, భయ్యా మల్లికార్జున్,సట్టునాగయ్య సంఘీభావం తెలిపారు.

# అనలైజర్ల ట్యాంపరింగ్ నియంత్రణపై టీజీపీసీబీ వర్క్‌షాప్



**సనత్‌నగర్, ఆగస్టు 28 (జనంసాక్షి):** పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణను మరింత పటిష్టం చేసేందుకు ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థలపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సాంకేతిక, శాస్త్రీయ అధికారులకు అవగాహన కల్పించింది. "పరిశ్రమలు మరియు నియంత్రణ సంస్థలకు సాంకేతిక పరిష్కారాలు-అనలైజర్ల ట్యాంపరింగ్‌ను నియంత్రించడం" అనే అంశంపై గురువారం సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో ఒకరోజు సామర్థ్య నిర్మాణ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థల నిపుణుడు డా. ఎస్. సురేష్‌కుమార్ వివిధ అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. నిరంతర ఉద్గార పర్యవేక్షణ వ్యవస్థలు (జజుమీా), ఆన్‌లైన్ వ్యర్థజల పర్యవేక్షణ, నిరంతర పరిసర గాలి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థలు, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థలు, వాయు కాలుష్య నియంత్రణ పరికరాల పనితీరు, సామర్థ్య మదింపుపై వివరించారు.

అనలైజర్ల క్యాలిబ్రేషన్, సర్టిఫికేషన్లు, వివిధ రకాల అనలైజర్లు, CEMSలో వాటి వినియోగం, క్యాలిబ్రేషన్ తరచుదనం, పరిశ్రమల్లో అనలైజర్ల ట్యాంపరింగ్‌ను నియంత్రించే విధానాలు, డేటా ధ్రువీకరణ తదితర అంశాలను చర్చించారు. సిమెంట్, థర్మల్ పవర్, ఫార్మా పరిశ్రమలకు సంబంధించిన కేస్ స్టడీలను కూడా వివరించారు. ఈ సందర్భంగా టీజీపీసీబీ సభ్య కార్యదర్శి జి. రవి, ఐఏఎస్ మాట్లాడుతూ పరిశ్రమల తనిఖీలు, పర్యవేక్షణ సమయంలో ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థల మూల్యాంకనం, జజుమీా పనితీరును ధ్రువీకరించడంలో ఈ వర్క్‌షాప్ సాంకేతిక, శాస్త్రీయ అధికారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.వర్క్‌షాప్‌కు టీజీపీసీబీ ప్రధాన కార్యాలయం, జోనల్, ప్రాంతీయ కార్యాలయాలకు చెందిన సాంకేతిక, శాస్త్రీయ అధికారులు హాజరయ్యారు.

# కరీంనగర్‌లో భారీగా మత్తు పదార్థాలు పట్టివేత

***9 మంది యువకుల అరెస్ట్***

- రూ.6.50 లక్షల విలువైన హాష్ ఆయిల్, గంజాయి స్వాధీనం
- డ్రగ్ ట్యాబ్లెట్లు, సిరంజీలు, వినియోగ పరికరాలు పట్టివేత
- మెడికల్ షాప్ నిర్వాహకుడిపైనా కేసు




**కరీంనగర్ క్రైమ్, ఆగస్టు 28 (జనంసాక్షి):** కరీంనగర్ రూరల్ పోలీసులు భారీగా మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని తొమ్మిది మంది యువకులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 500 గ్రాములు/మిల్లీలీటర్ల హాష్ ఆయిల్, 500 గ్రాముల గంజాయి, 60 డ్రగ్ ట్యాబ్లెట్లు, 14 సిరంజీలు, హాష్ ఆయిల్ వినియోగ పరికరాలు, ఎనిమిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి ప్రభుత్వ అంచనా విలువ రూ.6.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ అలాం, రూరల్ ఏసీపీ ఎ. విజయ్‌కుమార్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, సిబ్బంది ఈ దాడి నిర్వహించారు. బొమ్మకల్‌లోని నేచర్ క్యూర్ ఆసుపత్రి సమీపంలో తొమ్మిది మంది అనుమానాస్పదంగా గుమిగూడి ఉండటంపై అందిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులను మొర్రి ఆకాశ్, పుట్టపాక విష్ణుసాయి, భైనవేని నితీష్, కోసిని బాలచంద్ర్, గుండు మనోహర్, విస్కుమల్లి విశాల్, గుండు కృష్ణగిరి, సిరిసిల్ల ప్రభాస్, మాకుల శివప్రసాద్‌గా గుర్తించారు. వీరి వయసు 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉన్నట్లు, కొందరు బీటెక్, డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్ చదివినవారని పోలీసులు తెలిపారు. విచారణలో అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు హాష్ ఆయిల్, గంజాయిని సేకరించి రైలు మార్గంలో కరీంనగర్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు వెల్లడైందన్నారు. అలాగే డీమార్ట్ సమీపంలోని ఓ మెడికల్ షాప్ నుంచి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా డ్రగ్ ట్యాబ్లెట్లు కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై సంబంధిత అధికారుల పరిశీలన అనంతరం మెడికల్ షాప్ నిర్వాహకుడిపైనా కేసు నమోదు చేశారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్, డ్రగ్స్ యాక్ట్‌తో పాటు వర్తించే ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలను శాస్త్రీయ పరీక్షలకు పంపి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి విక్రయాలు, సరఫరాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని కమిషనర్ గౌష్ అలాం, ఏసీపీ విజయ్‌కుమార్ అభినందించారు.

# ఎస్‌వీకే కన్స్ట్రక్షన్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి

**మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి**



**కొడంగల్, ఆగస్టు 28 (జనంసాక్షి):** కొడంగల్ మండల కేంద్రంలో మున్సిపల్ అభివృద్ధి పనులు చేపడుతున్న ఎస్‌వీకే కన్స్ట్రక్షన్ సంస్థలో గురువారం జరిగిన ప్రమాదంలో ప్రొద్దుటూరుకు చెందిన నరసింహ గౌడ్ మృతి చెందాడు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో టన్నుల కొద్దీ ఇనుప రాడ్లు ఆయనపై పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ప్రమాదం జరిగి 24 గంటలు దాటినా మృతుడి కుటుంబానికి సంస్థ యాజమాన్యం ఎలాంటి భరోసా ఇవ్వలేదని ఆరోపిస్తూ శుక్రవారం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రనపల్లి శ్రీనివాస్, బీఎస్పీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి యు. రమేష్ బాబు, సీపీఐ కొడంగల్ ఇన్‌చార్జి గంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. మృతుడు నరసింహ గౌడ్ కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని, ఆయన కుమారుల పైచదువులకు పూర్తి ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రతా ప్రమాణాలు పాటించకుండా పనులు నిర్వహిస్తున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత నిర్మాణ పనులను నిలిపివేసి విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం ఎస్‌వీకే కన్స్ట్రక్షన్ యాజమాన్యంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా 200 డిప్యూటేషన్లు రద్దు

## అక్రమ డిప్యూటేషన్లపై జనంసాక్షి వరుస కథనాలు

- స్పందించిన రాష్ట్ర విద్యాశాఖ అధికార యంత్రాంగం
- రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 79 డిప్యూటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు..


జనంసాక్షి మంగళవారం 11 ఆగస్ట్ 2026

అక్రమ డిప్యూటేషన్లకు అడ్డేది..?



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : పేద విద్యార్థులకు విద్యను బోధించాల్సిన ఉపాధ్యాయులు రాజకీయ పైరవీలతో గ్రామీణ ప్రాంతాలను గిరిజన తండాలను వదిలేసి తమకున్న రాజకీయ పలుకుబడితో హైదరాబాదు నగరానికి డిప్యూటేషన్ల పర్వం కొనసాగించారు ఏళ్లకు ఏళ్లుగా పేద విద్యార్థులకు విద్యను నష్టం చేస్తూ తమకు నచ్చిన చోటకి పైరవీలతో డిప్యూటేషన్ వేయించుకొని పేద విద్యార్థులకు విద్యను నష్టం చేస్తున్న దృశ్యాలను జనంసాక్షి వరుస కథనాలను విద్యాశాఖ అధికారులకు కళ్లకు కట్టినట్టు ప్రచురించింది గ్రామీణ గిరిజన ప్రాంతాల విద్యార్థులకు విద్య నష్టం జరుగుతుందని తేట తెల్లం చేసింది దీంతో స్పందించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు 200 అక్రమ డిప్యూటేషన్లను విద్యాశాఖ అధికారులు రద్దు చేశారు అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 79 డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు..

### పేద విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల హర్షం

అక్రమ డిప్యూటేషన్లపై జనంసాక్షి తన కలంతో వరుస కథనాలను ప్రచురించింది అక్రమ డిప్యూటేషన్లతో గిరిజన తండాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు విద్య నష్టపోవడమే కాకుండా భవిష్యత్తులో బడులు మూతపడే పరిస్థితి నెలకొందని విద్యాశాఖ అధికారులకు కల్లకు కట్టినట్టు ప్రచురించింది దీంతో స్పందించిన విద్యాశాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 200 డిప్యూటేషన్లు రంగారెడ్డి జిల్లాలో 79 డిప్యూటేషన్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు దీంతో అటు ఉపాధ్యాయ సంఘాల నేతలు విద్యార్థి సంఘాలు గ్రామీణ గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు జనంసాక్షి ప్రచురించిన వరుస కథనాలకు ధన్యవాదాలు తెలిపారు...

# ఖాకీల కండఖావరం

## కోదాడలో సీఐ వీరంగం



- బడుగు జీవిపై నడిరోడ్డుపై దౌర్జన్యం
- డబ్బా కొట్టు కోసం ధర్నా చేస్తే.. బాధితుడిపై దాడి
- మహిళలపైనా దురుసు ప్రవర్తన.. ఘటనను చిత్రీకరిస్తున్న జర్నలిస్టుపైనా దాడి

కోదాడ, ఆగస్టు 28 (జనంసాక్షి): పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అన్న చందంగా.. మూడు దశాబ్దాలుగా తమ కుటుంబాలకు కూడు, గుడ్డ, గూడు అందించిన చిన్నపాటి డబ్బా కొట్టునే తొలగించడంతో బాధితుల బతుకులు ఒక్కసారిగా తలకిందులయ్యాయి. జీవనాధారాన్ని కోల్పోయి గుండెలు పగిలేలా విలపిస్తున్న వారి మొరను పట్టించుకోకుండా, సమస్యను పరిష్కరించాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఖాకీ కండకావరం.. బడుగు జీవిపై నడిరోడ్డుపై దౌర్జన్యం! కోదాడ పట్టణంలో డబ్బా కొట్టు తొలగింపు వ్యవహారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డబ్బా కొట్టును తొలగించారని ఆరోపిస్తూ బాధితులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. తమ జీవనాధారాన్ని తిరిగి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న బాధితులపై పోలీసుల వైఖరి వివాదాస్పదంగా మారింది. గత 30 ఏళ్లుగా డబ్బా కొట్టుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని బాధితులు తెలిపారు. ఒక్కసారిగా డబ్బా కొట్టును తొలగించడంతో తమ కుటుంబాల జీవనోపాధి దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడాన్ని నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న కోదాడ సీఐ కె. శివశంకర్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న మందాల ఉపేందర్‌పై సీఐ దాడికి పాల్పడినట్లు బాధితులు ఆరోపించారు. ఉపేందర్‌ను రోడ్డుపైకి నెట్టివేసి, అనంతరం లాక్కెళ్లి పోలీసు వాహనంలో పడేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

### అడ్డుకున్న మహిళలపైనా దురుసు ప్రవర్తన

ఉపేందర్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళలను సైతం తోసివేశారని బాధితులు తెలిపారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ సమస్యను చెప్పుకునేందుకు వచ్చిన తమపై పోలీసులే దౌర్జన్యానికి పాల్పడటం ఏమిటని బాధితులు ప్రశ్నించారు.

### జర్నలిస్టుపైనా దాడి చేశారంటూ ఆరోపణలు

ఘటనను వీడియో చిత్రీకరిస్తున్న ఓ జర్నలిస్టుపైనా సీఐ రెండుసార్లు దాడికి దిగినట్లు ఆరోపణలు రావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఆందోళనకు సంబంధించిన దృశ్యాలు, పోలీసుల వ్యవహారశైలికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వీడియోల్లో కనిపిస్తున్న దృశ్యాలపై పలువురు తీవ్రంగా స్పందిస్తున్నారు.

### 30 ఏళ్ల బతుకుదెరువు ఎక్కడ?

తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా డబ్బా కొట్టును తొలగించారని బాధితులు ఆరోపించారు. మూడు దశాబ్దాలుగా అదే డబ్బా కొట్టును నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడంతో తమ బతుకుదెరువు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. "మా జీవనాధారాన్ని తొలగించారు.. కనీసం మా సమస్యను చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వకపోతే ఎలా?" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఖాకీకి అధికారం ఉందా..

### దౌర్జన్యానికి హక్కుందా?

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై పోలీసులు దురుసుగా వ్యవహరించారని బాధితులు ఆరోపించారు. ప్రజల రక్షణ కోసం ఉన్న పోలీసులు తమ సమస్యను పరిష్కరించాల్సింది పోయి తమపైనే దాడులకు దిగడం బాధాకర మన్నారు. బడుగు జీవి గొంతు వినాల్సిన అధికార యంత్రాంగమే అతని గొంతు నొక్కేలా వ్యవహరించిందంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధి కారులు వెంటనే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని బాధితులు, స్థానికులు డిమాండ్ చేశారు.

### కోదాడ సీఐ తీరుపై హరీశ్‌రావు ఫైర్

కోదాడలో డబ్బా కొట్టు తొలగింపుపై నిరసన తెలిపిన వారిపై సీఐ దౌర్జన్యంగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణలో పోలీసుల దౌర్జన్య ఘటనలు పెరుగుతున్నాయని విమర్శించారు. "తెలంగాణలో ఉన్నది ప్రభుత్వమా.. పోలీసు పాలనా? ప్రశ్నిస్తే కేసులు.. నిరసిస్తే అరెస్టులు.. హక్కులు అడిగితే దౌర్జన్యాలా? ఇదేనా ప్రజాపాలన?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఘటనపై డీజీపీ చర్యలు తీసుకోవాలని కోరారు.

# సోదరసోదరీమణుల పవిత్ర బంధానికి ప్రతీక రక్షాబంధన్

- రక్షాబంధన్ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్తకు రాఖీ కట్టిన సోదరీమణులు
- నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలు



హైదరాబాద్ (జనంసాక్షి) : అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, ఆత్మీయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నాగోల్‌లోని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో రక్షాబంధన్ వేడుకలు ఆత్మీయంగా జరిగాయి. ఈ సందర్భంగా సోదరీమణులు సోమ నాగరాణి, మంజుల ఉప్పల శ్రీనివాస్ గుప్తకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరుడికి రాఖీ కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. రక్షాబంధన్ పర్వదినం అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న పవిత్రమైన ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలను మరింత బలోపేతం చేసే గొప్ప పండుగ అని అన్నారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన సోదరీమణులు సోమ నాగరాణి, మంజులకు ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు. రక్షాబంధన్ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం, శ్రేయస్సును తీసుకురావాలని కోరుకున్నారు. సోదరసోదరీమణుల మధ్య ఉన్న పవిత్రమైన బంధానికి, పరస్పర ప్రేమకు, రక్షణకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370